

ఆంధ్రప్రదేశ్



ముక్తాకలాపకలితోర ఇవ ప్రఖ్యాతి
విష్ఫోరితం నళింపాతయుగేన వప్రం.

జూలై, 1965
25 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 9
సంచిక : 9

జూలై, 1965
ఆషాఢ-శ్రావణ 1887 శకం

ప్రధాన సంపాదకులు
టి. రామచంద్రరావు

సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

మొదటి అట్ట :

ముక్తాకలాపకలితోర ఇవ ప్రభాతి
విష్ణోరిదం సలిలపాత యుగేన వప్రం.

ఈ యిరుపాయలుగా పారుచున్న జలపాతముచేత యీ కొండచఱియ ముత్యాల హారముచేత ప్రకాశించుచున్న విష్ణువక్షస్థలము వలె శోభిల్లుచున్నది.

ఫొటో – శ్రీ యస్. ఆర్. కె. రావు

రెండవ అట్ట :

ప్రపంచమాతాపితరౌ ప్రసన్నవదనాంబుజౌ
లక్ష్మీనారాయణౌ స్యాతాం భక్తాభీష్టవరప్రదౌ.

ప్రపంచమునకు తల్లిదండ్రులై ప్రసన్నములైన ముఖకమలములు గల శ్రీ లక్ష్మీనారాయణులు భక్తులు కోరిన వరములను అనుగ్రహించువారలుగా అగుదురుగాక.

మూడవ అట్ట :

బాలబ్రహ్మేశ్వరం దేవం దేవాః గోపురసంస్థితాః
పూజయంతి ప్రతిదినం తుంగభద్రాతటస్థితమ్.

తుంగభద్రానదీతీర వాసుడైన శ్రీ బాలబ్రహ్మేశ్వర దేవుని దేవతలు గోపురమునందుండి ప్రతిదినము పూజించుచుందురు.

నాల్గవ అట్ట :

"అథ సంజాతవాలూకా కమలోత్పలశాలినీ
అశర్కరాఽశైవలా చ సరసీ సమజీవనా"


ఇసుక గలిగి కమలోత్పలాది పుష్పములచే ప్రకాశించునదై రాళ్ళు, నాచుతీగలు లేనిదై సమజలముగల తటాకము.

ఫొటోలు : శ్రీ టి. రామచంద్రరావు
ప్రధానసంపాదకులు

ఈ సంచికలో

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినని కావు

మన రాష్ట్రపతికి సుస్వాగతం...




"పారిశ్రామిక, సాంస్కృతిక సాంఘిక రంగాలలో ఆంధ్ర ప్రదేశ్ గణనీయమైన ప్రగతిని సాధించింది. ఈ ప్రగతి కృషి నిరంతరాయంగా కొనసాగుతుం దని నా ప్రగాఢవిశ్వాసము."


డాక్టర్ యస్. రాధాకృష్ణన్.




జూన్ 21వ తేదీన బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పల్కిన గవర్నరు, శ్రీమతి థానుపిళ్ళ,
శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, శ్రీమతి బ్రహ్మానందరెడ్డి ప్రభృతులు.

సర్వశ్రీ బి. వి. సుబ్బారెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య, యన్. రామచంద్రారెడ్డి, డాక్టర్ యం. చెన్నారెడ్డి,
ఎ. సి. సుబ్బారెడ్డిగార్లను రాష్ట్రపతికి పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి.







జూన్ 11 వ తేదీన పబ్లిక్ వర్క్సు శాఖామంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి గుర్రపునాడా ఆకారంలోగల సొరంగంద్వారా కృష్ణ నీటిని మళ్ళించే కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో దీనికి అధిక ప్రాధాన్యత వున్నది. నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణం సఫాలంగా పూర్తి కావడానికి ఇది ఎంతగానో ఉపయోగిస్తుంది.

నాగార్జునసాగర్ ఆనకట్ట

మళ్ళింపుసొరంగానికి ప్రారంభోత్సవం

కృష్ణా జలాలను సద్వినియోగం చెయ్యడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1955–56 లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు భారీ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టింది. మూడుమైళ్ళ పొడవూ, 400 అ. ఎత్తుగల ఆనకట్ట నొకదానినీ, తద్వారా 110 చ. మై. రిజర్వాయరును. మొత్తం 36,000 క్యూ సెక్కుల నీటిని విడుదల చేయగల రెండు కాలువలు — ఆనకట్టకు అటొకటి ఇటొకటి చొప్పున — నిర్మించడం ఈ ప్రాజెక్టులోని ప్రధాన నిర్మాణాలు. వర్షాలులేక తరచుగా పంట దెబ్బతినే ప్రాంతాలకు సాగునీటిని సరఫరాచేసి సస్యశ్యామలం చేయడం దీని ప్రధానోద్దేశం. 4,00,000 కి. వాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడానికి కూడా ఉద్దేశించబడింది.

21,000 క్యూ సెక్కుల నీటిని విడుదల చేయగల 276 మైళ్ళ పొడవున్న కుడికాలువ వల్ల మొత్తంమీద గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలలో 18.5 లక్షల ఎకరాలకూ; 15,000 క్యూ సెక్కుల నీటిని విడుదలచేయగల 140 మైళ్ళ పొడవున్న ఎడమ కాలువ వల్ల నల్గొండ, ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో 12 లక్షల ఎకరాలకూ సాగునీరు లభిస్తుంది. ఈ ఎడమకాలువను పశ్చిమ గోదావరి వరకూ 65 మైళ్ళు పొడిగిస్తే అదనంగా 4.38 లక్షల ఎకరాలకు నీటి సరఫరా సాధ్యమౌతుంది. అంతేగాక యీ ప్రాజెక్టు వల్ల ప్రస్తుతం కృష్ణా డెల్టాకు కూడా నీటిని సరఫరా చేయడమేగాక అదనంగా 1.5 లక్షల ఎకరాల సార్వాపంటకు, 1.5 లక్షల ఎకరాల దాళ్వాపంటకు, 0.25 లక్షల ఎకరాలు ఏటి పొడుగునా పండేపంటకు డెల్టా ప్రాంతంలో నీటిని అందజేస్తుంది.

ప్రస్తుతం మంజూరయిన పథకం ప్రకారం గేట్లులేకుండా యీ డాం పూర్తి ఎత్తు నిర్మితం కాగలదు. కుడికాల్వ 135 మైళ్ళ వరకూ, ఎడమకాల్వ 108 మైళ్ళవరకూ ఏర్పాటు అవుతాయి. వీటివల్ల యిరువైపులా దాదాపు 20 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. దీనికి రూ 137.5కోట్లు ఖర్చవుతుందని అంచనా.

ప్రాజెక్టు మొదటినుంచీకూడా ఆనకట్ట నిర్మాణ కార్యక్రమం పని రెండు దశలుగా విభాగించబడింది. ఒకదశ వానాకాలం – అంటే జూన్ నుండి డిశంబరువరకు. రెండోదశ మిగతాకాలం – అంటే జనవరి నుండి మే నెల వరకు. వర్షాకాలంలో రాతి ఆనకట్ట పని అంతా పార్శ్వాలలో నీటిని మళ్ళించే రాతి కాఫర్ ఆనకట్టవద్ద జరుగుతుంది. ఆతరువాతిదశలో అడ్డకట్లవల్ల కాలువద్వారా నీటిని మళ్ళించి నదీగర్భంలోనూ పని ప్రారంభిస్తారు. నదీగర్భాన్ని దాటి ఆనకట్ట నిర్మాణం పెరిగినతర్వాత ఆనకట్టకు 9 అడుగుల వ్యాసంగల ఆరు తూములను అమరుస్తారు. వీటివల్ల రెండవ దశలో – అంటే వానలులేని కాలంలో – నదిలోగల కొద్దిపాటి నీరు బయటకు పోవటంవల్ల నదివైపు భాగంలో ఏమాత్రం ఆటంకం లేకుండానే నిర్మాణ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ ఏర్పాటుతో 1965 మే నాటికి దాదాపు 140 మిలియన్ క్యూబిక్ అడుగుల సున్నం, రాయి, కాంక్రీటు ఖర్చయ్యింది. నదివైపున సుమారు 130 అ. ఎత్తు పెరిగింది. ఎడమపార్శ్వం వైపున దాదాపు 200 అ. కుడి పార్శ్వంలో దాదాపు 270 అ. ఎత్తున పెరిగింది.

నిర్మింపబడుతున్న తూములను పనిచేయించడం, ఉన్నత స్థాయిలో యీ తూములను మూసివేయడం చాలా కష్టసాధ్యమైన పని అయినందువల్ల కృష్ణాజలాలను రాతిడాంకు ఎడమవైపు చివర నుంచి 250 అ. దూరంలో కాంక్రీటుమలాము చేయబడిన మళ్ళింపు సొరంగంద్వారా మళ్ళించాలని ఉద్దేశించారు. దీనివల్ల 1966 జనవరినుండే కృష్ణాడెల్టాలో సుమారు 4 లక్షల ఎకరాల దాళ్వా పంటకు సక్రమంగా నీటిసరఫరా లభిస్తుంది.

ఈ సొరంగం గుర్రపు నాడా ఆకారంలో వుంటుంది. వెడల్పు 27 అ. గలిగిన యీ సొరంగం 300 అ.ఎత్తున ప్రారంభమై పోను పోను క్రిందికిదిగి చివరకు 280 అ. దిగువకు వెళ్తుంది. దీనిపొడవు 2590 అడుగులు. దీనిలో 20 వేల క్యూ సెక్కుల నీరు విడుదలవుతుంది. ఇది కృష్ణాడెల్టాకు కావలసిన గరిష్టమొత్తం. ముఖ్యనది లోతట్టుమీద ఏర్పడిన రిజర్వాయరు ఎగువభాగంకు యీ సొరంగం కలపబడింది. అక్కడ సొరంగం మొదట్లో 10 అ. × 28 అ. దీర్ఘ చతురస్రాకారపు గేట్లు ప్రధానమైనవి రెండు వుంటాయి. అత్యవసర పరిస్థితుల్లో వుపయోగించడానికిగాను ప్రధానమైన గేట్ల ముందు 10 అ. × 28 అ. గల గేట్లు రెండు వుంటాయి.

ఈ సొరంగాన్ని శాశ్వతంగా కృష్ణాడెల్టాకు నీటి సరఫరా చేయడానికి వుపయోగించేందుకు గాను ఇ. ఎల్. 400 వద్ద మరొక సొరంగంతో కలుపుతారు. ఎలివేషన్ 400 వద్ద ఎగువ ప్రవాహంలో నీరు ఈసొరంగంలోకి రాకుండా 10అ × 25అ. సర్వీసుగేట్లు రెండు, సర్వీసు గేట్లముందు 10 అ. × 28 అ. ఎమర్జన్సీ గేట్లు రెండు వుంటాయి. రిజర్వాయరులో నీరు ఇ. ఎల్. 500 కు తక్కువగా వున్నప్పుడు కృష్ణలోకి నీటిని వదలడానికి యీ గేట్లనువుపయోగిస్తారు. 400 ఇ. ఎల్. వద్ద సొరంగంలోకి నీటిని పంపేముందు 300 ఇ. ఎల్. వద్ద సొరంగాన్ని శాశ్వతంగా నీటిమట్టంవద్ద మూసివేసి, 300 ఇ. ఎల్. వద్ద సొరంగం అత్యవసర గేట్లను తీసివేసి, వాటిని 400 ఇ. ఎల్. వద్ద అమరుస్తారు.

ఈ సొరంగానికై గ్రెనైట్ రాతిలో 2.2 మిలియన్ల క్యూబిక్ పుట్లు త్రవ్వారు. దానికి సిమ్మెంటుకాంక్రీటు పూత పూశారు. ఈపూత 12 అం. నుండి 24 అం. వరకు మందం వుంది. ఇందుకై మొత్తం 3700యూనిట్ల కాంక్రీటును వినియోగించారు. ఈరాతి త్రవ్వకాన్ని స్వీడిష్ పద్ధతిలో చేశారు. దీనికిగాను గేలజైన్లను, ఎలక్ట్రిక్ డిటొనేటర్లను ఉపయోగించి రాళ్ళను పగలగొట్టారు. ఇ. ఎల్. 300 వద్ద సొరంగానికి 58 లక్షల రూపాయలు ఖర్చయింది. 15 నెలల్లో యీపని పూర్తయింది. ఈ సొరంగం పనిలో క్యూబిక్ పుట్ ఖరీదు రు. 3.16 మాత్రమే. భారతదేశంలోని ఎక్కడిరేటుతో పోల్చినా యిది చవకే.

ఇ. ఎల్. 300 వద్ద సొరంగంలో లోపలిచట్రానికి వెయ్యి యూనిట్ల కాంక్రీటు, 800 టన్నుల ఉక్కు వినియోగించారు. 1965 మార్చిలో ప్రారంభమైన యీ నిర్మాణ కార్యక్రమం 1965 మేనాటికి పూర్తయ్యింది. గేట్లను ఏర్పాటుచేస్తూ కాంక్రీటుపని చేయడం, యింత తక్కువ వ్యవధిలో యింత చిక్కైన నిర్మాణాన్ని పూర్తిచేయడం – నిజంగా మెచ్చుకోదగినది. డిజైనులోనూ, ఏర్పాటులోనూ కూడా యిది భారతదేశంలోనే అపూర్వమైన నిర్మాణం అనవచ్చు.

పంచతంత్రము

(గత సంచిక తరువాయి)

దమనకుడు సంజీవకునకు దంతిలుని కథ యీ విధముగా చెప్పుచున్నాడు.

వర్ధమానము అను పట్టణము కలదు. అచ్చట దంతిలుడు అను పేరుగల ఒక గొప్ప ధనవంతుడు ఉండెను. అతడు ఆ పట్టణమున కంతటికి నాయకుడుగా నుండెను. పౌరుల కార్యమును, రాజు కార్యమును, ఇరువురికి సంతుష్టి కలుగునట్టుగా నిర్వహించుచు, ఇరువురకు అభిమాన పాత్రుడుగా ఉండెను. అంతటి నేర్పరి యెచ్చటను లభించడు.

ఇట్లు కొంత కాలము గడువగా ఒకప్పుడు దంతిలునికి వివాహము జరిగెను. పెండ్లి విందుకు అందరు పౌరులు, రాజకీయ ఉద్యోగులు పిలువబడిరి. దంతిలుడు అందరికి సమానముగా విందు చేసి సత్కరించెను. వివాహానంతరము రాజును అంతఃపుర స్త్రీలతోసహా తన యింటికి ఆహ్వానించి పూజించెను. ఆ సందర్భమునందు రాజభవనమును ఊడ్చి పరిశుభ్రము చేయు "గోరంభుడు" అను పేరుగల రాజసేవకుడు కూడ ఆ పెండ్లికి వచ్చియుండెను. కాని అతనిని అనుచిత స్థానమునందు కూర్చొనబెట్టి ఆదరించక అవమాన పరచెను. గోరంభుడు నాటినుండి అవమానమునకు బాధపడుచు రాత్రులలో నిద్రలేక చింతిల్లుచుండెను. దంతిలుని ఏలాగైనను రాజభవనములో అడుగు పెట్టకుండా చేయవలెనని ప్రయత్నించుచుండెను.

ఒకనాడు ప్రాతఃకాలమునందు రాజు నిద్రించుచున్న గదిని ఊడ్చుచు.

గోరంభుడు:— "ఆహా! దంతిలునికి ఎంత గర్వము. రాజుగారి పట్టపుదేవిని ఆలింగనము చేసికొనెనుకదా" అని మెల్లగా గొణిగెను.

రాజు:— (ఆమాట విని తొందరగా లేచి) గోరంభా! నీ విప్పుడు అన్నమాట సత్యమా!

గోర:— దేవరా! రాత్రి అంతయు జూదమాడుచు నేను మేల్కొని యుంటిని. నా కనులపైన బలాత్కారముగా నిద్రవచ్చుచున్నది కనుక నేను ఏమి మాట్లాడినది నాకే తెలియకున్నది.

రాజు:— (అసూయతో తనలో) మా భవనములో గోరంభునికివలెనే దంతిలునికి కూడ స్వతంత్రముగా అన్ని చోట్ల తిరుగాడు చనవు కలదు, కావున నెప్పుడైన నొకప్పుడు దేవిని దంతిలుడు ఆలింగనము చేసికొని యుండును. దానిని గోరంభుడు చూచి యుండును. ఆమాటనే అప్రయత్నముగా నితనినోట వెలువడి యుండును. స్త్రీలను నమ్ముటకు వీలు లేదు."

అని అనేక విధములుగా రాజు దుఃఖించి ఆనాటినుండి దంతిలునికి రాజభవనములో ప్రవేశము లేకుండా కట్టడి చేసెను. తుదకు రాజద్వారము చేరుటకు కూడా అతనికి ఆజ్ఞ నివ్వలేదు.

దంతిలుడు నిష్కారణముగా రాజునకు తనపై కోపము కలిగినందుకు చింతించుచు "నేనెప్పుడుకూడ రాజునకుగాని రాజ సంబంధులకుగాని కలలోనైన అనిష్టము చేయ తలపెట్టలేదు. రాజు ఇప్పుడు నాకు విముఖు డగుటకు కారణ మేమై యుండును.? అని తలచి ఒకనాడు రాజద్వారమును సమీపించెను. అతనిని ద్వారపాలకులు అడ్డగించిరి. అప్పుడు గోరంభుడు అతనిని చూచి పరిహాసించి ద్వారపాలకులతో "రాజభవనములో స్వేచ్ఛగా సంచరించుచు దంతిలుడు నిగ్రహానుగ్రహములను చేయుటకు సమర్థుడుగా నుండెను. అట్టివానిని మీరు ఇప్పుడు అడ్డగించిన యెడల అతడు నన్నువలెనే మిమ్ములను కూడ నెట్టగలడు సుమా" అని యనెను.

ఆమాట విని దంతిలుడు "నిజముగా నిది గోరంభుని కార్యమే. ఎంతచిన్నవాడైనను కుత్రలు పన్ని పెద్దవారిని పడద్రోయ గలడు," అని మిక్కిలి విచారించి తన యింటికి పోయి ఒకనాటి మునిమాపున గోరంభుని తనయింటికి పిలపించి రెండు నూతన వస్త్రములను అతనికి బహూకరించి "భద్రుడా! ఆనాడు నిన్ను నేను కోపము చేత అవమాన పరచలేదు. నీవు పెద్దవారికంటె ముందుగా నీకు అనుచితమైన స్థలములో కూర్చొని యుండినందు వలన నీకు అవమానము జరిగినది, క్షమించుము."

గోరంభుడు ఆ వస్త్రద్వయము చేతను మంచి మాటల చేతను సత్కరింపబడి తనకు స్వర్గరాజ్యము దొరికినంతగా ఉబ్బిపోయి "మహాభాగా! మీరు నాకుచేసిన అవమానము నేటితో మాసిపోయెను. నా మనస్సు శాంతిల్లినది. కావున నా బుద్ధి ప్రభావముచేత నీకు జరగబోవు మేలును చూచెదవుగాక" అని చెప్పి సంతోషముతో గోరంభుడు వెడలిపోయెను.

మరునాడు గోరంభుడు పూర్వము వలెనే నిద్రించుచున్న రాజు గదిని శుభ్రముచేయుచు "ఆహా! మారాజు ఎంత అవివేకి. మలవిసర్జనము చేయుచు దోసకాయను తినుచున్నాడు కదా" అని గొణిగెను.

రాజు అదివిని ఆశ్చర్యముతో "గోరంభా! యిష్టము వచ్చినట్లుగా

వేదరుచున్నావా? ఇంటి పనివాడవనినిన్ను క్షమించుచున్నాను. నేను ఆ విధముగా చేయుట నీ వెప్పుడైనను చూచితివా?" అనెను.

గోరంభుడదివిని "దేవరా! రాత్రియంతయు జూదమాడుచు మేల్కొని యుండి యిప్పుడు ఊడ్చుచున్న నాకు నిద్రమబ్బు వచ్చి యేమేమో వదరినాను. అది లెక్కచేయక నన్నుక్షమించి అనుగ్రహించుడు" అని అనెను.

ఆమాటవిని రాజు గోరంభుని మాటలు అసంబద్ధ ప్రలాపములు. నేను జన్మాంతరములోను, కలలోనైనను మలవిసర్జనము చేయుచు దోసకాయ తిని యుండను. ఇప్పుడు మాట్లాడినట్లుగానే యితడు ఆనాడు దంతిలుని గూర్చి కూడా అసంబద్ధముగా వదరి యుండును. ఇట్టి వదరుబోతు మాటలను విశ్వసించి పాపము దంతిలుని అవమాన పరచితిని. అంత ఉత్తముడు ఇంతటి చెడుపనిని చేసి యుండడు. అతడు నావద్ద లేనందువలన రాజకార్యములు, ప్రజాకార్యములు చక్కగా నెరవేర కున్నవి" అని అనేకవిధములుగా మనస్సులో విమర్శించుకొని దంతిలుని పిలిపించి అతనిని వస్త్రాభరణాదులతో సత్కరించి తిరిగి అధికారములో అతనిని నిల్పెను.

పై కథను దమనకుడు సంజీవకునికి చెప్పగా విని—

సంజీవకుడు:— భద్రుడా! అది నిజమే, నీవు చెప్పినట్లే చేసెదను.

ఆమాటవిని దమనకుడు సంజీవకుని వెంటబెట్టుకొని పింగళకుని వద్దకు పోయి "దేవరా! యిదిగో సంజీవకుని తోడ్కొని వచ్చితిని. తర్వాత దేవర చిత్తము" అని అనెను.

సంజీవకుడు సాదరముగా పింగళకునికి నమస్కరించి వినయముతో అతనివద్ద నిలిచెను. పింగళకుడు తన కుడిచేతితో అతని శరీరము నిమురుచు ఆదరించి "క్షేమమా! యీ నిర్జనారణ్యమునకు నీవేల వచ్చితివి," అనెను.

ఆ మాటవిని సంజీవకుడు వర్ధమానునితో తను విడిపోయినప్పటి నుండి జరిగిన వృత్తాంతము నంతయు సవిస్తరముగా చెప్పెను. అదివిని పింగళకుడు ఆదరపూర్వకముగా "మిత్రమా! భయపడకుము. నా రక్షణములోనుండి నీవు యథేచ్ఛముగా ఇక్కడ ఉందువు గాక. నన్ను విడవకుండా ఎల్లప్పుడు నాఅండలో ఉండుము. ఎందుకనగా ఈ వనములో భయంకరములైన అనేక క్రూర మృగములు పెద్దపెద్ద జంతువులనుకూడా భాదపెట్టు చుండును. కావున గడ్డితిని బ్రతుకు నీవంటివానికి ఇచ్చట బ్రతుకుట కష్టము" అని చెప్పి పింగళకుడుకరటకదమనకులపై రాజ్యభారమును ఉంచి సంజీవకునితో ఇష్టాగోష్ఠి జరపుమా సుఖముగానుండెను.

(సశేషం)



గాంధీ వాణి

విద్యార్థులు-ప్రార్థన

బళ్ళకొద్దీ పుస్తకాలు చదివి, అందులోని బరువునంతా బుర్రలో కెక్కించుకుని విద్యార్థులు ఎలా పాడవుతున్నారో నాకు తెలుసు.

కొంతమంది మానసిక స్థిమితాన్ని పోగొట్టుకునీ, యింకొంతమంది పాడయి పోయీ మరికొంతమంది వెర్రివాళ్ళయీ జీవితాన్ని గడుపుతున్నారు.

ఎందువల్లనంటే సైతాను మనకన్నా శక్తి గలది. మనిషి ఎప్పుడూ మనిషే. అందువల్ల శక్తి వున్నంతవరకూ ప్రయత్నించు — అని వారు అన్నప్పుడు వారిని చూసి జాలిపడుతుంటాను నేను.

'మమ్మల్ని అంటుకున్న అపవిత్రతను మేము కడుక్కోవడం ఎలాగో చెప్పండి'- అంటూ విచారవదనంతో అడుగుతారు వారు.

రామనామ మంత్రోచ్చారణ చేస్తూ, భగవంతుని ముందు మోకరిల్లి, అతని సహాయాన్ని అర్థించండి అని నేను సలహా యిచ్చినప్పుడు వారు నా వద్దకు వచ్చి అంటారు. 'దేవుడు ఎక్కడున్నాడో మాకు తెలియదు. ఏమని ప్రార్థించాలో, ఎలా ప్రార్థించాలో, ఏమిటో మాకు తెలియదు.' అల్లాంటి స్థితికి వాళ్ళు దిగజారిపోయారు।

నాకు ఎప్పుడూ ఒక తమిళసూక్తి జ్ఞాపకానికొస్తుంటుంది. దాని అర్థం 'దిక్కులేని వారికి దేముడే దిక్కు' అని.

ఆయన సహాయాన్ని నువ్వు కోరాలంటే వ్యామోహా లన్నిటినీ పరిత్యజించి, కోర్కెలు లేని మనసుతో, తనవంటి పతనమైనవాడిని ఏ విధంగా ఆయన రక్షించగలడు ?— అన్న సందేహంగానీ, భయంగానీ లేని పరిపూర్ణ విశ్వాసంతో దేవుడి ఎదుటకు వెళ్ళాలి

తనను వెతుక్కుంటూ వచ్చిన కోట్లాది ప్రజలను రక్షించిన ఆయన నీ హృదయంలో నిరాశను నింపుతాడా ?

ఆయనకు తరతమ వ్యత్యాసాలు లేవు. నువ్వు చేసే ప్రతీప్రార్థనకూ ఆయన సమాధాన మిస్తాడు.

కలుషితమై దుర్గంధ భూయిష్టమైన ప్రార్థనను కూడా ఆయన ఆలకించి సమాధానం పలుకుతాడు.

ప్రార్థన అంటే మాటల వల్లింపుకాదు. శ్రావ్యమైన గానం కాదు. కేవలం మంత్రోచ్చారణ చేయడంకాదు. హృదయాన్ని కదిలించలేని రామనామ మంత్రోచ్చారణ ఎన్నిసార్లు జపించినా నిష్ప్రయోజనమే. హృదయాంతరాళంనుండి రాని మాటలలో ప్రార్థన చెయ్యడంకన్న కోరిక ల్లేని శూన్య మనస్సుతో కొలవడమే మేలు. ఆకలిగొన్న ఆత్మకు ప్రార్థన అనే ఆహారం కావాలి. ఆకలిగొన్నవాడు పసందైన ఆహారంతో ఎలా తృప్తిపడతాడో, ఆకలిగొన్న ఆత్మ హృదయంలోంచి పొర్లి ప్రవహించే ప్రార్థనతో అలా తృప్తి పడుతుంది.

నా అనుభవంలోంచి చెప్తున్నాను. ప్రార్థనలో తన్మయత్వం చెందే వ్యక్తి ఆహారం లేకపోయినా రోజులతరబడి వుండగలడు. ప్రార్థన చేయకుండా ఒక్క క్షణమన్నా వుండలేడు అని నా అనుచరులకు చెప్తుండే వాడిని నేను. ప్రార్థన లేనిదే చిత్తశాంతి లభ్యంకాదు.

నా వ్యక్తిగత అనుభవంతో యీ విషయాన్ని చెప్తున్నాను నేను. నేను మానసిక ప్రశాంతతను పొందగలిగాను మొట్టమొదట పరలోకానికై ప్రయత్నించు. అప్పుడు నీకు సర్వమూ లభిస్తుంది.

ఒంటరిగా దైవప్రార్థన చేస్తూఉంటారు. అయితే పదిమందితో కలిసి ప్రార్థన చేయడానికి ఎవరూ సిగ్గుపడ నవసరం లేదు. మనిషి సంఘజీవి. ఆడవారూ, మగవారూ కలిసి తింటున్నప్పుడు, కలిసి ఆడుకుంటున్నప్పుడు, కలిసి పనిచేస్తున్నప్పుడు, కలిసి ప్రార్థన మాత్రం ఎందుకు చేయగూడదు ? నలుగురి చూపుల్నించీ తప్పించుకునివెళ్ళి ప్రార్థన చేసుకోవా లని ఎవరైనా ఎందుకు అనుకోవాలి ? అలా చెయ్యడంలో ఏమైనా పాపం వుందా ? అందుకు సిగ్గుపడాలా ? అది నలుగుర్లోనూ పలుకగూడనిదా ?

విశ్వమానవ కుటుంబాన్ని ఒక్కత్రాటి మీద నిలపగలిగే మహాశక్తి సామూహిక ప్రార్థనలో వుంది.

ప్రార్థనద్వారా దేవుడిలో ఐక్యతను ఆశించే వ్యక్తి ప్రతివ్యక్తిలోనూ తనను దర్శించుకుంటాడు. హెచ్చు తగ్గు లనేవి వుండవు. ఒక ఆంధ్రుడికీ, అరవవానికీ; ఒక కన్నడవానికీ, మలయాళీయునికీ మధ్య సంకుచిత ప్రాంతీయ విభేదాలుగాని, భాషా విషయమై అర్థరహితమైన కలహాలుగాని వుండవు.


అస్పృశ్యునికి సనాతనునికి మధ్య, ఒక హిందువుకు ఒక ముసల్మానుకు మధ్య, ఒక పార్సీ ఒక క్రైస్తవుడు లేదా ఒక సిక్కుకు మధ్య ఏ విధమైన ద్వేషకారణమైన వ్యత్యస్తమూ లేదు.

అదే విధంగా ఒకే సమూహంలోని వివిధ సభ్యులమధ్యగాని, వివిధ వర్గాల మధ్యగాని వ్యక్తిగతమైన ఆధిక్యతకు ప్రాకులాడవలసిన పని లేదు.

నిజమైన ప్రార్థన ఎట్టి పరిస్థితులలోనూ అలక్షింపబడదు.

దర్శనీయ స్థలాలు - 3


ఫొటోలు : ప్రధాన సంపాదకులు




రాష్ట్రపతి భవనం.

ఢిల్లీ

ఢిల్లీ ఒక విచిత్రమైన నగరం. భారతీయులకు రాజధాని. అధికారానికీ, సంస్కృతికీ కూడలి. విదేశీయులు యీ నగరాన్నిగూర్చి వార్తాపత్రికల్లో చదివివుంటారు. టెలివిజన్లలోనూ, సినిమాల్లోనూ చూసివుంటారు. వారికి యిదొక వింతైన, విచిత్రమైన పట్టణం. పురాతన శిథిల శకలాలతో, ఆధునిక నాగరిక దర్పణాలతో, చిరిగిపోయిన జరీ పంచెలాంటి రాచరికపు ప్రాభవంతో, పరచుకున్న సామ్యవాద ప్రజాస్వామ్య ప్రణాళికా దీధితులతో, గాలిలోకి పొడుచుకొచ్చిన శిఖరాల్లాంటి మొగలు బురుజులతో, పాలిపోయిన ఎరుపురంగులో దీనంగా నిలచినట్లున్న బ్యాంకులతో విదేశీయులను ఆశ్చర్యంలో, ఒక్కొక్కప్పుడు అయోమయంలో ముంచేత్తే నగరం. జాజ్వల్యమైన గతంలోంచి నడిచివచ్చి, ఉత్తేజకరమైన వర్తమానంలో నిలచి, ప్రదీప్తమైన భవిష్యత్తులోకి చూస్తోన్న నగరం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ప్రపంచంలోని ముఖ్య యాత్రాస్థలాలలో ఒకటిగా రూపొందిన నగరం — ఈ ఢిల్లీ.



ఇప్పుడు నెహ్రూ స్మారక ప్రదర్శనశాలగా రూపొందిన తీన్‌మూర్తి భవనం.




తీన్‌మూర్తి భవనంలో నెహ్రూజీ ఆఫీసుగది.




నెహ్రూజీ చదువుకొనేగది.




పార్లమెంటు భవనం.




ఆకాశవాణి నిలయం.



బిర్లామందిరంలోని లక్ష్మీనారాయణ విగ్రహం




కృషి భవన్.



కేంద్ర సచివాలయం.

లేపాక్షి

అనంతపురం జిల్లాలోని హిందూపూర్ రైలుస్టేషన్‌కు పడమైళ్ళదూరాన లేపాక్షిగ్రామం ఉంది. విజయనగర వాస్తు శిల్ప పద్ధతిలో నిర్మితమైన లేపాక్షిదేవాలయం చాలాసుందరమైనది. ఇప్పటికీ లేపాక్షి దేవాలయంలోపల పైభాగాన గోడలమీద అనేకమైన వర్ణచిత్రాలు ఉన్నాయి.



లేపాక్షి నంది.




దేవాలయం ముందటిదృశ్యం.




పవిత్రమైన అశ్వత్థవృక్షం.




అసంపూర్ణంగా నిర్మితమైన కల్యాణమంటపం.




మధ్యపెన్నారు ప్రాజెక్టు దగ్గరున్న అతిధిగృహం — "పినాకిని"




యాత్రికగృహం — లేపాక్షి.




అనంతపురంజిల్లా ఇల్లూరులోని విశ్రాంతిభవనం "హిల్ క్రెస్ట్."



మధ్యపెన్నారు కాలువమీద సస్పెన్షన్ బ్రిడ్జి.



కర్నూలు జనరల్ హాస్పిటల్.



కర్నూలులోని బిర్లామందిరం.

బతికిన కాలేజి

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్ 4

శంకరయ్య జ్యోతిషంలో దిట్ట. ఆ యింట్లో అందరికందరూ తలా ఒక తరహా మనుషులు. కూతురు రాధ పెళ్ళి సంబంధం నిమిత్తం పెళ్ళిళ్ళ పేరయ్య, పట్టూ, మరి కొంతమంది పరివారంతో అకస్మాత్తుగా అడుగుపెడతాడు. పెళ్లిళ్ళ చూపులు మించి వాళ్ళ ప్రస్తావన జ్యోతిషం మీదకు ఎగిరి, సిద్ధాంతరాద్ధాంతాలతో సింహపట్ల గోత్రంవరకూ వచ్చేసరికి ఆ యింటి యిల్లాలు శాంతమ్మ అతి తెలివిగా ముందుచూపుతో కళ్ళు తిరిగి పడిపోవడంతో గొడవనూని ఎవరి దారిన వాళ్లు చల్లగా జారుకుంటారు. అయితే రాధ అందం ఎరలో చిక్కుకున్న పట్టూ పెళ్లిళ్ళ పేరయ్య సహాయంతో స్నేహితుడైన మిస్టర్ చింతా సలహాలకై అతనిదగ్గరకు వెళ్తాడు.

మిస్టర్ చింతా చెప్పినదంతా పేరయ్యకి అర్థం కాకపోయినా, ఒకటిమాత్రం స్పష్టంగా అర్థమయింది. శంకరయ్య కూతుర్ని చేసుకోవాలని పట్టూకి గట్టి అభిప్రాయమే ఉంది—అన్నది. అంచేత అతడు మళ్ళీ కార్యరంగంలోకి దిగడానికి కాస్త ఆధారం దొరికింది. ఈ విషయమై కదపడానికి అతను రామయ్య దగ్గరకు వెళ్ళినప్పుడు రామయ్యే ఆ విషయం ఎత్తడంవల్ల అతను అట్టే శ్రమపడక్కర్లేకపోయింది.

"ఏమిటి పేరయ్యా, మా చవట ఇంకే పిల్లనీ చూడనంటున్నాడు," గట్టిగా అడిగితే నాకు పెళ్ళే వొద్దు, అంటాడు. వీడితో ఎల్లా చచ్చేది?"

"ఒక్కగానొక్క బిడ్డ," అంటూ వాపోయింది, గుమ్మంలో నిలబడ్డ సుబ్బమ్మ.

"అతనికే పిల్లమీదన్నా అభిప్రాయముందేమో," అన్నాడు పేరయ్య ఇద్దరి ముఖాల్నీ కొంచెం పరీక్షగా చూసి.

"అయితే మాతో చెప్ప పేదపకూడదూ," అన్నాడు రామయ్య.

"అంతా నీ ఇష్టంరా నాయనా. నీకిష్టం లేని సంబంధం మేం ఎప్పుడన్నా ఒప్పుకుంటామా, అని వెయ్యివిధాల చెప్పాంగా," అంది సుబ్బమ్మ.

"నువ్వో మాట అడగకూడదూ పేరయ్యా?" అన్నాడు రామయ్య.

"అడిగానయ్యా," అన్నాడు పేరయ్య పెద్దరహస్యం బయటపెడుతున్నవాడిలాగ.

"ఎప్పుడు?" అన్నాడు రామయ్య.

"ఏమన్నాడు?" అంది సుబ్బమ్మ.

"ఏదో అన్నాడు. ఏమంటే ఏం లాభం సుబ్బమ్మ పిన్నీ, అదేం లాభం లేదులే,"

"ఎందుకు లాభంలేదూ? వాడేమన్నాడో చెప్పు."

"చెపితే నువ్వు ఆకాశం ఎత్తుకి ఎగిరి పడతావు."

"బాగుందయ్యా, నేనెందు కెగిరి పడతాను? వాడికి ఫలానా పిల్ల నచ్చిందనిచెప్పు.



రేపు జరిపించేస్తా పెళ్ళి."

పేరయ్య సందిగ్ధంలోపడ్డాడు. చెప్పేస్తే మొదటికి మోస మొస్తుందేమో. చిటారు కొమ్మ నున్న పండుకోసం చెట్టెక్కిన కుర్రాడిలాగుంది పేరయ్య స్థితి. చెయ్యి జాపితే పండు అందొచ్చు. తీరా అందకపోతే చెయ్యి తగిలి పండు కింద బురదలో పడిపోతుంది. అందీ అందడంతోటే పండుని గబుక్కుని పట్టెయ్యాలి. అంచేత జాగర్తగా మరికాస్త పండుకి దగ్గరగా జరగాలి.

"మనం ముసలాళ్ళం. కుర్రాళ్ళ వ్యామోహాలు వేరు. మనకే అన్నీ తెలుసనుకుంటాం మనం. మన అభిప్రాయా లన్నీ వాళ్ళమీద రుద్దడానికి ప్రయత్నిస్తాం. అయితే కొన్ని విషయాల్లో వాళ్ళే రైటు. అంచేత వాళ్ళ ఇష్ట ప్రకారమే నడుచుకుంటే పేచీయే ఉండదు."

"ఎందుకీ డొంకతిరుగుడు? వాడి కేది ఇష్టమో చెప్పు."

"అత నంటాడు...." అని ప్రారంభించి పేరయ్య ఆగిపోయాడు. ఇప్పుడు సంగతి బయటపెట్టేసి తాడో పేడో తేల్చెయ్యడం రాయబారి లక్షణంకాదు. పేరయ్యకి మెరుపు లాంటి ఆలోచన తట్టింది. సంగతి ఇప్పుడు బయటపెట్టేస్తే, మొట్టమొదట రామయ్య తారాజువ్వలా లేవడం ఖాయం. తరవాత చల్లబడి దారికి రావొచ్చు, రాకపోవచ్చు. సుబ్బమ్మని ముందు లొంగదీసి, రామయ్యని లొంగదీసే పూచీ ఆమెకు వదలిపెడితే? మంచి అదను చూసి ఆమె దండయాత్ర ప్రారంభిస్తుంది. మధ్యాహ్నం భోజనంవడ్డించి విసురుతూనో, రాత్రి తాంబూలం ఇస్తూనో, ఏ పెళ్లామన్నా ఒకవిషయం అడిగిందంటే, కాదనగల మగవా డెక్కడున్నాడు? అటువంటి సమయాల్లో మగవాడు ఆడదానిచేతిలో కీలుబొమ్మ. అంచేత పేరయ్య దోరణి మార్చేశాడు.

"ఏమీ లేదయ్యా; నువ్వు ముందు ఊఁ అంటావని నమ్మకం కలిగేదాకా, అతను మనస్సులో ఉన్నది పైకి చెప్పనంటాడు." అన్నాడు.

పేరయ్య నడపవలసిన రాజకీయం మహా సున్నితమైనది. ఎంతో నేర్పుతో, ఓర్పుతో నడపవలసింది. అయితే సుబ్బమ్మని ఎంతవరకూ ఇందులో ఉపయోగించుకోవాలో పేరయ్యకి అర్థంకాలేదు. ఆమె మేథకురాలు. బొత్తిగా జావలాంటిమనిషి. అయినా ఆమెతప్ప మరి గత్యంతరంలేదు. ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు, పేరయ్య విషయమంతా చెప్పాడు. అంతా విని ఆమె గడ్డంమీద వేలెట్టి, కళ్ళు పెద్దవిచేసి, "అయ్యో, అదెల్లాగా?" అంది.

"ఏం? అమ్మాయిని నువ్వు చూశావు. నీకు నచ్చింది. నూటికీ కోటికీ అలాంటిపిల్లలు ఒక్కళ్ళుంటారమ్మా. అయినా శంకరయ్యతోటీ అతని పెళ్ళాంతోటీ మనకేంపనీ? ఆ మూడుముళ్లూ పడ్డాక మన బంగారాన్ని మనింటికి తెచ్చేసుకుంటాం. వాళ్ళతో మనం సంబంధమే పెట్టుకోం. ఇంతకీ నేను చెప్పొచ్చే దేమంటే, అబ్బాయి సుఖపడాలి; వాడిసుఖమే మీసుఖం."

ఇంత ఉపన్యాసమూ అయాక, సుబ్బమ్మ మళ్ళీ గడ్డంమీద వేలేసుకుని, కళ్ళు పెద్దవి జేసి, "అయ్యో, అదెల్లాగ?" అంది మళ్ళీ.

అయితే ఇదివర కంత గట్టిగా అనలేదు. కళ్ళుకూడా ఇదివరకంత పెద్దవికాలేదు. సరే మడి చేసి విత్తనం వేశాం. నీరు పోస్తే ఎదక్కపోతుందా అని తృప్తిపడ్డాడు పేరయ్య.

ఇక ప్రణాళికలో రెండోభాగం.

పట్టూ రెండురోజులపాటు ఇంటికి పోలేదు. దీని ఉద్దేశం ఏమిటంటే పట్టూ తలిదండ్రులు అతన్ని గురించి ఆందోళన పడాలి. మిస్టర్ చింతా అతన్ని గడ్డం గియ్యొద్దన్నాడు. కాఫీ తప్ప మరో ఘన పదార్థ మేదీ తినొద్దన్నాడు. అతని తలిదండ్రులు అతన్ని తిరిగి చూసేసరికి గాభరా ఎత్తిపోవాలి. అంత బక్కచిక్కినట్టు కనిపించాలి పట్టూ.

ప్రణాళిక మూడోభాగం.

రామయ్యా సుబ్బమ్మలకు తమబిడ్డ జీవితంమీద విరక్తిపుట్టి ఇల్లువదలి బికారిలా తిరుగుతున్నాడని తెలుస్తుంది. అందుకు కారణం వాళ్ళు ఊహించుకుంటారు. ఊహించుకోడానికి మాత్రం ఏముంది? పేరయ్య సుబ్బమ్మతో చెప్పనే చెప్పాడు. సుబ్బమ్మ ఇదివరకు చెప్పకపోయినా, ఇప్పుడన్నా రామయ్యతో చెప్పుతుంది. అప్పుడు పేరయ్య ఊరంతా వెతికి పట్టూని పట్టుకుంటాడు. తలిదండ్రులకు వప్పగిస్తాడు. తలిదండ్రులు అతని స్థితిచూసి, బిత్తరపోయి, అతని ఇష్టంవచ్చినట్టు చెయ్యడానికి ఒప్పుకుంటారు. పెళ్ళి జరిగిపోతుంది.

అనుకున్నవన్నీ ఇంచుమించు ఆఖరు వరకూ సక్రమంగానే జరిగాయి. పట్టూ గడ్డం పెంచాడు. బక్కచిక్కిపోయాడు. పేరయ్య అతన్ని పట్టుకున్నాడు. రామయ్యకీ సుబ్బమ్మకీ అప్పగించాడు. రామయ్యా సుబ్బమ్మా బిత్తరపోయారు. ఆ తరవాతే ప్రణాళిక కాస్త అపసవ్యంగా పరిణమించింది.

రామయ్య పట్టూని చూసి బిత్తరపోయాడు. పట్టూ నిర్జీవపుచూపులు తండ్రిలోంచి దూసుకుపోయి, అతని వెనకాల శూన్యంపంక చూశాయి. తన హృదయంలో నిస్పృహ చూపుల్లో ప్రతిబింబింప చేస్తున్నానని పట్టూ అభిప్రాయం. ఆ చూపుల్లో రామయ్య చదివిన అర్థంవేరు. ఎందుకంటే పేరయ్య చెప్పిన వృత్తాంతం సుబ్బమ్మ రామయ్యకి చెప్పలేదు. అంచేత పట్టూ మనస్థితి గ్రహించడానికి తగినంత అవకాశం లేదు.

"ఇప్పుడేవస్తా," అనేసి రామయ్య వెళ్ళిపోయాడు.

ఇప్పుడు బిత్తరపోయింది పట్టూ, పేరయ్య. పట్టూస్థితి చూడ్డంతోటే రామయ్య కంగారుపడిపోయి, 'నాయనా నీ ఇష్టంరా'. అంటాడని ఇద్దరూ అనుకున్నారు. ఆ ప్రస్తావనే ఎత్తకండా రామయ్య వెళ్ళిపోయాడు. దానికితోడు సుబ్బమ్మ అతని కళ్ళు నిమురుతూ, గడ్డం తడుముతూ సగం

తడిసిన గొంతుకతో పరామర్శ చేస్తుంటే పట్టూ ఆలోచనలు చెదిరిపోయాయి.

"అయ్యో నాతండ్రీ, ఎంతెల్లా చిక్కిపోయావురా. ఎన్నాళ్ళు పస్తున్నావో ఏమో. రారా, ఒక్కముద్ద తిందువుగాని," అంటూ బతిమాలింది.

అతి ప్రయత్నంమీద జారిపోతున్న నిస్పృహ మళ్ళీ చిక్కబట్టుకున్నాడు పట్టూ. సాధ్యమైనంత వెలితిగా నవ్వాడు.

"అన్న మెందుకు ? నా కక్కర్లేదు," అన్నాడు చేతనైనంత పొడి వైరాగ్యం అందులో నింపుతూ.

"అలా అనకు రా నాయనా ! కాస్త తల రుద్దుకుని నాలుగుమెతుకులు తినరా."

"తలెందుకు ? మెతుకులెందుకు ?" అసలు ఈ బతు కెందుకు ? వేదాంత పరిభాషలో, ఒక్కొక్కమాటలో మరింత వైరాగ్యం ఉట్టిపడేటట్లు ప్రయత్నించాడు పట్టూ. అనేసి, లోపలంతా కాళీ అయిపోయినట్టు పెద్దగా నిట్టూర్చాడు. అప్పు డొచ్చాడు భూతాలపిచ్చయ్య. మంగలి రాముణ్ణి వెంటబెట్టుకుని. పట్టూ ఇంక తన చూపుల్లో వైరాగ్యవిషాదాలు నిలబెట్టలేక పోయాడు. జరగబోవు యీ కార్యక్రమం భయంకరమైన బాంబులా అతని మెదడులో పేలింది. మంగలిరాముడిచేత తల, గడ్డం గొరిగించేస్తారు. నూతిచప్టామీద పదిమందీ నిలేసి పట్టుకొని తలమీద నిమ్మరసం రుద్ది స్నానం చేయిస్తారు. తరువాత పిచ్చెయ్య ధూపంతో మంత్రాలతో తనకి పిచ్చెక్కిందనో, దెయ్యం పట్టిందనో అనుకున్నా డన్న మాట తన తండ్రి!! పట్టూకి ఒళ్ళు తెలియని కోప మొచ్చింది. సింహంలా మంగలిరాముడి మీది కురికాడు. వాడిచేతిలో పొది లాక్కుని నూతిలోకి గిరవాటేశాడు. పిచ్చయ్యని కింద పడేశాడు. అతని దెయ్యాలదండాన్ని ముక్కలు ముక్కలుగా విరిచిపారేశాడు. ఈ కార్యక్రమం అంతా నడిపిస్తూ గొంతెత్తి పెద్దగా అరిచాడు.

"నాకు దెయ్యం పట్టిందనుకున్నారుగదూ? అవును. పట్టింది. ఏం దెయ్యమో తెలుసా ? ప్రేమదెయ్యం. ఈపిచ్చితంతుతో నాప్రేమని అవమానించాలని చూస్తున్నారా ? మీ కెన్ని గుండె లున్నాయి ?"

పట్టూ అరుపులతో రామయ్య అనుమానం ధ్రువపడిపోయింది. ఇది దయ్యమే. చాలా గడ్డుదెయ్యంకూడాను. అందులో భూతాల పిచ్చయ్య మంత్రదండాన్ని విరిచేసిన దెయ్యం!! ఆ దండం ఎన్నోదయ్యాలభరతం పట్టి దాసోహ మనిపించింది. అదీగాక ఇన్నాళ్ళు నిద్రాహారాలెరుగని పట్టూ నలుగురు మనుషుల్ని గాలిపటాల్లా ఎగరేసి పారేశాడంటే, అది తప్పకుండా దెయ్యం ప్రభావమే.

సుబ్బమ్మ ఒకమూల పగిలిన మోకాలు చిప్పని పరామర్శిస్తూ కూచుండిపోయింది. రామయ్య మెలికలు తిరిగిన మోచేతిని తిన్నగా చేసుకోడానికి తిప్పలుపడుతున్నాడు. పిచ్చయ్య తలమీద కట్టిన నిమ్మకాయంత బొప్పిని ఆప్యాయంగా బుజ్జగిస్తున్నాడు.

"కామపిశాచంలాగుంది. పట్టుకోవడానికి పదిమంది కావాలి," అన్నాడు.

"అబ్బే పిశాచంలేదు, ఏమీ లేదండీ; నేను చెప్పేది..." అంటూ అడ్డుపడబోయాడు పేరయ్య. అది పిశాచమే నని ఇంతబలమైన సాక్ష్యం ఉండగా అతని వాదం వినేవా ళ్ళేవరు ?

మంగలిరాముడు వెళ్ళి పదిమందినీ పిలుచుకొచ్చాడు. పట్టూ పేరయ్యా ఇదంతా పెద్ద పొరబాటని ఎంతగట్టిగా వాదించినా ఎవ్వరూ వినిపించుకోలేదు. పట్టూని కాళ్ళూ చేతులూ కట్టేసి నూతిచప్టామీదికి లాక్కుపోయారు. పేరయ్య ఈ వార్త మిస్టర్ చింతాకి అందజెయ్యడానికి పరుగెత్తాడు.

అంతా విన్న మిస్టర్ చింతా, "అదీ దెబ్బ," అన్నాడు. "ప్రేమ పోరాటంలో ఓటమి నంగీకరించని మా పట్టూ శౌర్య ప్రతాపాలు, చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయి. ఈ దేశంలో ప్రేమ, దెబ్బలు తినితిని నీరసపడిపోయింది. నిర్వీర్యమైపోయింది. ఇన్నాళ్ళ కొక మహావీరుడు ప్రేమ వ్యతిరేకశక్తులకు నిర్భయంగా ఎదురు నిలిచి, దెబ్బకు పదిదెబ్బలు తీస్తున్నాడు."

"అదికాదండీ; అతన్ని కాళ్లూ చేతులూ కట్టేసి, నూతిచప్టామీదికి లాక్కుపోయారు." అంటూ గోలెట్టాడు పేరయ్య.

"చప్టామీదికా ? ఎందుకు ?"

"క్షవరం చెయ్యడానికి."

"చెయ్యనివ్వండి. పాపం, తల మాసినట్టుంది. చాలా అవసరం. గడ్డంకూడా గీయించండి."

"అంతా గీసేస్తారండీ బాబూ, తలకూడా."

"తలా ? ఎందుకు?"

"అతన్నేదో దెయ్యం పట్టుకుందని..."

"దెయ్యమా ? ఏం దెయ్యం ?"

"బాబూ ! కాలయాపన చేస్తే లాభం లేదు అఘాయిత్యం జరిగిపోతోంది. తమరే వొచ్చి ఆపాలి."

"మరి ఈ సంగతి ముందే ఎందుకు చెప్పలేదు ?" అంటూ లేచాడు మిస్టర్ చింతా. తలప్రాణం తోక కొచ్చిన పేరయ్య కదల్లేక అక్కడే కూచుండిపోయాడు.

బలవంతంగా ఒక మనిషికి క్షవరం చెయ్యడానికి మీ రెప్పుడన్నా ప్రయత్నించి ఉంటే, అందులో ఉన్న కష్టనిష్ఠురాలు మీ కర్థ మౌతాయి. ఆ మనిషి కాళ్లూ చేతులూ కట్టేసి కదలకుండా పదిమంది పట్టుకున్నా సరే. అసలుకష్టం ఏమి టంటే, కత్తిని క్షవరం చెయ్యవలసిన ప్రదేశానికి చేర్చడం దానికి చాలా రాజకీయం, వాకచక్యం అవసరం. అన్నిటికన్నా ముఖ్యమైనది—నరాలకు మంచి పటుత్వం. వెంట్రుక వాసి బెసిగితే, క్షవరం చెయ్యబడే ఆసామీకో, చేసే ఆసామీకో అపాయం తప్పదు.

మంగలిరాముడు శిలావిగ్రహానికన్నా సరే, పదిచోట్ల గంట్లుపెట్టకండా క్షవరం చెయ్యలేడు. అతని చేతులకు, పక్షవాతం ద్వారా సంక్రమించిన చిన్న వణుకుంది. పట్టుకున్న గడ్డమూ, కత్తికూడా వణకడం

మూలంగా, కత్తి ఒక్క వెంట్రుకలనే గీయదు. పదిమందీ కదలకుండా పట్టుకున్నా, పట్టూ పట్టుదల సడలలేదు. శత్రువు వేసే ప్రతి ఎత్తుకీ పైఎత్తు వేస్తూనేఉన్నాడు. తీరా కత్తి తలదాకా రాగానే, తల చటుకుని కదిలించేవాడు. పట్టుకున్న వాళ్ళవి గాని, రాముడివిగాని, నోటి కందిన అవయాలు నిర్దాక్షిణ్యంగా కొరికేసేవాడు. భూతాల పిచ్చయ్య తొందరగా గొరిగెయ్యమని మంగలిరాముణ్ణి ప్రోత్సహిస్తున్నాడు. అతని అభిప్రాయంలో మంగలికత్తి కాస్త ఇక్కడా అక్కడా పెచ్చులు లేవగొట్టినా మరేం ఫరవాలేదు. అంతేకాదు. అతని తలమీద కట్టిన బొప్పి దృష్ట్యా కత్తిగాట్లు కొన్నైనా అవసరంకూడాను. రామయ్య మాత్రం తొందరపడొద్దని హెచ్చరిస్తున్నాడు. దెయ్యానికి జరగవలసిన శాస్తికి, తన కొడుకుశరీరం బలికావడం అతనికంత సందర్భంగా తోచలేదు. శత్రుశిబిరంలో ఏర్పడ్డ ఈ అభిప్రాయభేదాన్ని పట్టూ లక్షణంగా ఉపయోగించుకుని కాలయాపన చేస్తున్నాడు. అయితే అతని సత్తువ సన్నగిల్లిపోతోంది. నరాలుకదలలేని స్థితి కొస్తున్నాయి. ఇంకో క్షణానికి మైకం కమ్ముతుందేమోకూడాను. పట్టూ ఎంత తెచ్చుకోవాలని ప్రయత్నించినా చైతన్యం రావడంలేదు. ఒళ్ళంతా తిమ్మిరెక్కినట్లయిపోయింది. ఇదే అదనని మంగలి రాముడు కత్తి నెత్తికి ఆనించాడు.

"ఆగు!" అన్న అరుపు విని రాముడు వెనక్కి జంకాడు. అందరూ ఆ అరుపువేపు తిరిగారు. పట్టూకళ్ళు విజయోత్సాహంతో మెరిశాయి. అదమరపుగా ఉన్న శత్రువుల్ని ఒక్కఊపులో విడిలించి, చప్టామీదినుంచి కిందికి దూకాడు పట్టూ. మిస్టర్‌చింతా పట్టూ చేతికట్లు విప్పాడు. పట్టూ మిస్టర్ చింతాని కౌగలించుకున్నాడు.

"సమయాని కొచ్చావురా, దేవుడిలాగ. ఈ పీనుగులంతా కలిసి ఎంత దారుణాని [illegible] రనుకున్నావు?" అంటూ పట్టూ కన్నీరు కార్చడం మొదలెట్టాడు. ఆ కన్నీరు తనకోటుమీద పడితే మరకవుతుందని, మిస్టర్ చింతా జేబురుమాలుతో పట్టూ కళ్ళొత్తాడు.

"కన్నీరు ఆడవాళ్ళ సొత్తు. మగవాడు దాన్ని అపహరించడం అన్యాయ్యం. అదీ గాక, కన్నీరు పడితే సూటు పాడౌతుంది. అంచేత కుళాయి కట్టెయ్యి." అంటూ సముదాయించాడు మిస్టర్ చింతా. ఆ తరవాత పట్టూ గడ్డంవేపు చూసి, "మంగలి సిద్ధంగానే ఉన్నాడు గనక, క్షవరం చేయించేస్తే?" అన్నాడు.

"క్షవరమా?" అని అరిచాడు పట్టూ.

"నీ గడ్డం మాత్రం," అన్నాడు మిస్టర్ చింతా బుజం తట్టుతూ.

"వొద్దు." అన్నాడు పట్టూ కచ్చితంగా.

"నిజమే. వొద్దులే, మంగలి మంచి ఆవేశంలో ఉన్నాడు. ఇప్పు డతనికి గడ్డం అప్పగించడం అంత క్షేమంకాదు. అయితే, మహాశయులారా? ఇంక మీ అవసరంలేదు. దయచెయ్యవచ్చు."

పట్టూని చెయ్యిపట్టుకుని లోపలికి నడిపించాడు మిస్టర్ చింతా. రామయ్య మాట్లాడకుండా అనుసరించాడుగాని, పిచ్చెయ్య మాత్రం కాస్త అసమ్మతి తెలియబరుస్తూ అన్నాడు. "అతనికి దెయ్యం పట్టిందయ్యా."

"తెలుసు. ఏం దెయ్యమోకూడా తెలుసు. దానికి చికిత్స చేస్తాం. ఏం చెయ్యాలో మాకు తెలుసు. మీరు పడ్డ శ్రమకి ధన్యవాదాలు. గుడ్‌నైట్."

పిచ్చెయ్య తన తలమీది బొప్పి తడుముకున్నాడు. దానికి తగిన ప్రతీకారంకోసం రకరకాల హింసలు ఆలోచించుకున్న తనకి అన్యాయం జరిగినట్టు అనిపించింది. తన అసంతృప్తిని ఎవరిమీద చూపించాలో తెలియక అతను నిలబడిపోయాడు. రామయ్య, కొడుకుని అనుసరించి లోపలికి వెళ్ళాడు

మిస్టర్ చింతా పట్టూని ఒక కుర్చీలో కూర్చోబెట్టాడు. తను ఒకకుర్చీ అంచుమీద జేబురుమాలు పరిచి కూచున్నాడు, పాంటు పాడవకుండా.

"పాపం, ఎంత అలిసిపోయాడో కాస్త కాఫీ సేవిస్తాం," అన్నాడు మిస్టర్ చింతా. సుబ్బమ్మ వంటింట్లోకి వెళ్ళింది. రామయ్య బొమ్మలాగా అలాగే నిలబడి ఉంటే–

"దయచెయ్యండి," అన్నాడు మిస్టర్ చింతా. రామయ్య నులకమంచంమీద కూచున్నాడు.

"చూశారా? ఒక్క పొరబాటు, ఎన్ని పొరబాట్లకి దారి తీస్తుందో? ప్రణాళికలు వేస్తాం. అన్ని వివరాలూ చర్చిస్తాం. ఆచరణలో పెట్టేప్పుడు ఎటువంటి అడ్డంకులు రావడానికి అవకాశ ముందో, అన్నీ ఊహించుకుంటాం. వాటిని తప్పించుకోడానికి మార్గాలు ఆలోచిస్తాం. ఎక్కడా ప్రణాళికలో లొసుగులు వదలిపెట్టలేదనుకుని ప్రారంభిస్తాం. ప్రణాళిక సగంవరకూ సవ్యంగా నడుస్తుంది. ఆకస్మాత్తుగా అంతా–మన ప్రయత్నమంతా–గంగపాలై పోతుంది. ప్రణాళిక అనే కుండలో ఎక్కడో కనబడని చిల్లుంది. మనకి తెలియకుండానే మనం సేకరించినదంతా అందులోనుంచి కారి మట్టి పాలై పోతుంది. ఎక్కడో ఒక చిన్న విషయంలో పొరబాటు చేస్తాం. చేశాం. దీనికంతటికీ మూలకారణం మీకు తప్పకుండా తెలుస్తుం దనుకున్నాం. అదే పొరబాటు. మీకు తెలిసేటట్టు జాగ్రత్త పడవలిసింది. మీ భార్యగారు తనకుతెలిసిన సంగతులు, కొన్ని పరిస్థితుల్లో మీకు చెప్పకుండా ఉండరనుకున్నాం. ఆమెచెప్పలేదు. అదేమేం చేసిన పొరపాటు. మా ప్రణాళికా పానకంలో పుడక. మా ప్రయత్నాలపాలలోఉప్పుకణం."

"మీ రనే దేమిటో నా కేం బోధపడ్డం లేదు, నాభార్య నాతో ఏంచెప్పలేదంటారు?"

"పట్టూ అనే మీకుమారుడు, శంకరయ్య అనే ఆయన కుమార్తెను తప్ప మరెవరినీ పెళ్ళిచేసుకోడని."

"ఏమిటి?" అని గర్జించాడు రామయ్య.

(మిగతా 20 వ పేజీలో చూడండి.)

పరిసమయాన్నాలు

దండనము.

శ్లో॥ "రాజభిః ధృతదండాస్తు కృత్వా పాపాని మానవా।
నిర్మలాః స్వర్గమాయాంతి సంతః సుకృతినో యథా॥
శాసనాద్వా విమోక్షాద్వా స్తేనః స్తేయాత్ విముచ్యతే
రాజా త్వశాసత్ పాపస్య తదవాప్నోతి కిల్బిషం॥"

—వాల్మీకి.

"పాపము చేసినమానవులు రాజదండనమును అనుభవించి తమపాపమునుండి విముక్తులై, పుణ్యవంతులగుసత్పురుషులువోలె, స్వర్గసుఖమును అనుభవించెదరు. దొంగతనమును చేసినవాడు, దండనమును అనుభవించికాని, రాజదండనము విధింపబడక విడువబడికాని తనదొంగతనపుదోషమునుండి విముక్తుడగును. కాని, పాపము చేసినవానిని దండించక విడిచినశాసకుడుమాత్రము ఆపాపముయొక్క పాపఫలమును అనుభవించి వినాశమును పొందును."

వార్ధకము.

శ్లో॥ అంగం గళితం, పలితం ముండం,
దశనవిహీనం జాతం తుండమ్।
వృద్ధో యాతి గృహీత్వా దండం,
తదపి న ముంచత్యాశాపిండమ్॥"

—శంకరాచార్యులు.

"వృద్ధాప్యముచేత అవయవములు శిథిలములై జారిపోయినప్పటికిని, తల నరసినను, పండ్లు ఊడిపోయినను, కఱ్ఱ చేత బట్టుకొని తడబడుచు నడచుచున్నప్పటికిని మానవునిని ఆశమాత్రము విడువక బాధించుచుండును"

శ్రీనాథుని చాటువు.

సీ॥ శ్రీరస్తు భవదంఘ్రిచికురంబులకు; మహో
భూర్వ్యబ్దములు సితాంభోజవదన !;
వరకాంతిరస్తు తావకముఖనఖముల
కాచంద్రతారార్క మబ్జవదన !;
మహిమాఽస్తు నీకటిమధ్యంబులకు మన్ను
మిన్నుం గలన్నాళ్ళు మించుఁబోఁడి !;
ప్రియమస్తు నీగానవీక్షల కానీల
కంఠహారిస్థాయిగా లతాంగి !;
తే॥గీ॥ కుశలమస్తు భవచ్ఛాతకుంభకుంభ
కుంభభృత్కుంభికుంభాభిజృంభమాణ
భూరిభవదీయవక్షోజములకు మేరు
మందరము లుండుపర్యంత మిందువదన !

—కవిసార్వభౌమ శ్రీనాథుడు.

వేశ్యలు.

మ॥ తలఁపుల్ చిచ్చులు; మాట లుజ్జ్వలసుధాధారల్; విభుండైనపు
ప్పిలుతున్ మెచ్చర; యన్యులన్ వలతు; రేవిశ్వాసమున్ లేదు; క్రూ
రలు తోడుంబలినైనఁ జంపుదు; రధర్మల్; చంచలల్; నిర్దయల్;
వెలయాండ్రెక్కడ? వారివేదబము లావేదాంతసూక్తంబులే॥''

—పోతనామాత్యుఁడు.

సూర్యాస్తమయము.

కం॥ ''ఇనుఁడు తనకడకు నేతెం
చిన రాగముఁ బొందు టిది యుచిత మనఁగాఁ గెం
పున మెఱసి పశ్చిమాశాం
గన జన సంభావనముల గౌరవ మందెన్''॥

ఉ॥ "చుక్కలు తోడుతోడఁ దలచూపఁ దొడంగె; మనోభవుండు వి
ల్లెక్కిడి చక్రవాకములయిక్కలు రోయఁగఁ జొచ్చె; నేల కెం
పెక్కుచు వచ్చె; దీవియలయేడ్తెఱ సోయగ మందె; సందడుల్
దక్కెఁ బురంబువీథుల; మందం బొలసెన్ విటచిత్తవృత్తులన్"

—తిక్కన సోమయాజి.

పతిభక్తి.

తే॥ గీ॥ "అనపహార్యంబు, తేజోమయంబు, సర్వ
గుణములకు నలంకారంబు, గురుతరంబు
భామలకుఁ బతిభక్తియె పరమ మైన
భూషణం, బిట్టివే పెఱభూషణములు?"

—నన్నయ భట్టారకుఁడు.

దుర్యోధనవధఘట్టము.


ఉ॥ కొమ్మలు గాలిచే విరుగఁ, గూఁకటివేళ్ళసియాడఁ బెట్టుపాం
కమ్మెడఁబాసి యున్నసహకారము తియ్యనిపూఁత పూచునా?
కమ్మనికాపు కాచున? శుకప్రముఖద్విజపాళికెల్లఁ జి
త్తమ్మున కింపుఁ గూర్చున? సదా తెరువర్లకు నీడ నిచ్చునా?"

—తిరుపతి వెంకట కవులు.

ప్రాతఃకాలము.

తే॥ గీ॥ ఖండితాగండములఁ దమకాంతి నుంచి
నట్లు దీపంబు పాడిమం బందికొనియెఁ;
దలిరుఁబోఁడుల (విరహోత్కంఠితలు) కన్నులఁ దమదు తేమ
దాచినట్టులఁ జంద్రకాంతంబు లెండె."

—ఆంధ్రవిల్హణ.



నిజంగా దేనికోసం చూడవలసియున్నది—
—వజీరు సుల్తానువారి అత్యుత్తమ సిగరెట్ నిర్మాణ గుర్తు కోసం

ఈ గుర్తు ది వజీరు సుల్తాను టుబాకో కంపెనీ లిమిటెడ్‌కు చెందినది. హైదరాబాద్ లోని పెద్ద, ఆధునిక సిగరెట్ ఫ్యాక్టరీలో వారు, చార్‌మినార్‌ను తయారు చేస్తున్నారు. మార్పులేని సువాసన, అద్వితీయమైన రుచిగల సిగరెట్. ప్రపంచములో సిగరెట్ తయారు చేయువారిలో అగ్రస్థానం వహించినవారు గనుకనే యిన్ని సిగరెట్లు ప్రజావసరాలను తీర్చుటకు యీ గుర్తుగల కంపెనీవారు చేయగల్గుచున్నారు. ఈ ఫేక్టరీ ఆగ్నేయాసియా కంతకీ పెద్దది, అతి నవీనమైనది.

అతి నాణ్యమైన పొగాకును చక్కగా మిశ్రమం చేయుటకు రోటరీ మిక్సర్లు. అతి వేగంగా కత్తిరించుటకు కటింగు మెషీనులు. పొగాకును పదును పరుచుటకు స్పిన్నింగు మెషీనులు. అతి సున్నితమైన పనులు జేయుటకు నవీనమైన సిగరెట్ యంత్రాలు—నిముషమునకు యిరువై వేలకు పైగా సిగరెట్లు—సంవత్సరములో ప్రతి నెలా సుమారు తొంబై కోట్ల సిగరెట్లను తయారు చేయుచున్నవి. అమ్మకంలో చార్‌మినార్ ప్రపంచములో అగ్రస్థానము వహించిన సిగరెట్లలో ఒకటిగాను, ఇండియాలో బహు జనాదరణ పొందినదిగాను వున్నదంటే వాటికి కారణం అతి వేగంగా, సమర్థతతో పనిచేసే ఆధునిక యంత్రాలు.

అందుకే నిజంగా చూడవలసింది.

అద్వితీయమైనది చార్‌మినార్. ఇండియాలో ఘనత వహించిన సిగరెట్.

ది వజీరు సుల్తాను టుబాకో కంపెనీ లిమిటెడ్

భారతదేశమందు ఘనత వహించిన సిగరెట్ నిర్మాతలు.

CAS/VS-6R TEL

అమ్మ నవ్వింది

కె. సంపూర్ణమ్మ

అఖిల భారత కాంగ్రెస్ మహా సభలు జరుగుచున్న మూడు రోజులలోను ఆదివారంనాడు భూదేవిపై నున్న ఇసుక రేణువులన్నియు మానవాకారములను దాల్చి ఆ సమావేశమును చూచుటకై బయలుదేరిన ట్లున్నవి గుంటూరు బజారు లన్నియును. ఎక్కడ జూచినను హడావిడి ప్రత్యక్ష మౌతున్నది.

జాతీయ పతాకములుతోను, విద్యుద్దీపముల అమరికతోను, సుస్వాగత ప్రభలతోను, మంత్రి వర్గమును తిలకించ వేడ్కన బారులు తీరి వేచియున్న నర నారీలతోను, కోలాహలంగా కదలాడుచున్న జన సమర్ధ ముతోను, గుంటూరు పట్టణము వెయ్యి కళలను వెదజల్లుచున్నది.

విజయవాడనుండి రైలుబండి వచ్చినది. లక్షలాది జనము స్టేషన్‌లో కదలాడు చున్నారు. ఒకచోట వందమందికి పైగా మూగి ఏవో వింత చూస్తున్నారు, వాలెం టీర్లు కూడ గట్టిగట్టిగా అరుస్తున్నారు. "ఎమోయ్ రత్నం! మీవాళ్లెవరైనా ఉంటే చెప్పు. వాళ్ళనేమీ అనము. మమ్ము కవ్వించి నవ్వించేవాళ్ళతో మే మనేకం మాట్లాడుతాము," అని ఒక పోజుల రాయుడు పక్కగా "వీళ్ళంతా మనవాళ్ళు కారా? మీ చెల్లినే ఒకరు గేలి చేస్తుంటే నీకు బాధగాదా? ఎందుకు, ఆడపిల్లలను జూచి నవ్వటం దేనికి?"

"ఒరేయ్ ఏమిటిరా తెగ వాగుతున్నావ్. పెద్ద సంస్కర్త బయల్దేరాడులే. ఇలాంటి సమావేశాల్లో కుఱ్ఱవాళ్ళు అనేకపనులు చేస్తారు. ఖండించుటకు నీ వెవడవోయ్" నేను మనిషినిరా. పశువుల్లాగ ప్రవ ర్తించేవారిని జూస్తే మనిషికి కోపం వస్తుంది. "ఊఁ ఏమన్నావ్, ఏమైనా వడ్డించాలా? ఎముకలన్నీ ఏరేస్తాం తెలుసా. ఒరేయ్ రామూ, చూస్తా రేమిటిరా చితక తన్నక" అని ఒకడు చొక్కా వెనక్కు నెడ్తున్నాడు.

"ఆహాహా! ఏదీ వానిమీద దెబ్బ పడనియ్ చూద్దాం; ఇవతలవాళ్ళు బొత్తిగా గాజులు తొడుక్కున్నారనా ప్రేలు తున్నావ్? రా! మరి చూద్దువుగాని తడాకా" అంటూ రత్నం ప్రక్కన ఊతమిస్తున్న ఒకని మీదకు చెయ్యి లేవబోయేసరికి కొందఱు పెద్దమనుష్యులు, రైల్వే పోలీసులు వచ్చి అందరినీ సద్దు మణిగే టట్టు చేసి ఎక్కడివా రక్కడ నిష్క్రమించారు.

అరుణా! చూశావా? ఆ పోకిరీల వాగుడు. అయినా ఆడపిల్లలు సభ్యతగా మెలుగుతూ ఒక మాటన్నను తలవంచు కొని పోతే ఇంత గొడవ జరిగేది కాదు. ఎక్కడ తన్నుకుంటారో నని గుండెలు కొట్టుకున్నాయి," అని కరుణ చెప్తుండగా 'ఊఁ' కొడుతూ అరుణ, రవి కరుణను అనుసరించారు.

మానవ ప్రవాహం సభనుండి ఒంటి గంటకు వెనుదిరిగి ఊరిపైకి ప్రవహించు చున్నది. ఆ ప్రవాహంలో ఎదురు వచ్చెడి జీవరాసులు కాలినడక ప్రమేయం లేకనే వందల కొలదీ గజాల దూరం వెనుకకు కొట్టుకొని పోవుచున్నవి. అబ్బ! అమ్మమ్మా: బాబోయ్! అనెడి కలకలలు ఆ సెల ఏటిలోలా ప్రతిధ్వనిస్తున్నది. నదిలో నిండుగా తొణుకు బెణుకులతో ఊగిస లాడుతూ కదలాడినట్లు తెల్లని నీటిపై వల్లని నురగలేమో అనునట్లుగా తలలు మాత్రమే పైకి క్రిందికి చలించుచున్నవి.

"అక్కా! మనం ముందుగా భాస్కరం చిన్నాన్నగారింటికి వెళ్ళి వారితో కలిసి వస్తే బాగుంటుంది కాదూ!" అన్న అరుణ మాటకు సమ్మతించి వెళ్ళి భాస్కరంగార్ని కలుసుకొని అందఱు బయలుదేరి సమావేశ స్థలము లోపలికి వెళ్ళారు.

"హమ్మయ్య! టిక్కెట్లున్నను లోనికి వచ్చుట ఎంత పనైంది బాబో"

"మరేమనుకున్నావమ్మా: యావద్భార తానికే సంబంధించిన సమావేశం కదూ."

"అక్కా! ఇక్కడే కూర్చుందాం. మరీ దగ్గర కెళితే బాగుండదు," అని కూర్చున్నా రొకచోట ఖాళీప్రదేశం చూచుకొని.

ఆహా! హా! ఏమి ఆ దివ్య జ్యోతులు చూడు. ఆ అఖండ జ్యోతులు అమరులయ్యీ మనకు ఆనందాన్ని పంచిపెడుతున్నారు. భరతఖండపు టానందాన్నంతటిని వారి లోనే ఇముడ్చుకున్నట్లు ఆ నవ్వు చూడు ఎంత నిండుగా యున్నది! వారే సజీవులై యున్నట్లయితే ఈ వేదిక నూతన శోభతో అలరారెడిది. ఎంతశ్రమయైనను ఈ మహా ద్భాగ్యమును చూడవలసినది, ఏమి అలం కరణ! ఏమి నేర్పరితనం! ఏమి కళ!!" అని కరుణ చెప్పుకు పోతుంటే రవి అడ్డుతగిలి

"అక్కా మనం దాటి వచ్చామే, సింహ ద్వారాలు. అవి ఎప్పటినుండి కట్టారో గాని బలె దిట్టంగా యున్నాయి గదూ."

"ఒరేయ్ కన్నా. అవి రాతికట్టడాలు కావురా చిన్నీ: చెక్కతో ఓర్పు నేర్పు మిళితం జేసి తయారుచేసిన గొప్ప కళ. నిజంగానే అవి మనం చదువుల్లో వచ్చే పురాతన శిల్పములను బోలి యున్నవి."

"ముందున్న రెండెడ్లను జూశారూ: ఆఁ: ఒకటేమిటిలే; అన్నీ ఒకదాని నొకటి మరిపింప జేసెడి నిర్మాణాలు."

మంత్రివర్గములో ఒక్కొక్కరే ఉపన్యసిస్తున్నారు. ఇందిరాగాంధి నిలబడి మాట్లాడునపుడు కరుణకు రెండు కన్నీటి బొట్లు రాలినవి. వాటి భావం కరుణకు, కన్నీటికి చెమ్మగిలిన భూమాతకే తెలియాలి.

ఉపన్యాసము లన్నియు ముగిశాక భాస్కరంగారితో ముగ్గురు స్టేషనుకువచ్చారు. బండి సిద్ధంగా వుండుటకే ఈ ముగ్గురను ఆడవాళ్ళ పెట్టెలోనికి ఎలాగో శ్రమపడి ఎక్కించి భాస్కరంగారు మరియొక పెట్టెలో ఎక్కుతానని చెప్పి జనంలో కలిసి పోయారు.

బండిలో జూశారూ: కట్టెలన్నీ చేర్చి గట్టిగా బిగించి మోపు కట్టినట్లున్నది. అందులోను ఆడవాళ్ళ పెట్టె యగుటచేత పిల్లల ఏడ్పులు, అరుపులు, పెద్దవాళ్ళ తగవులతో చాలా కోలాహలంగా యున్నది.

ఆడపిల్లలను గేలి చేయాలన్న తలంపుతో పోకిరీజట్టు పొంచి యున్నది. ఎనిమిది గంటలకు కూర్చున్నవారు 12 గంటల వరకు బండి కదల కుండుటచే శారీరకంగాను, మానసికంగాను విసిగి రైల్వే వాళ్ళనేమి, బండినేమి నానా మాటలు అంటున్నారు. పసిపాపలతో బాధ పడుచున్న వారికి మరీ ఇబ్బందిగా యున్నది."

"పోనీ ఈ రెండు రోజులైనను క్రమంగా బయలుదేరితే ఎంత బాగుండును" అని బాధపడుతున్నారు.

గజేంద్రుని మొరవిని శ్రీకృష్ణ భగవానుడు బయలుదేరినట్లు అంబ చెవులు గింగురు మనే లాగున ఆర్భాటంగా ఒక్కకూత కూసి కుదుపులతో కదిలింది మన రైలుబండి.

కిటికీ చువ్వలకు వ్రేళ్ళాడుతూ పొంచి యున్న పోకిరీ జట్టు నెమ్మదిగా లోనికి చొచ్చుకొని వచ్చుటయే కాక, అసహ్యం పుట్టించే ముతక మాటలూ, పెడబొబ్బ లూతో తెగగోల చేస్తున్నారు.

'కరువులో అధికమాస మన్నట్లు' సగం దూరంలో బండి మూడు గంటలసేపు విశ్రాంతి తీసుకున్నది. పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం లాగ బండికివిశ్రాంతి యైతే లోపలి ప్రాణాలు మగ్గిపోతున్నవి.

మన రౌడీముఠా సంగతి మరీ ఘోరంగా యున్నది. వీరి గల్లంతునంతా గమనించి గార్డువచ్చి నెమ్మదిగా వారందరినీ దించి రెండు ప్రక్కల బోల్టులు వేయించి వెళ్ళాడు. అల్లరిమూక వినరాని మాటలు వదులుటయే గాక బయటనుండి బోల్టులు తీస్తున్నారు. క్రిందిబోల్టులు రాలేదు గాని వచ్చినట్లయిన ఎంత గోలయ్యేదోమరి!

కరుణ పైకిచూస్తూ రెప్పలు కొడుతుంది. తల చెదిరి పంకా విసురుకు అటు నిటు అల్లల్లాడు తున్నది. శిరోజములకంటె శిరస్సులోని ఆలోచనలు మరింత అల్లలాడు చున్నవి. సుడివడిన చెంపల మీదనుండి కారిన కన్నీటి చారలను స్పష్టం చేయుచు. విద్యుద్దీపకిరణాలు పరావర్తనము చెంది అరుణ కంటబడ్డవి

"అక్కా! ఏమిటి ఏడుస్తున్నావా? ఏమైనా దెబ్బ తగిలిందా? ఏమిటక్కా?"

"అవునమ్మా దెబ్బతగిలింది. శరీరానికైతే హాయిగా భరిస్తాను. కాని మాంసపు కండ రూపంలో మంచిచెడ్డలను భద్రం చేస్తున్న గుండెకు మానసికంగా గాయం పడింది. హృదయంలో జ్వాలలు రేగి దహించివేస్తున్నవి. కోపం, దిగులు, జాలి, అన్నీకలిసి రక్తాన్నే వడిగా ఉడికిస్తున్నవి. కాని ఏమీ నోరెత్తలేని పరిస్థితిలో అవన్నీ కన్నీరుగా బయటికి వస్తున్నాయి."

"ఏమక్కా! ఏమది? నా కేదో ఆందోళనగా యున్నది. త్వరగా చెప్పక్కా."

"ఆందోళనకేమిలేదు. తొందర పడెడిదేమి కాదులే. ఇంటికి వెళ్ళాక నెమ్మదిగా చెప్తాను. ఇప్పు డేమీవద్దు."

వేకువఝాము ఐదుగంటలకు తీరుబడిగా విజయవాడ వచ్చింది ఘన ధూమ శకటం. కరుణావాళ్ళను రిక్షా ఎక్కించి భాస్కరంగారు వెంటనే వెళ్ళిపోయారు.

పెందలకడనే పనులు ముగించుకొని అరుణ రెండు దిండుగలేబులు తీసికొని రంగు దారాలతో సహా తయారుగా పెట్టి సిద్ధంగా యున్నది.

"రా! అక్కా! నా ఆతృత నీ కేమి తెలుస్తుంది. ఎన్నడులేనిది నీకన్నీటికి కారణ మేమిటాయని కొట్టుకలాడుతోంది." అంటూ అరుణ సూదిలోదారం ఎక్కిస్తూంది. కరుణ కొడుకు చిన్న చిన్న అడుగులతో ప్రక్కింటి వారిదొద్దకు పోవుచున్నాడు. కరుణకూడ చాపమీద కూర్చొని కుట్టుటకు సూది తీసింది. రవిఏదో పుస్తకం పట్టుకొని వారి ప్రక్కనే కూర్చున్నాడు.

"చూడు అరుణా: మనిషికికలిగే బాధ సంతోషం మొదలైన ఒక్కొక్కటి ఎదలో ప్రవేశిస్తుంటేనే తట్టుకోలేకపోతాము. ఎప్పటి కప్పుడు మర్చిపోకుండా యుంటే కొద్దిరోజుల్లోనే గుండె వెయ్యి వ్రక్కలయ్యేదేమో."

"ఇంతకూ నీ బాధేమిటి? దానికి కారణ మేమిటి?"

"అదేనమ్మా: ఆ అల్లరిపిల్లల ఆగడానికి అమానుష్యత్వానికి నా మన సేమేమో బాధ పడింది. గత్యంతరంలేక కన్నీరుకారుస్తూ కూర్చున్నాను. అంతకంటె ఏమీలేదు."

"ఒయమ్మో, నేనేమో బ్రహ్మాండం బ్రద్దలయిందనుకున్నాను. ఎవరో గోలచేస్తే మనకు గానిదానికి ఏమో మునిగిపోయినట్లు ఎన్నడూ ఎఱుగని కన్నీరు పెడతావా? ఈ చిన్నదానికే ఏడ్చావంటే నమ్మలేను."

"చిన్నదా? ఆలోచించికంటే భూలోక మంత వైశాల్య మున్నది ఈ చిన్నదానిలో

మరి. ఎవరో గోల చేశా రంటున్నావు. ఎవరు వారు? మన భారతబిడ్డలు కారూ? ఒక్కతల్లి ఒడిలో దోగాడుచు, ఒక్కగాలి పీల్చుచు ఒక్కఅమ్మ బిడ్డలమైయున్నపుడు మన తోటిపౌరుడు పాడైపోతుంటె మనకు బాధగాక ఇంకెవరికి?

గొప్పగొప్పవారంతా ఒకనాడు బాల్య దశలో యున్నవారే. మనవలెనే విద్య నేర్చుకున్నారు. పెద్దలతో శిక్షింపబడ్డారు. కాని ప్రతి చిన్న విషయములోను మంచి చెడులను విడగొట్టి మంచిని పెంచుకున్నారు గనుకనే వారివారి కీర్తిచంద్రికలు దశ దిశల ప్రకాశిస్తున్నవి. వారివారి త్యాగ ఫలములను మన మనుభవించుచున్నాము."

"అక్కా. నా దొక్క సందేహం. ఒక నాటికి నీ కడుపున బుట్టిన బాబే ఇలాటి వాడైతే ఏమి చేస్తాము?"

"చక్కని సందేహం. పసివారు పుడు తూనే అల్లర్లు, అగడాలు నేర్చుకోరుగదా! పరిసరాలు, హద్దు అదుపులను బట్టి వారి యందు అనురక్తులు, అలవాట్లు అంకురించి అభివృద్ధి చెందుతాయి. అయినా ఒక్కసారి లేచి కాస్త ఆ సొరుగు తీసి దానిలో పచ్చని పుస్తకం ఉంది. ఇలా తెస్తావూ?"

"ఆ! ఇదిగో తెచ్చాను. ఏముంది దీనిలో?"

"బాబు రెండునెలల వాడుగా యున్న ప్పుడు పీడిపై పెంచుకుంటున్న ఆశలను, ఆశయాలను క్లుప్తంగా ఇందు దాచాను. నేనీ మట్టిపై నున్నను, మంటిలో దాగినను నా మాటగా బాబుకని దీనిని దాచాను. ఏదీ, తీసి చదువు."

అరుణ ఆసక్తితో పుస్తకం తెరచి చదువుట మొదలు పెట్టింది.

"చిరంజీవి తల్లి దీవించి వ్రాసేది—

చెప్పుట ;—

చిన్నా! నీవు నాయం దుద్భవించినది మొదలు శారీరకంగాను, మానసికంగాను అనేక బాధలు ఎదురైనవి. అయినను కంటితో కనలేని నలుసువైన నీపై పెన వేసుకుంటున్న ప్రేమా, మమతలు—వాటన్నిటినీ పైకి రానీయలేదు.

తల్లి రక్తంలో మునకలు వేయుచు, అమ్మ అనువులనే అనుసరిస్తూ భూమాత ఒడిలో పడియుకూడా నీతో అంటిపెట్టుకొని యున్న ప్రేమను ఖండించినంత మాత్రాన నీవు వేరుకావమ్మా. నీ మాంసము నీ రక్తము, నీ ఊపిరి నావి. తనయుని జూడగనే యమయాతన లన్నియు మరచి పోయి నీ తల్లి యుల్లము ఆనందంతో వెల్లి విరిసి పోయింది కన్నా.

పుట్టుకతోనే నీకు వచ్చిన మహద్భాగ్య మేమో చెప్పనా? నీవు భారత పౌరుడవు. భారతావని యంటే మామూలు మట్టి కాదయ్యా. శతకోటి సంపదలకు, మహత్తులకు నిలయమైన రత్నగర్భ!! స్వర్ణగడ్డ!! మనకు వ్యక్తిగతంగా ఆశించ దగిన, అనుభవించ వలసిన ఆస్తిగాని భోగ భాగ్యాలుగాని లేవు. అయినను ఆప్యాయత అనురాగంతో అలరారుచున్న పూవుల తీవెలు మనవేనయ్యా. ఉన్నవారికి సహజంగా లేనిది, లేనివారికి ఉన్నవి, ఎంత కాలమైనను దొరకనిది, ఏమియు వెచ్చించ కనే లభించినదియు నైన ఈ మమతా పేటికయే నీ ఆస్తి.

కన్నా! ఎదలోని రుధిరంబును క్షీరం చేసి స్రావించి పెంచుతున్న ఈ అమ్మమాట ఒకటే నీవు ఆజన్మాంతరము ఆచరిస్తావని ఆశిస్తూ ఆదేశిస్తున్నాను.

మన జన్మభూమి ఘనతను ఎవరు ఏ రూపంలోను వర్ణించలేదు. మచ్చునకు రెండు ముక్కలు చెప్పి దానిని అనుసరించ ప్రయత్నించమని నాకోరిక.

పూర్వం పురుషోత్తముడు గ్రీకు చక్రవర్తి చేజిక్కినపుడు చక్రవర్తి తనను వందనమాచరించ మనగా ఒకనవ్వు నవ్వి:

"నీవు గ్రీకు చక్రవర్తివే కావచ్చును. కాని భారతీయుడవు కాదు గదా. కాలేవు కూడాను. నీకు నేను నమస్కరించుటయా?"

అని పల్కాడు. ఆహా! భారత సామాన్య పౌరునికే ఎంత వెల నిచ్చాడు.

తానాజీ ఎవ రనుకున్నావు? మహారాజ భక్తుడు. తనయుని పెండ్లిసమయంలో రాజాజ్ఞను పాలించి దేశంకోసం దేహాన్ని అలా, అలా ఛల్ ఛల్ మని విజృంభింపజేసి ఆఖరిరక్తబిందువు చిందువరకు ప్రాకులాడిన ఆచర్యవీరుడు.

బొబ్బిలి బెబ్బులు లన్న మాట వింటివె? వహ్వా! వెంటనే కత్తిసామునేర్చి కదన రంగమున ఉరికిన బాగుండనే అనిపించు తుంది. పాశ్చాత్యులు మనను 'దేహి'యని ఒక్కింతచోటు నాశించి మోసంతో వంచించి, మంచిని మర్చిపోయి బొబ్బిలిని సర్వనాశనం చేసినపుడు మన తాత ఎవరు? తాండ్రపాపయ్య ఏమని నొక్కి వక్కాణించా డంటే "ఒరేయ్ బుస్సీ! మా ఆంధ్రవీరుల ఒక్కొక్క రక్తపుబొట్టు ఒక్కొక్క మహా యోధుడై మిమ్మల్ని మాగడ్డపైనుండి కుక్కల్ని తరిమినట్లు తరుముతారురా. దొంగచాటుగా అన్యాయముతో మాకోటను, కోటలోని మహావీరులను పొట్టన బెట్టు కున్నావురా! వీరబొబ్బిలి పుట్టుక పుట్టి మీ చేతులో మేము మడయుట మనునది మా ఆంధ్రఅవనికే అపకీర్తి. నిన్ను చిత్రవధచేసి నా బాకుకు నేనే బలి యౌతాను."

తళుక్కుమని ఖడ్గమును మెరిపించి దానికి రెండు ప్రాణాలను మేతవేసి ఒరిగి పోయాడు. ఆంధ్రమాత మూల్గులతో కన్నీరుకార్చింది.

మొన్న మొన్నటి అల్లూరి సీతారామరాజు వీరరసపు మాటలు నీతి వాక్యములు వింటుంటే మ్రోగుచున్న ఆ స్పీకరుముందు మోకరిల్లి అంజలి ఘటించుదమా అని పిస్తుంది. తన చేతికందిన శత్రువులను నీతి న్యాయములకోసం సహృదయతను చాటి చెప్పినట్లు విడిచిపుచ్చాడు. తన మన్యప్రజల కోసం న్యాయాన్ని సాధించాలని పోరాడి చివరకు ద్రోహుల దోపిడి దుండగాలను సహించలేక తన ప్రజలకొఱకు తనను

తామగా శత్రు మూకకు అప్పగించు కొనుటయేగాక ఢాం! ఢాం!! ఢాం!! అను తుపాకీ గుండ్ల శబ్దముతోబాటు 'వందేమాతరం' అను భక్తి యందెలను ఘల్ ఘల్ మని మ్రోయించుచు భారతీయుడుగాను, చిరస్మరణీయుడుగాను తల్లి వడిలో ఒరిగిపోయాడు.

ఝాన్సీ, రుద్రమ, మల్లమ మొదలగు వీరవనితలు స్త్రీజాతికి మణిమాణిక్యములు. కత్తి పట్టి కదనరంగమున కురికి వైరులకు వెన్నియ్యక వారిచేతనే 'శభాష్' అని అక్కజమొందిన వీరనారీ శిరోరత్నము లందఱు మనవారే.

రాణా ప్రతాపుడేమి, ఛత్రపతి శివాజీయేమి, ఒకరేమిటి ఎందరెందరో విక్రమార్కులు అవక్ర పరాక్రమాలను చాటుచు ధర పరాగరేణువులు పై కెగసి మిన్నంటుచుండ రణంబున వీరావేశమున నవరత్న ఖచిత ఖడ్గములను ఝుళఝుళ ఝుళిపించి తళతళమని మెరిపించి వైరి నెదిరించి తరలించిన వీర సూరాగ్రేసరు లందఱు దివినుండి భువికి తమతమ దీవెనలను వెదజల్లుతూనే యున్నారు.

దైవ భక్తులు, దేశ భక్తులు, మత సంస్కర్తలు, ధర్మకర్తలు, జ్ఞాన కర్తలు, శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలు, పలు శక్తులు గల వక్తలు అవినీతిని రత్తిరించు కత్తులై దేశ దేశాలకు కీర్తి సుమముల ఘుమఘుమలను వెదజల్లు పూగుత్తుల వంటి మహామహులు బుట్టిన ఈ మెట్టపై ఎట్టి అవలక్షణములు వచ్చినను పై నుదహరించినవారంతా కంటతడి పెడతారు నాన్నా.

మన పవిత్రతను ప్రపంచానికే చాటుటకు తెల్లని ముసుగును ధరించి తల్లి యనుపున పై కెగసిన మన మంచుకొండలను జూచియు, కలుషములను కడిగివేయుచు, గంగా యమునానదులు గలగలమని పాఱుచు సస్య శ్యామలములను చాటుచున్న జీవబాటలను గాంచియు, రత్నరాసులనే అంగడులందు గల అవనీమాతను తిలకించియు, స్వర్ణ మండపములతో జిగజిగలు ఎగజిమ్ముచున్న దేవళములను గాంచియు, నీతినియమపు నిఘంటువుల హద్దులను జూచి మన బంగరు భూమిని కాజేయుటకు ఎందఱో దాడులు సలిపి ధనరాసులను జూచి కొల్లగొట్టారు.

ఒకటి రెండు గాదు. పదునేడుమారులు దండెత్తివచ్చి మన బంగారము నంతటిని గజనీ తరలించినను, ఆంగ్లేయులు వర్తకమని బిచ్చమెత్తి మంచిని గమనించలేని మత్తులో మనలనే తుత్తునీయలు చేయవలె ననెడి ఎత్తులు ఎత్తినను ఇలాంటి వెన్నెన్నో జరిగినను ఈనాడు మనము హాయిగా అమ్మ కొంగుచాటున మధురమైన జీవితాలను గడుపుచున్నామంటే అంతయు మనఅమ్మ దీవెనయేబాబూ.

నేటి విద్యార్థులలో చాలమంది దారితప్పి చెడుమార్గములనుబట్టి తమతమ బ్రతుకులనే పాడుజేసుకుంటున్నారు. అటువంటి అప్రాచ్యులను జూచినపుడు మనతల్లి కంటికి కడివెడు వలపోయునన్నమాట ఎప్పుడూ గుర్తుంచుకొని ఆ కలలు రాకుండా చూచుకో కన్నా. ఏం?

అమ్మ నలుముకున్న దాస్యపుఛీకట్లను పారద్రోలుటకు గాంధి, నెహ్రూ మొదలగు మహాత్ములు అహింసాజ్యోతిని వెలిగించి, ఆ జిలుగు వెలుగులో కనిపించిన కసాయి వారి సందటిని తరలించారు. శాంతిదూతగా ప్రపంచఖ్యాతి గడించిన మన బాపూకు తగిన వారసుడవు కాదలచిన ఆయా మహానీయుల అడుగుజాడలవెంబడి అనుసరించాలి.

పూర్వం క్షత్రియుడు దేశరక్షణ భారము కల్గి ఎదిరిని ఎదిరించెడివాడు. కాని బాధ్యతాయుత ప్రజాప్రభుత్వ మున్న నేడు ప్రతి పౌరుడు చెయ్యెత్తి జై కొట్టి నడుముకట్టి మనపై లంఘించుచున్న చీనీరక్కసులను కిక్కురుమనకుండా చూడవలసిన బాధ్యత, భాగ్యము కల్గియున్నాడు. ప్రగతి గడ్డపై నున్న ప్రతిబిడ్డడు అమ్మఋణం తీర్చుటకు కంకణం కట్టాలి. అట్లు కట్టుటకు చిన్ననాటి నుండియు నీవిధులను బాధ్యతలను గమనించి బ్రతకాలి. మరి ఈ అమ్మ కన్నులను కమలాలు చేస్తావో కావేరులు కమ్మంటావో అంతా నీ నిర్ణయం. నా చిన్ని కన్నడు నామాట కాదనడు. కన్నీరు గారే పన్నీరు చిలికిస్తావని ఆశిస్తూ సత్పౌరుడవు కమ్మని దీవిస్తున్న నీ జనని.

కరుణ.

"అక్కా"... భగవంతుడు నీ కెంతటి భాగ్యమిచ్చాడు! అనాటి నీ కన్నీటి వెనుక ఇంత అర్థమున్నదంటే మే మెలా గ్రహిస్తాము? ఏవేవో భావాలు నాకే రెకెత్తి మాట కూడ త్వరగా పెకలలేదంటే నమ్ము. నీ ఆశయాల కిదే అంజలి చేస్తున్నాను."

"అందఱికి ఇలాంటి ఆశయా లుండవచ్చు. గాని వాటి నన్నింటిని లిఖిత రూపంలో కూర్చినపుడు వాటికి కాస్త మెరుగు వస్తుంది."

"సరే ఈ అధ్యాయమిలాముగించేద్దాము. మరొక విశేషమీనా దేం జరుగబోతుంది. గుర్తు దెచ్చుకో అక్కా."

"గుర్తుతెచ్చుకొనుటకు మర్చిపోతే గదూ! మీ బావగారు కచ్ మాష్టర్ ట్రైనింగ్ నుండి ఈరోజే వస్తారు. వారు యూనిఫారమ్‌లో ఉంటే ఎలా యుంటారో చూడవలెనని దినమొక యుగంగా గడుపుతున్నా నమ్మా, ఆ, త్వరగా అన్నీ సర్దుకొని వారికి సుస్వాగతం పలకాలి" అని చెప్పి కరుణ లోపలికి వెళ్ళి అవి ఇవి సర్దుకుంటోంది.

"అక్కా! అక్కా! మాటలోనే దిగారు. నిండా నూరేళ్ళాయుస్సు. రిక్షా దిగి పడక చుట్ట చంకన బెట్టి చేలాంతరు ఊపుకుంటూ ధన్ ధన్ మని బూట్ల శబ్దముతో కదలి వస్తున్న ఈ మహా యోధు దెవరా అనిపిస్తోంది."

అరుణ నవ్వుకుంటూ చెప్పిన మాటలు నమ్మకి కరుణ బయటికే రాలేదు.

"రావేమమ్మా తల్లీ! నా మాట వట్టిదే ననుకున్నావా? ఏమిటి" అన్న అరుణ మాటకు కాలి అడుగులు శృతి కలిపి స్థిరం చేయగా కరుణ అత్యానందంతో చేతులు తుడుచు కుంటూ "అ! నిజంగానా..." అంటూ బయటికి వెచ్చేవరకు బూట్లు చప్పుడు చెయ్యకుండా కరుణ ఏమి మాట్లాడుతుందో నని వేచియున్నది.

ప్రతాప్‌ని ఆపాదమస్తకం తిలకిస్తూనే పొంగి పొంగి వంగి పాదాలంటి కన్నుల కద్దుకొని లేచి ఏమీ తోచక నిల్చున్న కరుణ వదనారవిందము రవి కిరణాలు సోకి విప్పారిన కమలాన్నే మరిపించేలాగు కళకళ లాడుచున్నది.

"కరుణా! ఈ డ్రెస్‌లో చూడాలని ఉబలాట పడుతూ నీవు వ్రాసినందుకే ఇలా వచ్చాను. ఎలాగుంది మరి! శ్రీమతిగారి ఉరువు కదూ! తప్పుతుందా?"

"బ్రహ్మాండంగా యున్నది. ప్రజల రక్షణార్థమై అవతరించిన అపర ప్రతాప్‌లకు భరతమాత మెచ్చి ఇచ్చిన బహుమానం లాగున్నది."

"అరుణా! మీ యక్కగారి కవిత్వము రోజురోజుకు బిరుదుకోసం బిరబిర పరుగులు తీస్తున్నట్లున్నదే చూడగా."

"పొండి మీరు మరీను" అన్న కరుణ మాటలకు ప్రతాప్ "ఇప్పుడే వస్తుంటే ఇంట్లో అడుగైనా మోపకముందే మరల పొమ్మనుట నీకు న్యాయమేనా కరుణా" అని అన్నాడు.

అందరు గల్లున నవ్వారు. తన ముద్దు బిడ్డల ఆనందాన్ని చూచుకొని భరతమాత పక్కున నవ్వింది. మన అమ్మ నవ్వింది.

(11 వ పేజీ తరువాయి)

"మీ అబ్బాయి పట్టూ ఉన్నాడే," మిస్టర్ చింతా రామయ్య గర్జన విననట్టుగానే చెప్పుకుపోయాడు, "ఈ సృష్టిలో కంతకీ ఒక్కత్తె తనకు తగిన అమ్మాయి ఉందని అనుకుంటున్నాడు. ఆమె పేరు నాకు తెలియదు. అతనికీ తెలుసో తెలియదో. ఆ అమ్మాయి మాత్రం ఫలానా శంకరయ్య కుమార్తె అని అతనికి తెలుసు. ఆ అమ్మాయిని పెళ్లాడే అవకాశం లేకపోతే, అతను జీవితసుఖాలన్నీ కాఫీతోసహా త్యజించి సన్యసించడానికి నిర్ణయించుకున్నాడు."

"ఏమిటీ?" అన్నాడు రామయ్య గట్టిగా.

"వెళ్ళిపోతున్నా." అంటూ ఆకస్మాత్తుగా లేచాడు పట్టూ. "ఈసారి ఇంక వెళ్లిపోడమే. ఈసారి మాత్రం ఖాయం. ఈసారి మాత్రం తిరిగిరాను. ఈసారి నిజంగా–ఈసారి..."

"అదేమిట్రా నా తండ్రీ!" అంటూ కొడుకుని గట్టిగా కౌగిలించుకుంది సుబ్బమ్మ. ఆ కౌగిలించుకోడంలో ఆప్యాయతేకాదు; అతను వెళ్ళిపోకుండా ఆపాలన్న ఆకాంక్ష కూడా ఉంది. నిజంగా తను అతన్ని పట్టుకుని ఆపగలదనికాదు.

"పోతే పోనీ వెధవ?" అన్నాడు రామయ్య. అయితే అతని గొంతులో వెనకటి బలం లేదు; అతని మాటల్లో అతనికే నమ్మకం లేనట్టు కాస్త జంకింది.

"వెడుతున్నా. వెళ్ళిపోతున్నా. ఆ అమ్మాయిని పెళ్లాడానికి మీరొప్పుకోకపోతే తక్షణం వెళ్ళిపోతున్నా. ఇంక మళ్ళీ రాను. ఇంక మీరు నాకు అమ్మా నాన్నా కాదు. నేను మీ బిడ్డనీ గాను. ఇదుగో – వెడుతున్నా." అన్నాడు పట్టూ, మరింత బలంగా.

"వొద్దురా నాయనా. ఈ ముసిలాళ్లిద్దర్నీ వొదిలిపెట్టి పోతా ననడానికి నీకు నోరెలా వొచ్చిందిరా? నాతండ్రీ. నీ ఇష్టమొచ్చినట్టే కానియ్యరా. మేమేమీ అడ్డుచెప్పం. నీకంత ఇష్టమైతే ఆ అమ్మాయినే చేసుకోరా." అంటూ దేవళ్లాడింది సుబ్బమ్మ.

"ఏమిటీ?" అని మరింత గట్టిగా అరిచాడు రామయ్య. తన గొంతు పెద్దదని రుజువు చేసుకోడానికి తప్ప, ఆ అరుపువల్ల అట్టే ప్రయోజనం ఉండదని రామయ్యకే తెలుసు.

"ఎందు కల్లా అరుస్తారు. కుర్రాడసలే బెంబేలుపడిపోతే, వెర్రినాన్న మూణ్ణాళ్ళగా తిండీ తిప్పలూ లేకుండా తిరిగి తిరిగి ఇంటికొస్తే, ఇలా కసిరికొట్టడమా మీరు చేసేది. చాల్లెండి. రారా బాబూ. నీళ్లోసుకుని నాలుగు మెతుకులు తిందుగాని." అంటూ సుబ్బమ్మ పట్టూని యుద్ధక్షేత్రంనించి అవతలికి తీసుకుపోయింది. దాంతో యుద్ధనిర్ణయం తేల్చేసిందికూడా. తను ఓడిపోయినట్టు రామయ్యకి అర్థమైపోయింది.

"నాకు శలవిప్పించండి." అంటూ లేచాడు మిస్టర్ చింతా. "ఈ సందర్భంలో నావల్ల అయ్యే సహాయం ఏమున్నా, మీరు నిస్సంకోచంగా నాదగ్గరకురావచ్చు. శలవా?"

మిస్టర్ చింతా ఒక ప్రసిద్ధ నాట్యగీతం ఈలపాట పాడుకుంటూ నిష్క్రమించాడు. మరొకళ్ళ ప్రమేయం లేకుండా ఉంటే రామయ్య తొందరగా ఒక నిర్ణయానికి వస్తాడని అతని అభిప్రాయం.

(సశేషం)

తెల్లవారు - నల్లవారు

విద్వాన్ దర్భా వేంకటకృష్ణమూర్తి

1

తే॥ పాఁడిపంటలఁ దులఁ దూఁగుభరతభూమి
ననుభవించిరి 'తృప్తాస్మ' యనుచుఁ జిరము
కడకు దాని ద్విధా విభక్తం బొనర్చి
చల్లఁగా జాఱుకొన్నారు తెల్లవారు.

2

తే॥ ఒక్కటిగ నున్నవిత్తనం బుర్వి నిడినఁ
దొలుత రెండుగఁ జీలి, యవ్వలఁ దనంత
సాఁగి యయ్యదె శాఖోపశాఖ లల్లి
నెగడుఁ గాదె మహావృక్ష మగుచు జగతి!

3

తే॥ రెంటి నొకటిగఁ గూర్చు మైత్రీభరంబు
దేశసౌభాగ్యమున కయ్యదే పునాది;
ఒకటి రెండుగఁ జీల్చు నహో యసూయ
దేశదౌర్భాగ్యమున కయ్యదే పునాది.

4

తే॥ చీలిపోవంగ నేడ్చుదుశ్శీలు రొకరు
చీలఁదీసి జయిఁచుధీశాలు లొకరు
కాలగతి వారు వీరు నేకత్ర చేర
దేశసౌభాగ్య మేడ? శాంతి మఱి యేడ?

5

తే॥ కుడిచి బలిసినఱొమ్మునే గ్రుద్దువారు
తీయతీయఁగఁ గుత్తుకల్ గోయువారు
నైంద్రజాలికులకు నన్న లైనవారు
నీతి — కుల — మతముల మాపుజాతివారు.

6

తే॥ ఏలినన్నాళ్ళు జులుము సాధించినారు
పోవునప్పుడు భేదించి పోయినారు
"రాచపీనుఁగు తోడు వినా చనంగఁ
బోల" దనుసూక్తి నేఁ డనుభూత మయ్యె.

7

తే॥ ఎంత దక్షులో నాడీపరీక్షయందు!
భారతీయులలోనితత్త్వం బెఱింగి
చల్లచల్లఁగ భావదాస్యంబు నాటి
మెల్లఁగా దాఁటుకొన్నారు తెల్లవారు.

8

తే॥ తేనె పూసినకత్తు లాతెల్లదొరల
లోనినలుపును గన లేక మేనితెలుపె
యెంచి మనవారు మురిసిపోయిరి యయారె।
తెల్లవారలచేఁ దెల్వి తెల్లవాఱె.

9

తే॥ ఉబ్బులే కాని స్వాతంత్ర్య మబ్బె ననుచు
సమసెనే నేఁడు భావదాస్యంబు మనకు?
వేష — భాషల నాహార - విహృతులందు
వారె కారె యుపాస్యదేవతలు మనకు!

10

తే॥ భావదాస్యంబు భేదభావంబు లుడిగి
స్వార్థచింత లయించి, యైక్యము రహించి,
భారతీయులపుణ్యంబు పంట పండి
వర్ధిలుం గాత పూత మాభరతమాత!

సంస్కృతభాష: ప్రజలు, ప్రభుత్వము

చివుకుల మార్కండేయశాస్త్రి

పూర్వకాలంనుండీ భారతదేశంలో విద్యా విధానాన్ని ప్రజల ఉద్యమమూ ప్రభుత్వ సహకారమూ చేదోడు వాదోడుగా ఉండి నడిపిస్తూ ఉన్నది. సంస్కృత భాషాభ్యసనంలోగూడ ఈ విశేషమే ఆంధ్ర దేశంలో కనిపిస్తూవుంటుంది. కాకపోతే. ఒక్కొక్కప్పుడు ప్రజల ప్రయత్నమే ప్రస్ఫుటంగా కనిపిస్తేమరొకప్పుడు ప్రభుత్వ సహకారం బహుళంగా ఉంటుంది.

గురుకులాల్లో ఆచార్యశిష్య సంప్రదాయంలో సంస్కృత. శాస్త్రాలూ చదువుతూ వుండేవారు. సంపన్నులూ, మహారాజులూ ఈ చదువులు అనవరతంగా సాగుతూ ఉండటానికి దానాలూ, ధర్మాదాయాలూ ఏర్పాటు చేశారు. గురుశిష్యులు వీటిమీద వచ్చే వరుమానం ఆధారంగా చేసుకుని జీవిస్తూ విద్యలను సాగిస్తూ ఉండేవారు. కొన్నిచోట్ల దేవస్థానాలుగూడా తమ రాబడిలో కొంత ఈ సంస్కృతవిద్యను పోషించడానికి వినియోగిస్తూ ఉండేవి. ఈ విధానంగా ఏర్పాటై వృద్ధిలోకి వచ్చినవే ఈనాడు ఆంధ్ర దేశంలో చాలాకాలంగా పేరుమోసిన సంస్కృత కళాశాలలు. వీటిలో ప్రధానంగా విజయనగరం, రాజమండ్రి. మోదేకుర్రు, ఆగిరిపల్లి, పొన్నూరు, నెల్లూరు, తిరుపతి. హైదరాబాదు (వేదాంతవర్ధని). వరంగల్లు (విశ్వేశ్వర) లలో గల వాటిని పేర్కొన వచ్చు.

దేశంలో పరప్రభుత్వపాలనలో సంస్కృత విద్యలమీద మోజు తగ్గింది. మెకాలే పుణ్యమా అని, చదువులలో గూడ భావదాస్యం ప్రబలి, మహారాజులూ సంపన్నులూ గూడ విదేశీవిద్యా సంస్థలనే ఎక్కువగా పోషించారు. పరప్రభుత్వం ఈ సంస్కృత విద్యాలయాలమీద సహజంగా సవతితల్లి ప్రేమనే చూపిస్తూవచ్చింది. పాశ్చాత్య విద్యావిధానంలోఉన్న విద్యాలయాలకు పూర్తిగ్రాంట్లు యిస్తూ, ఈసంస్కృత పాఠశాలలకుమాత్రం సగంగ్రాంట్లు ఇచ్చేది. ఇదిగూడ చివరకు చేతికి వచ్చేసరికి నామ మాత్రంగా ఉండేవి. దీనిఫలితం ఏమిటంటే, సంస్కృతం నానాటికి ప్రజలకు దూర మవుతూవచ్చింది. చివరవరకు వానిని అభినివేశంతో ఆరాధించే ఏకొద్దిమంది భాషగానో నిలచిపోయింది. హైదరాబాదు సంస్థానప్రాంతంలో ఈకొద్దిస్వరూపంగూడా ఉండేదికాదు. సంస్కృతం సంగతి అటుంచి, మాతృభాషలకే (ఉర్దూ మినహాగా) అక్కడ గతిలేదు.

దేశం స్వతంత్రం కావటం, సంస్థానం భారతదేశంలో అంతర్భాగం కావటం — ఈ రెంటితో సంస్కృతభాషాభ్యసనానికి తిరిగి నవశకం ప్రారంభమయింది. శాస్త్రజ్ఞానంతోపాటు, దేశభాషలలో నిష్ణాతృత్వం గూడా అవసరమని స్వదేశీప్రభుత్వం గుర్తించింది. దానితో సంస్కృతభాషను తిరిగి ఉజ్జీవింపచేయవలసిన అవసరం ఏర్పడింది. దీనికిగాను, ఈభాషను ప్రజాబాహుళ్యానికి సన్నిహితం చేయటంద్వారాను, ఈ భాషను అభ్యసించినవారికి జీవితావకాశాలను అన్నింటిని అందుబాటులో ఉండేటట్లు చేయటంద్వారాను ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాల పర్యవసానమే నేడు ఆంధ్రప్రాంతంలో గల సంస్కృతోన్నత పాఠశాలలు.

ఈ పాఠశాలల విద్యావిధానంలో మామూలు హైస్కూళ్ళలో వలెనే, అన్ని పాఠ్యాంశాలలోనూ, అదే ప్రణాళిక ప్రకారం బోధన జరుగుతుంది. మామూలు హైస్కూళ్ళలో ఈ విషయాలని బోధించటానికి అర్హత గల ఉపాధ్యాయులే, సంస్కృతం హైస్కూళ్ళలోనూ, ఉంటారు. ఇది గాక మాధ్యమిక తరగతులలో సంస్కృతం వారానికి పదిపీరియడ్లు ఉన్నత తరగతులలో పదిహేను పీరియడ్లు ఉంటుంది. ఈ సంస్కృత బోధనా ప్రణాళికా ప్రధానంగా పూర్వపద్ధతిలో గల సంస్కృత భాషాధ్యయన విధానం దృష్టిలో పెట్టుకుని రచించారు. అందువల్ల, ప్రాచీన విధానంలో సంస్కృతం నేర్చుకొనటం, నవీన విధానంలో ఇతరాంశాలను నేర్చుకొనటం, ఈ రెంటినిగూడ సమన్వయించి, ఈ సంస్కృతోన్నత పాఠశాలల విద్యా విధానం సమకూర్చబడిందని చెప్పవచ్చు. 1956-57 సం॥ లో భారత ప్రభుత్వం నియమించిన సంస్కృత కమిషన్, సంస్కృత పాఠశాలలను ఈ పద్ధతిలో ఆధునీకరణం చేయాలని సూచించింది. కాని దీనికి 5,6 సంవత్సరాలకు పూర్వమే మన రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్కరణను ప్రారంభించి సంస్కృత విద్యావిధానంలో చాల మారదృష్టిని చూపించింది. మాధ్యమిక దశలోను, ఉన్నత దశలోనూ ఈ రకం సంత్కృత పాఠశాలలు ఇప్పుడు 38 ఉన్నవి. వీటిలో సుమారు ఏడు వేల వరకు విద్యార్థులు చదువుతున్నారు: 400

పైగా ఉపాధ్యాయులు చదువులు చెప్పుచున్నారు. వీటి మీద సాలుకు ఎనిమిది లక్షల దాకా ఖర్చు అవుతుంటే ఇందులో ఆరున్నర లక్షల వరకు ప్రభుత్వమే గ్రాంట్ల రూపంగా ఇస్తూ ఉన్నది.

ఇవి గాక, సంస్కృత ప్రాథమిక పాఠశాలలు పది ఉన్నవి. పైనచెప్పిన సంస్కృతోన్నత పాఠశాలల పద్ధతి రాకపూర్వం, ఈ సంస్కృత ప్రాథమిక పాఠశాలలు సర్కారువారి సంస్కృత ప్రవేశ పరీక్ష (Govt. Sanscrit Entrance Examnition) విద్యావిధానంలో పూర్వరంగంగా ఉంటూఉండేవి. కాని ఈనాడు రాష్ట్రప్రభుత్వం అమలులోకి తెచ్చిన సమీకృత ప్రారంభ విద్య (Integrated Elementary Education) ననుసరించి వీటి పాఠ్య ప్రణాళికనుగూడా సంస్కరించారు. ప్రస్తుతం ఇవి సంస్కృత హైస్కూళ్ళకు ప్రాథమిక దశగా ఉంటున్నవి. ఇటువంటి పాఠశాలలు రాష్ట్రంలో 11 ఉన్నవి వీటిలో విద్యార్థులు 750 దాకా ఉన్నారు. 35 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రభుత్వం వీటికి సుమారు 28 వేల పైదాకా సాలుసరి గ్రాంట్లు ఇస్తున్నారు. కాని వీటిపై మొత్తం 48 వేలకుపైన ఖర్చుఅవుతున్నది. ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం ఇందులో రెంటికి మాత్రం పూర్తి గ్రాంట్లు, మిగతా వాటికి సగం గ్రాంట్లు ఇస్తున్నారు.

తెలంగాణా ప్రాంతంలో వేరే పద్ధతి అమలుజరుగుతూ వుంది. ఇక్కడివి కేవలము సంస్కృత పాఠశాలలు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జరిపే సంస్కృత ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను తర్ఫీదు చేయటం వీటి లక్ష్యం. విద్యార్థుల మనోవికాసాన్ని బట్టి ఈ తర్ఫీదు 2 సం॥ల నుండి 6 సం॥ల వరకు సాగుతుంది. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులయినవారు ఆ విశ్వవిద్యాలయంలో డిప్. ఓ. యల్. చదవటానికి అర్హులౌతారు. ఇటువంటి పాఠశాలలు నెలకొల్పటంలో సంస్కృత విద్యాసమితి (Council of Sanskrit Education) బహుముఖంగా సేవచేసింది 32 పాఠశాలలదాకా అత్యుత్సాహందో ఈ సమితి నెలకొల్పింది. సంస్కృత విద్యాగంధం లేని ఈ ప్రాంతాలలో సంస్కృతం పట్ల అభిముఖ్యం కలగటానికి ఇది బాగా తోడ్పడ్డవి. కాని వీటిలో చాలా భాగం ప్రజలలోనూ పరిసరాలలోనూ నిలదొక్కుకోలేకపోవటంతో వీటి సంఖ్య క్రమేణా దిగజారి ప్రస్తుతం పది మాత్రం ఉన్నాయి. వీటిలో 9 సంస్కృత విద్యా సమితి క్రిందనూ, ఒక్కటి వ్యక్తిగత యాజమాన్యం క్రిందనూ ఉన్నవి. వీటిలో రెండు వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. 30 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీటికి సుమారు 40 వేల రూపాయలు దాకా ఖర్చు అవుతున్నది. 30 వేలదాకా ప్రభుత్వం గ్రాంట్లు ఇస్తున్నది. ఒక నిర్ణీతమైన విద్యావిధానం ఇంకా ఏర్పాటు కాకపోవటం వల్ల వీటికి సహాయం చేయడంలో గూడ ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఏర్పడలేదు.

సంస్కృత విద్యావిధానంలో ఉన్నతతమమైన దశ సంస్కృత కళాశాలలు. ఈనాడున్న విద్యావిధానంలో ఇవి ప్రధానంగా విద్యాలయాలకు కావలసిన భాషా పండితులను తయారుచేయటానికే ఉపయోగిస్తున్నది. వీటిలో విద్య నాలుగు సంవత్సరాలు. ప్రస్తుతం వీటి సంఖ్య 20. ఇందులో అయిదు తెలుగు ప్రధానంగానూ, ఒకటి సంస్కృతమే ప్రధానముగాను ఉన్నవి. మిగిలినవాటిలో సంస్కృతము, తెలుగు ఈ రెండు భాషలూ ప్రధానంగాగల కోర్సులు ఉన్నవి. ఈ కళాశాలలో సంస్కృతమే ప్రధానంగా 170 మంది, తెలుగు ప్రధానంగా 850 మంది విద్యార్థులు చదువుతున్నారు. 175 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీటిమీద సంవత్సరానికి మొత్తం 4,60,000 రూపాయల దాకా ఖర్చు అవుతుంటే ప్రభుత్వం 1,75,000 రూపాయలువరకు గ్రాంట్లు ఇస్తున్నది.

ఈ విధంగా వివిధ దశలలో సంస్కృత విద్యాలయాలలో ఆ భాషాధ్యయనం జరుగుతున్నది. ఇది గాక, మామూలు పాఠశాలలలోనూ కళాశాలలలోనూ, విశ్వవిద్యాలయాలలోనూ సంస్కృత విద్యాభ్యాసం ఇతోధికంగా జరుగుతూనే ఉన్నది. వీటిలో మొత్తం సంస్కృత విద్యార్థులు 10,000 పైగా ఉండవచ్చునని అంచనా.

ప్రజలలో ఇంకా ప్రోత్సాహం కలగటము కోసం, ప్రభుత్వం సంస్కృత కళాశాలలో చదివే విద్యార్థులకు నెలకు ఒక్కొక్కరికి 60 రూపాయల చొప్పున 500 స్కాలరుషిప్పులు మంజూరు చేసింది. ఇవిగాక నెలకు ఒక్కొక్కరికి 30 రూపాయల చొప్పున 45 స్కాలరు షిప్పులు ఇస్తున్నారు, విశ్వవిద్యాలయాలలో ప్రాచీన పద్ధతిలో పరిశోధన చేసే విద్యార్థికి నెలకు అరవై రూపాయల చొప్పున ఒక స్కాలరు షిప్పు. సంస్కృతం యమ్. ఏ. చదివే విద్యార్థికి అరవైచొప్పున ఒక స్కాలరు షిప్పుగూడ మంజూరై ఉన్నది. సంస్కృత ఉన్నత పాఠశాలలో చదివేవారికి నెలకు 4 రూపాయల చొప్పున ఇరవై, 8 రూపాయల చొప్పున ఇరవై, మొత్తం 40 స్కాలరుషిప్పులు ఇస్తున్నారు. ఇది గాక కేంద్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో చదివే సంస్కృత విద్యార్థులకు నెలకి పది రూపాయల చొప్పున 40 స్కాలరుషిప్పులు ఇస్తున్నారు.

సంస్కృత విద్యాపోషణలో ప్రజా సహకారం గూడా మన రాష్ట్రంలో చెప్పుకోదగినంతగా ఉన్నది. దాదాపు ప్రాచీన సంస్కృత కళాశాల లన్నిటిలో గూడ సంస్కృత విద్యార్థులకు ఉచిత భోజన వసతి లభ్యమగుచూనే ఉన్నది. ఇందుకు ప్రధానంగా విజయనగరంలోని సింహాచల దేవస్థానం సత్రం, తూర్పుగోదావరి జిల్లా పలివెల గ్రామం, రాజమండ్రిలలోని ధర్మసత్రములూ మొదలగువాటిని ఉదాహరణంగా చెప్పుకోవచ్చును. రాజమండ్రి, ఆకిరి

"జన్మభూమి"

ఈమని వేంకటకృష్ణశర్మ

సీ॥ అనఘ పోతన్న త్యాగన్న గోపన్నల నెన్నగఁ గాంచిన పృథివి యెద్ది ?
కృష్ణరాయాది సత్కీర్తి ధుర్యులఁగాంచి పొల్పునొందిన పుణ్యభూమి యెద్ది ?
వర తిమ్మరుసు యుగంధర తిక్కనార్య సన్మంత్రులఁ గన్న భూమాత యెద్ది ?
పూజ్య గౌతమ్యాది పుణ్యాపగల వయస్యలుగఁ గాంచిన మేటి యవని యెద్ది ?

తే॥ తెల్లదొరల గుండెలు తల్లడిల్ల దన్ను జంపుమని నట్టి "యాంధ్రకేసరిని" "విశ్వ
దాత", "పట్టాభి", "బులుసుల" ధైర్యపరులఁ నాత్మజులఁ గన్న దదియె దివ్యాంధ్రమాత.

క॥ నిరశననియతిని నాంధ్రుల కొరకయి రాష్ట్రంబుఁ గోరి గొప్పగ స్వర్గం
బరిగిన యమరునిఁ దలచెద స్థిరకీర్తిని "పొట్టి" వంశు శ్రీరాముఁ గృతిన్.

మ॥ నయ మొప్పారగ నాంధ్రదేశమున నాణ్యం బొప్పు నా "ముఖ్యమం
త్రియు" వాసిల్లు నశేషదీనసుజనార్తిం బాప నుద్యుక్తుడై;
అయము ల్గూర్పను "కాసు" వంశ శశి "బ్రహ్మానంద" ధీరుండు, సౌ
ఖ్యయుతాయుఃప్రదు డౌచు నీకు డతనిన్ గాపాడు నెవ్వేళలన్.

అ॥ అన్నపూర్ణ యింట నన్నము కరవౌనె? సకలజనులు సౌఖ్యసంపదలను
గలిగి బాధ లుడిగి కాంతురు సేమంబు; లాంధ్రదేశజనని యంకమందు.

ఉ॥ మంగళ మొప్పు నెల్లరకు; మంగళమౌ జనమంత్రికోటికిన్;
పొంగులు వారు సౌఖ్యములు; పోవును సాంఘిక తారతమ్యముల్;
రంగుగ నెల్లవారలు ధరాస్థలి నుందురు తోషితాత్ములై;
బంగరుపంటలం దెలుగువారు సుఖంచెద రెల్లవేళలన్.

(23 వ పేజీనుంచి)

పల్లి చిట్టిగూడూరు, హైదరాబాదు (వేదాంతవర్ధిని) మొదలగు చోట్ల ఆయా కళాశాలల పాలకవర్గంవారే తమ సొంత ఖర్చులతో ఉచిత భోజనవసతిని నిర్వహిస్తున్నారు; తిరుపతి, తిరుమల, వేములవాడ, యాదగిరిగుట్ట, వరంగల్, పొన్నూరు మొదలగు దేవస్థానముల సంస్కృత విద్యాలయాలలో ఆయా దేవస్థానాలే ఈ సౌకర్యమును నిర్వహిస్తున్నవి. నెల్లూరు, తెనాలి మొదలగుచోట్ల వదాన్యులు ఇచ్చిన ధర్మాదాయములనుండి విద్యార్థులకు ఉపకారవేతనములిస్తున్నారు. ఇంకా సంస్కృత విద్యకోసరం యిచ్చిన అనేక ధర్మాదాయములు అన్యధా ఉపయోగించబడుతూ అన్యాక్రాంతాలుగా ఉంటున్నవి, వీటి సద్వినియోగంలో ప్రజాసహకారం ప్రధానం.

రాష్ట్ర ప్రభుత్వ సహకారమూ, తిరుపతి దేవస్థానం వారి వితరణతో, కేంద్ర ప్రభుత్వం తిరుపతిలో సంస్కృత విద్యాపీఠమును స్థాపించింది. దీనిలో సంస్కృతోపాధ్యాయ శిక్షణ, వేదములు ఆగమములపై పరిశోధన, ఇతర కార్యక్రమములు జరుగుచున్నవి. కాలము జరుగుకొలది ఈ సంస్థ అభివృద్ధి నొంది, సంస్కృతమునకు ఇంకా ఎక్కువ సేవచేయగలదు. సంస్కృతముతో ఇతర దేశభాషలకు గల అవినాభావ సంబంధమును విపులీకరించుట ఈ సంస్థ చేయవలసిన ముఖ్యకార్యక్రమములోనొకటి

ఈ విధంగా, ప్రజలు ప్రభుత్వము అన్యోన్య సహకారంతో సంస్కృతాధ్యయనము నానాటికి మన రాష్ట్రిలలో పెంపొందుతున్నది. ఈనాడు ఈ భాషను కులమత వివక్షత లేకుండా అందరూ నేర్చుకుంటున్నారు. ఈనాడు సంస్కృత విద్యార్థులలో పెక్కురు ముస్లింలు ఉండటమేగాక, వారి పాండిత్యం చాలా నిర్దుష్టంగా ఉండటం ఆశ్చర్యకరంగా ఉండటంలేదు. మన జీవన సంస్కృతికి మూలంగా ఉన్న ఈ భాషను ఇంకా ప్రజలలోకి చొచ్చుకొనిపోవునట్లు చేయవలసిఉంది. అందుకు అనువైన వాతావరణం నానాటికి వృద్ధిపొందుతున్నది. ఈ విషయంలో ఆసక్తి చూపించే ప్రముఖులు చాలామంది ఉండటం ఉత్సాహకరం.

చిత్తూరు జిల్లాలో సందర్శించ దగ్గ కొన్ని స్థలాలు

రావుః సూర్యనారాయణమూర్తి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధాలశాఖ అధ్వర్యాన చిత్తూరుజిల్లాకు చెందిన పత్రికా సంపాదకులు, ప్రతినిధులు కొందరు గత మార్చి నెల 20 నుంచి 23 వ తేదీవరకూ చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో సమాజాభి కార్యక్రమాల సర్వతోముఖ ప్రగతినీ, యాత్రికస్థలాల అభివృద్ధినీ పరిశీలించే నిమిత్తం పర్యటించారు. ఈ సందర్భంలో పాత్రికేయులబృందం సందర్శించిన యాత్రికప్రాధాన్యత గల స్థలాల ప్రాభవ వైభవాలను వివరించడమే ఈవ్యాసం ప్రధానోద్దేశం.

మొగిలీశ్వర క్షేత్రం

చరిత్రాత్మకమూ, పురాణ ప్రసిద్ధమూ అయిన మొగిలీశ్వర పుణ్యక్షేత్రం చిత్తూరు నుంచి బెంగుళూరు వెళ్ళే మార్గంలో పందొమ్మిదిమైళ్ళ దూరంలో వున్నది. అనేక అద్భుతమైన ఆధ్యాత్మిక గాథలతోనూ, నిరంతరం నిరంతరాయంగా నందీశ్వరుని వక్త్రంనుంచి ప్రవహిస్తున్న అమృత మధుర గంగా స్రవంతితోనూ ఆధ్యాత్మిక జిజ్ఞాసువులను ఆనందపరవశులను చేసే ఈ దివ్యక్షేత్రం చిత్రవిచిత్రమైన ఈశ్వరుని చిద్విలాసాలతో విలసిల్లింది. భారతావనిలో ఆధ్యాత్మిక చింతన అంచులుగా మెరియుని అత్మలు మృగ్యం. ఉత్తమ ఋషిత్వం, ఉజ్జ్వలతా భావం హృదయాలలో జ్యోతిగా ప్రకాశింపజేసే ఈ పుణ్యక్షేత్ర మాహాత్మ్యమూ, దేవాలయ నిర్మాణ నిర్వహణోదంతమూ సంస్మరణీయమైనవి.

పూర్వ పురాణేతిహాసాలను బట్టి మొగిలీశ్వరాలయ ప్రాంగణాలలో గల త్రిశూలతీర్థం ద్వాపరయుగంలో మహత్తర మహిమాన్వితరీతిని సంభవించిన సంఘటనకు ప్రబలతార్కాణం. దేవర కొండ వాలునీడలో మురళీధరుడు మధుర మంజులగీతికలను ఆలపిస్తూ ఆలమందలను ఏపుగా మేపుతున్నాడు. ప్రకృతి వైపరీత్యంవల్ల ఒక్క నీటిచుక్కకూడా కనుచూపుమేరలో కరవయింది. అప్పుడు దప్పికగొన్న పశుబృందానికి పాతాళగంగ జలాన్ని ప్రసాదించవలసిందని ప్రార్థించగా గోపాలునికి విశ్వరూప సాక్షాత్కారమయింది. చిన్నికృష్ణుడు విషయం విన్నవించాడు. ఈశ్వరుడు సుందర మందహాస వదనంతో తన త్రిశూలాన్ని క్షితితలంపై దించి పైకితీశాడు. అంతటితో అంతర్వాహిని మానవుని జీవిత స్రవంతిలోని మంగళాచరణాన్ని వర్ణిస్తూ, అనంతరూపుడైన దేవదేవునికి అభిషేకమవుదామనే ఆనందోత్సాహాలతో ప్రవహించడం ప్రారంభించింది. శ్రీకృష్ణుడు పరవశుడై పరమానంద మేదుర మాధురీ విధిని వేణువుతో పశువులను ఆహ్వానించాడు. గంగిగోవులు పావనజీవధారా సలిలాలను గ్రోలి వివిధ భంగిమలలో విచిత్రనృత్యం చేశాయి. నాటినుండీ ఆ సలిలధార త్రిశూలతీర్థంగా త్రిజగత్ప్రసిద్ధి గాంచి, మానవజీవితంలోని గంభీరతను, పరమాత్ముని అనంతశక్తినీ ప్రకటించటానికా అన్నట్లు పరిఢవిల్లుతున్నది.

మొగిలిలో మొగిలప్ప భూదేవితో పాటు భువనభర్తను నిండుహృదయంతో విశ్వసించి జీవనయాత్ర సాగిస్తున్న రైతు యువకుడు. ఒకనాటి సాయంసధ్యవేళ అతను ఒక వృక్షమూలాన్ని ఛేదిస్తుండగా వేటుతప్పి గొడ్డలి భూమిపై పడింది. రెప్పపాటులో మేదినీతలంనుంచి రుధిరం పాతాళగంగలా పైకిదన్ని పరిసరమంతా రక్తసిక్తమయింది. భయభీతుడైన మొగిలప్ప గుండెను దిటవుపరచుకుని నెత్తురు చిందుతున్న ప్రదేశాన్ని హస్తాలతో స్పృశించాడు. వెన్వెంటనే ఈశ్వరుడు లింగాకృతిలో అతనికి సాక్షాత్కరించి "ప్రాగ్జన్మీయవాసనావాసితమైన సుకృత ప్రభావంవల్ల నీకు ఈ సంఘటన సంభవించింది. నేటినుంచి ఈ ప్రాంతం మానవుల్ని, ఐశ్వర్యాన్ని, అహంకారాన్ని, అన్ని ప్రవృత్తులను వదలి ఏకచిత్తంతో యాత్రికులు కొలిచే దివ్యక్షేత్రంగా విరాజిల్లగలదు. మానవమాత్రుడవైన నీవు ఈ లింగాన్ని ప్రతిష్ఠించి, ప్రతిదినం కొలిచి జన్మసిద్ధి, మోక్షసామ్రాజ్యం సముపార్జించుకో" అని అంతర్ధానమయ్యాడు.

మొగిలప్ప అనుందానంద సంభరితుడై, అపార భక్తిపారవశ్యంతో త్రిశూలతీర్థస్థలిలో ఈశ్వరప్రతిష్ఠ గావించి, మనోహర శిల్పకళావిలసితమైన శిలామండపం నిర్మించాడు. అయితే రక్తధార ఆగకపోవడంవల్ల భగవంతుని గాయాన్ని మాన్పాలనే ఆందోళన. ఆవేదనలతో

కొండలూ కోనలూ వెదికి మొగిలప్ప మూల్యంలేని మూలికలతో వైద్య ప్రక్రియ ప్రారంభించి సఫలమనోరథు డయ్యాడు. ఆ అపూర్వగాథ దేశం దిశ దిశలా వెన్నెలవాన విధంగా అలుముకుని వేలాది భక్తజనులు సంతోష సంరంభా లతో సందర్శించసాగారు.

మొగలప్ప విచిత్ర పవిత్ర చరిత్ర భక్తిపథంలో మానవుడెలా క్రమంగా ఉత్తీర్ణత చెందుతాడో బోధించింది. శివ లింగానికి క్షీరాభిషేకం చేసే నిమిత్తం అతను గంగిగోవును పెంచుతున్నాడు. కొంతకాలానికి అది పాలివ్వడం ఎందు వల్లనో ఎగవేసింది. దానికి హేతువు దురూహ్యమై మొగిలప్ప ఒకనాడు ఆవు అడుగు జాడల్లో నడక సాగించాడు. ఆ గోమాత దేవరకొండ వాలులో నుంచి ఒక నిబిడ నీరంధ్ర గుహలో ప్రవేశించింది. కన్నులు కానరాని గాఢాంధబంధురమైన ఆ బాటలో అతను ఆవుతోక ఆధారంగా ముందుకు వెళ్లాడు. కొద్ది నిముషాలలో కోటి కాంతులు ఒక్కటై వెలుగొందే గోపురం గోచరించింది. మొగిలప్ప ఆ దివ్యదీప్తికి దిగ్భ్రాంతు డయ్యాడు. జగన్మాత పార్వతీదేవి బంగారు కలశంతో ఆ భక్తాగ్రగణ్యుడికి సాక్షాత్కరించి ఈశ్వరుడు అనుదినం అతి ప్రీతితో ఆ ఆవు క్షీరాన్నే స్వీకరిస్తాడని తెలియజేసి, మహేశ్వరసందర్శనభాగ్యం సంప్రాప్తింప చేసింది. తన్మూలంగా తపస్సు ఫలించిన మొగిలిప్ప గృహోన్ముఖుడై ఆకలిదప్పులు లేని అఖండ జీవితం ఆరంభించాడు. అన్నపానాలు వినర్జించిన అతని పరమోత్కృష్టజీవితాన్ని అపార్థం చేసుకుని వారవధూజనాంతర నివాసంవల్ల ఆ విధంగా ప్రవర్తనలో పరివర్తన ఏర్పడిం దని అతని సతీమణి వేధించి, బాధించసాగింది. దుర్భరమూ, దుస్సహమూ అయిన ఆ అపనింద తాళలేక మొగిలీశ్వరుని సాన్నిధ్యంలో నిశ్చల ధ్యాన నిమగ్నుడై విగత జీవు డయ్యాడు.

మొగిలప్ప నిర్యాణానంతరం దేవాలయ నిర్మాణభారం వహించేవారు లేరని భావించబడింది. అయితే ఆలయ నిర్మాణం నిర్విఘ్నంగా కొనసాగడానికి ఇంకొక అత్యద్భుత సంఘటన దోహదం చేసింది. బళ్ళారినుంచి మద్రాసుకు పోయే మిరియాలవర్తకులు మొగిలిలో మజిలీ చేశారు. ఆ తరుణంలో జరాభార పీడితుడైన ఒక భూసురోత్తముడు నాలుగు మిరియపుగింజలకోసం వారిని అర్థించాడు. లుబ్ధాగ్రేసరులైనవారు అవి జొన్నలనే సాకుతో అతని కోరికను కాలదన్ని నిర్ణీత కార్యక్రమం ప్రకారం చెన్నపట్నం చేరుకున్నారు. విపణివీధిలో మూటలు విప్పి చూసేసరికి మిరియాలకు మారుగా జొన్నలు కానవచ్చాయి. నిశ్చలాంగులైన వర్తకులు ఆ మోసానికి మొగిలీశ్వరస్వామి కారకు డని భావించి అవి యథాపూర్వం మిరియాలుగా మారినట్లయితే శిల్పకళావైభవం వేనోళ్ళచాటే దేవాలయం నిర్మిస్తామని వేడుకున్నారు. ఈశ్వరుని కరుణాకటాక్షంతో వారికోరిక నెరవేరింది. ఆ మిరియాలను వరహాలుగా మార్చుకున్న అనంతరం మళ్ళీ వారిని దుర్నీతి ఆవహించగా, మొగిలిదారి విడిచి పక్కదారి పట్టారు. తలకోనవద్ద మజిలీ చేసి, ప్రయాణబడలికతో ప్రగాఢ సుషుప్తులయ్యారు. ఆ రాత్రి వారి వరహాలమూటలన్నీ మటుమాయమయ్యాయి. సూర్యోదయవేళ జ్ఞానోదయమై మొగిలీశ్వరుని వారు ఏకచిత్తంతో దర్శించారు. అమితాశ్చర్యకరంగా ఆ వర్తకుల వరహాల మూటలన్నీ ఈశ్వరుని మ్రోల కనుపించాయి. వారు భక్తిప్రపత్తులతో దేవాలయనిర్మాణం పూర్తిచేసి పునీతులయ్యారు. ఈవిధంగా ఈశ్వరేచ్ఛ, ఈశ్వరరూపం, మోక్షమార్గం అడుగు అడుగునా, అణువు అణువునా ప్రతిబింబించే మొగిలీశ్వర దివ్యక్షేత్రాన్ని ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన వేలాదిభక్తులు దర్శించి ధన్యులవుతున్నారు.

తలకోన జలపాతం

తరతరాలుగా నరజాతిని ఆకర్షించి అఖండ కీర్తిసంపదలు ఆర్జించిన తిరుమల దేవాలయం మూలంగా ప్రఖ్యాతిగాంచిన శేషశైల శ్రేణులలోగల తలకోన లోయ అమిత మహిమాన్వితమైనది. ఏడు కొండలకు తలమానికమైనందువల్ల ఈ శైలరాజానికి తలకోన అనే పేరు లభించింది. సందర్శకులను సమ్మోహితులను చేసే సౌందర్యపూరితమైన జలపాతాలు, గంభీరమైన పర్వతశిఖరాలు ఈ ప్రాంతపు శోభను యినుమడింప జేస్తున్నాయి. నిదాఘాలలో సైతం నిరంతరాయంగా ఏకధారగా పడుతూవుండే జలపాతాలతో అనంతమై విరాజిల్లే ఈ అసామాన్యాభిరామం తిరుపతి దివ్యస్థలానికి ౩౫ మైళ్ళ దూరంలో వాయల్పాడు తాలూకాలో వున్నది. ఈ లోయలో గల ప్రాచీనమైన సిద్ధేశ్వరస్వామి లింగ సమార్చనార్థం సోమవారం రోజున భక్తులు అసంఖ్యాకంగా వస్తుంటారు. శివరాత్రి పర్వదినాన పర్వతం పట్టనిజనులు విచ్చేస్తారు. తలకోన జలపాతంవద్ద స్నానం చేస్తే పుణ్యం, పురుషార్థం లభిస్తుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఈ పవిత్ర జలాలలో జలకమాడితే కఠినోపవాస దీక్షావ్రతాలు సలిపినప్పటికీ సంతతి సంప్రాప్తింపని పుత్రహీనులకుసైతం సుతోదయ భాగ్యం కలుగుతుందనీ, కడలేని కఠినరోగాలతో కడగండ్లకు గురయ్యేవారికి వ్యాధి నివారణ జరుగుతుందనీ కూడా హిందువుల నమ్మకం.

మార్కండేయ పురాణంలోని తలకోన స్థలపురాణంప్రకారం త్రేతాయుగంలో ఈ కొండపై కైలాసమహర్షి కోపంవల్ల శాపదుర్గతుడైన శేషాచలఋషి పదివేల సంవత్సరాలు నిశ్చలలీలతో, నిరవధిక

క్రియతో తపమాచరించగా శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఆ ముని మౌని శిరంపై నిర్మలగంగా నిర్ఝరం ప్రవహించి పాపవిమోచనణ్ణి చేయగా పరిశుద్ధాంతరంగుడై పుష్పకవిమానంలో కైలాసానికి బయలుదేరగా ఆయనశిష్యుడు సిద్ధయ్య గురువియోగానికి దుఃఖరవేదన వ్యక్తపరిచాడు. అప్పుడు తాను తలకోనవద్ద సిద్ధేశ్వరునిపేరిట వెలుస్తాననీ, ఆయనను కొలవమనీ శివదేవుడు అభయమిచ్చాడు. భక్తుల కామితార్థాలను సిద్ధింపజేయడం వల్ల ఆస్వామి సిద్ధేశ్వరుడయ్యాడు.

సిద్ధేశ్వరాలయానికి సుమారు మైలున్నర దూరంలో తలకోన వాగుపై "సిద్ధోదరతీర్థం" అనే జలపాతం వున్నది. ఆ జలపాతానికి ప్రాగ్దిశగా రమారమి ఏడుమైళ్ళ దూరంగల వాయులింగకోనవద్ద ఈ నదీ ప్రవాహం ఆవిర్భవిస్తున్నది. అహరహం ధారాపాతంగా పడే జలపాతాల ఎత్తు దాదాపు 200 అడుగులు. దీనికి ఇంచుమించు ఒకమైలు దూరంలో వున్న మరోజలపాతం పాపనాశనం – ఎత్తు 12 అడుగులు.

తలకోనలోయ ప్రకృతి సౌందర్యం, ఆహ్లాదకర వాతావరణం వర్ణనాతీతం. అక్కడ బసచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీశాఖవారి విశ్రాంతిగృహం వున్నది. అద్యతనభావిలో చిత్తూరు జిల్లా పరిషత్తువారు విలాసయాత్రికుల వినియోగార్థం విడిదిగృహం నిర్మిస్తున్నారు. భాకరాపేటనుంచి పధ్నాలుగున్నర మైళ్ళ దూరంకల తలకోన యాత్రికులు తప్పక సందర్శించదగ్గది.

హార్స్లీ కొండలు

క్రౌంజివురాకులను మెసవి కొమ్మల చాటునుంచి కోరిక తీరగా కోయిలలు ఆలపించే పంచమస్వరాలతో, ఆనందంగా నాట్యమాడే కేకిమూకలతో, తరుశాఖాస్థితమైన చిలుకలుపాడే మధుగీతికలతో, చిరుగాలికి శిరం వంచి పూవుటారతుల నెత్తే లతకూనలతో, సామమంత్రాలు చదివే భ్రమరసంతతితో సతతం సంతోష సముల్లాసాలతో ఉప్పొంగిపోయే ఉద్యానవనం హార్స్లీకొండలు. అఖిల పుష్ప సౌరభసంపదలతో, మందమలయానిలాలతో విహారులను వినూత్న భావవశంవదులను చేసే ఈ శైలోపవనస్థలి మదనపల్లికి రమారమి పదిహేడుమైళ్ళ దూరంలో వున్నది.

1870 సంవత్సరంలో కడపజిల్లా కలెక్టరుగా పనిచేసిన శ్రీ డబ్ల్యు. డి. హార్స్లీ అనే ఆంగ్లేయుడు అతిశీతలంగా వుండే కడప శీతోష్ణస్థితికి భరించలేక ఒక కొండపై రెండు భవనాలను నిర్మించి, వేసవివిడిది ఏర్పరచుకున్నాడు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఉన్నత పర్వత శిఖరాగ్రాన అవిఘ్నంగా వేసవివిశ్రాంతి కేంద్రాన్ని నెలకొల్పిన ఆ ఉన్నతాధికారి పేరిట విఖ్యాతిగాంచినవే హార్స్లీకొండలు. పరమరమణీయమైన ప్రకృతిదృశ్యాలతో అలరారుచు, పరిసర ప్రాంతంలో కొండలు, కోనలు, లోయలు, వాగులు, పచ్చిక మైదానాలు సాక్షాత్కరించి కళ్ళను మిరుమిట్లుగొలిపే ఈ కొండలు చక్కని విలాస యాత్రిక కేంద్రమనడంలో సందేహం లేదు. శిఖరాగ్రంలో ఎనభైఎకరాల విస్తీర్ణంకల హార్స్లీకొండలు సముద్రమట్టానికి 4 100 అడుగుల ఎత్తున వున్నాయి. ఈ ప్రాంతలో టేకు, చందనం, యూకలిప్టస్ చెట్లసంపద అపారం. యాత్రికులు బసచేయడానికి ప్రభుత్వ యాత్రిక విశ్రాంతి గృహం, ప్రభుత్వ కుటీరాలు అటవీశాఖవారి బంగళా మొదలైన వసతిగృహాలు వున్నాయి. వీటికి సంబంధించిన సమగ్ర సమాచారం చిత్తూరుజిల్లా పౌరసంబంధాధికారి వద్దనుంచి కాని, తిరుపతి ప్రాంతీయ యాత్రిక సమాచారశాఖాధికారి వద్దనుంచి కాని పొందవచ్చు.

హార్స్లీ కొండలపై ఆంధ్రప్రదేశ్ గవర్నరుగారి వేసవి విశ్రాంతి నిమిత్తం సర్వాలంకారశోభితమైన సమున్నత సౌధం కూడా నిర్మించబడింది. ప్రకృతి రమణీయకతకు ప్రబల నిదర్శనంగా నిలిచిన ఈ కొండలకు సమీపంలో క్రమశిక్షణకూ, ఉన్నత విద్యాప్రమాణాలకూ ప్రసిద్ధిగాంచిన ఋషీలోయ పాఠశాల అనే గురుకులం, వేలాది దారుణమారణ రోగపీడితులకు పునర్జన్మ కల్పిస్తున్న ఆరోగ్యవరం క్షయ ఆసుపత్రి వంటి ప్రజోపయోగకరమైన సంస్థలు పనిచేస్తున్నాయి. సౌందర్యోపాసకులకువిశేషంగా ఆసక్తి కలిగించగల సహజ సంపదలతో విలసిల్లే ఈ వేసవి కేంద్రాన్ని మార్చి–జూన్ మాసాలమధ్య సందర్శించడం సముచితం.

అడవిమల్లె

సీరియల్ (గత సంచిక తరువాయి)

4

జరిగిన కథ

చిన్ననాడే తల్లిదండ్రులను పోగొట్టుకున్న చంద్రం, తన అన్న కృష్ణారావు చుట్టూ ఆశలతీవెల్ని చుట్టుకని భవిష్యత్తుకలలు కంటుండగా; వదిన కాంతమ్మ సుడిగాలిలా వచ్చి తీగెల్ని కుప్పగా నేలకూల్చి, అతని బంగారు కలలపంట మీద ఆగ్రహాన్ని అగ్నిలా కురిపించి, భవిష్యత్తును మసిబొగ్గు చెయ్యిబోయింది. భార్యకుజడిసి, తమ్ముడి మీద దొంగతనాన్నిరుద్ది పశువులపాకలో రాటకుకట్టివేశాడు అన్న. అనురాగాలు మసిబొగ్గయి అంధకారం అలముకున్న చీకట్లో చంద్రానికి ఒకేఒక ఆశాకిరణం పక్కంటి ప్రసాదరావుగారి కుమార్తె కేమ మాలిని. కాని మరోమూల అతి బీదగా రెండు చిన్న అమాయకపుకళ్లు మిణుకుమిణుకుమని వెలిగాయి. అతనిమీద జాలిని కురిపించాయి ఆకళ్లు.

కృష్ణా టుబాకో ఫ్యాక్టరీ పట్టణానికి ఓ చివరలోవుంది. ఫ్యాక్టరీకి నాలుగైదు ఫర్లాంగుల దూరంలోవున్న మైదానంలాంటి పెద్ద ఖాళీస్థలంలో నూరుకుపైగా పూరి గుడిసెలున్నాయి. ఆ గుడిసెల్లో నివసించే వారంతా కృష్ణాటుబాకో ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులే. కృష్ణారావు ఆ ఖాళీస్థలంలో గుడిసెలు వేయించి తన ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు అద్దెకిచ్చాడు. ఆ గుడిసెలన్నీ రెండుమూడుతప్ప దాదాపు ఒకటిగానే వున్నాయి. ఆ రెండు మూడు మాత్రం కొంచెం ఎత్తుగావుండే రెండు నిట్టాళ్ళతో వేసిన గుడిసెలు. వాటిల్లో ఒకదాంట్లో నాగేంద్రం వుంటాడు.

నాగేంద్రం ఇంత ఒడ్డూపొడుగూ వుండే మోటుతరహామనిషి. అతడంటే భయపడని ఫ్యాక్టరీ కార్మికు డుండడు. అతడిది మోటు శరీరం, కిరాతక స్వభావం. ఈ సంగతి కార్మికులందరికీ అనుభవమే. బహుశా అతడిలోని యీ లక్షణాలే కృష్ణారావుకు అతడంటే అభిమానం కలగటానికికారణం అయివుండవచ్చు. హక్కులనీ, సమ్మెలనీ కార్మికు లెప్పుడైనా ఆందోళన ప్రారంభిస్తే, యిలాంటి దుష్టుణ్ణి చక్కగా వినియోగించుకోవచ్చునని వ్యాపార మెలకువలూ, వ్యవహారజ్ఞానం బాగా వున్న కృష్ణారావు ఆలోచించివుంటాడు.

ఫ్యాక్టరీలో పనిచేసే కూలీలమీద అజమాయిషీ అంతా నాగేంద్రానిదే. మేస్త్రీలూ, ఫోర్‌మన్‌లమీద కూడా వాడు అధికారం చెలాయిస్తాడు. ఫ్యాక్టరీలో కొత్తవాళ్ళ కెవరికైనా పని కావాలన్నా, వున్నవాళ్ళల్లో ఎవరినైనా తొలగించాలన్నా, కృష్ణారావు ముందుగా నాగేంద్రాన్ని సంప్రదిస్తాడు. ఈ కారణంవల్ల కార్మికుల ఉద్యోగ కాలపరిమితి చాలావరకు నాగేంద్రం దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి వుంటుంది. అందువల్ల ఆ గుడిసెల్లో నివసించే కూలీలంతా అతడి అడుగులకు మడుగు లొత్తుతారు. ఆ కూలీలమీద – అందులోనూ కాస్త వయసులోవున్న వాళ్ళమీద అతడు చేయని అఘాయిత్యం వుండదు. లొంగకపోతే వుద్యోగంపోతుంది. తరవాత ఆకలి, దారిద్ర్యం నిలిచేందుకు నీడైనాలేకపోవటం – ఇన్నిబాధల నెదుర్కొని నిలిచి పోరాడగల వ్యక్తు లెంద రుంటారు?

నాగేంద్రం వుండే గుడిసెలో ఆదెమ్మ అనే ఒక నడికారు దాటిన స్త్రీ వుంటోంది. తెలియనివాళ్ళు కొందరు ఆమె నాగేంద్రం తల్లి అనుకుంటారు. కాని, నిజానికి వారిద్దరి మధ్యా ఎలాంటి బంధుత్వమూ లేదు. పిల్లాజెల్లా లేని ఆదెమ్మ, ఏదిక్కూలేక రోడ్లవెంట తిరిగే నాగేంద్రాన్ని చిన్నతనంలోనే దగ్గరకు తీసి పెంచి పెద్దవాణ్ణిచేసింది. ఆదెమ్మ సంరక్షణ కిందికివచ్చేనాటికే నాగేంద్రం పదీ పన్నెండేళ్ళవాడు. అప్పటికే వాడు జేబులు కొట్టటంలో, చిల్లర దొంగతనాలు చేయటంలో ఘటికుడనిపించుకుని వున్నాడు. ఒకనాడు రోడ్డంట వెళ్తూన్న ఆదెమ్మకు మురుగు కాలవపక్క చప్టామీద వణుకుతూ పడివున్న పన్నెండేళ్ళ నాగేంద్రం కనిపించాడు. ఆ దిక్కూలేని పక్షిమీద ఆదెమ్మకు జాలి

వాసిరెడ్డి సీతాదేవి

కలిగి ఇంటికి తీసుకువచ్చి, మందులూ మాకులూ యిచ్చి ఆరోగ్యం కలిగించింది.

ఆనాటినుంచీ నాగేంద్రం ఆదెమ్మ యింట్లోనే వుండిపోయాడు. బిడ్డా పాపాలేని తనకు. వృద్ధాప్యంలో కాలూ చేయీ పడిపోతే సహాయంగా వుంటాడని ఆదెమ్మ ఆశపెట్టుకున్నది. కూటికోసం అక్కడా యిక్కడా వెతుక్కోకుండా, యిక్కడ హాయిగా జరిగిపోతున్నదిగనక, ఈ ఇల్లు వదలకూడదనుకున్నాడు నాగేంద్రం. ఈ విధంగా తెలిసో తెలియకో ఎవరిస్వార్థం వాళ్ళు చూసుకున్నారు. ఆ కారణంవల్ల వారిమధ్య ప్రేమావాత్సల్యాల్లాంటివి ఏమీలేవు.

ఆదెమ్మ ఎంతో కాలంగా ఎలాంటి చిక్కులూ లేకుండా సుఖంగా సాఫీగా బతుకుతూ వస్తున్నది. డబ్బెక్కణ్ణించి వస్తుందో ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు. "నాకు బొంబాయిలో బాగా డబ్బున్న బంధువున్నాడు." అంటుంది ఆదెమ్మ. అదే అన్ని ప్రశ్నలకూ, అనుమానాలకూ తిరుగులేని జవాబు. ఆ బంధువు ఒకానొక అవినీతి వ్యాపారంలో అందె వేసిన చేయి. అతడికి అన్ని ముఖ్య పట్టణాల్లో ఏజంట్లున్నారు. వాళ్ళపని అక్కడ దొరికిన ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి అమ్మటం. ఆదెమ్మ చేసేపని కూడా అదే. వాళ్ళు ముఖ్యంగా సినీమా హాళ్ళవద్దా, రైల్వే స్టేషన్లలోనూ కాపలా వేసేవాళ్ళు. అక్కడ ఏ తలిదండ్రులైనా తమ ఆడపిల్లల్ని కొంచెం ఆదమరచి వున్నారో, ఆ అదనులో వాళ్ళను చేజిక్కించుకుని పారిపోయి, క్రమంగా వాళ్ళను బొంబాయిలోని ఆదెమ్మ బంధువుకు చేర్చేవారు.

ఆదెమ్మ యిల్లు చేరిన కొద్ది రోజుల్లోనే నాగేంద్రం అంతవరకూ తాను కాలం ఎలా గడుపుకువస్తున్నదీ ఆమెకు చెప్పాడు. పెద్ద శిక్షణ అవసరం లేకుండానే వాడు తనకు సహాయకారి కాగలడని ఆదెమ్మ గ్రహించింది. ఆనాటినుంచీ ఆమె నాగేంద్రాన్ని తన దుర్మార్గ వృత్తిలో బాగా వుపయోగించుకున్నది.

ఆదెమ్మ కిప్పుడు దాదాపు యాభైఅయిదు సంవత్సరాల వయసు. నాగేంద్రం ముప్ఫయ్యోవడిలో పడ్డాడు. వాడు ఆమె యిల్లు చేరిన నాటినుంచీ యీనాటివరకూ, వాళ్ళు చేసిన దారుణకార్యాలు వాళ్ళకే ఎరుక.

గౌరి ఆదెమ్మవల్ల పదేళ్ళ క్రితం దొంగిలించబడిన పరాయివాళ్ళ బిడ్డ. పదేళ్ళ కిందట ఒకనాడు......

ఆదెమ్మ చక్కగా ముస్తాబుచేసుకుని గౌరవకుటుంబ స్త్రీలా తెనాలి రైల్వే స్టేషన్‌లో ఒక బెంచీమీద కూర్చుని, వచ్చేపోయే ప్రయాణీకుల్ని పరీక్షగా చూస్తున్నది. ఇంతలో ఒకామె ఒక చిన్నబిడ్డను ఎత్తుకుని ఆదెమ్మ దగ్గరకు వచ్చి, బెంచీమీద ఆమె పక్కగా కూర్చున్నది. ఆదెమ్మ ఆ స్త్రీని పరిశీలనగా చూసింది. ఆమె ముఖలక్షణాలూ, పిల్లను సముదాయించే తీరూ చూస్తే, కొంచెం పెద్ద కుటుంబ స్త్రీలా కనిపించింది. కాని, ఆమె ధరించిన దుస్తులు బాగా మాసిపోయి వున్నాయి. జుట్టు చిందరవందరగా రేగి వున్నది. చేతిలో ఒక చిన్న మూట వున్నది. ముఖం చాలా విచారగ్రస్తంగా వున్నది.

ఆ స్త్రీ తన బిడ్డను కాసేపు జోకొట్టి, కళ్ళు మూయగానే బెంచీ మీద మెల్లిగా పడుకోబెట్టి, ఆదెమ్మతో "అమ్మా కాస్త సహాయం చేయగలవా? నిన్నటినుంచీ తిండిలేక ప్రాణం శోషకు వస్తున్నది.



ఈ బిడ్డను కొంచెం చూస్తూవుండండి. ఆ కనబడే దుకాణంలో టీ తాగివస్తాను." అన్నది.

అలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్న ఆదెమ్మ, ముఖంలో ఎంతో జాలి కనబరుస్తూ, "అలాగా పాపం! వెళ్ళి టీ తాగిరండి. బిడ్డ కేం, నేను చూస్తూ వుంటాను" అన్నది.

ఆ స్త్రీ టీ స్టాల్ వైపుకు వెళ్ళింది. అక్కడ జనం తొక్కిసలాట జాస్తీగా వుండటంతో, ఆమెకు వెంటనే టీ దొరక లేదు. ఆమె జనం వత్తిడిని తప్పుకుంటూ స్టాల్ దగ్గరకుపోయి, టీ కోసం డబ్బులిచ్చి బెంచీమీద నిద్రపోతున్న తన బిడ్డ కేసి మళ్ళీ మళ్ళీ తలతిప్పి చూడసాగింది.

అంతవరకూ స్టేషన్‌లో వున్న రైలు బండి కూత వేసింది. అదే సమయంలో ఎక్కణ్ణుంచో నాగేంద్రం తుఫానులా వచ్చి, ఆదెమ్మ పక్కన నిద్రపోతున్న బిడ్డను లేవనెత్తి భుజాన వేసుకుని, ఒక్క అంగలో పోయి రైలెక్కాడు. ఆదెమ్మకూడా అతడి వెనకనే పోయి రైలెక్కింది.

టీ స్టాల్‌దగ్గిర జనంలో నిలబడి టీ తాగుతున్న బిడ్డతల్లి, ఈ ఘోరం చూసి నిలువెల్లా కంపించిపోయి, మాటా పలుకూ లేకుండా మూర్ఛపడిపోయింది.

ఆదెమ్మా, నాగేంద్రం సరిగా రెండేళ్ళయినా నిండని ఆ బిడ్డను తమ ఇంటికి చేర్చారు. క్రమంగా ఆ పాపను అంచెల మీద బొంబాయి చేర్చాలి. అది అంత త్వరలో సాధ్యం కాలేదు. ఈ లోపల బిడ్డ అందచందాలూ, వచ్చీరాని మాటలూ ఆదెమ్మలో మాతృవాత్సల్యాన్ని రగుల్కొల్పినై. ఆ బిడ్డను తానే పెంచుకుంటా నన్నది ఆదెమ్మ. అమ్మితే చాలాడబ్బు వస్తుందని నాగేంద్రం మొదట్లో ఒప్పుకోక పోయినా, చివరకు తలూపి వూరుకున్నాడు. ఆదెమ్మ ఆ బిడ్డను ముద్దుగా గౌరి అని పిలవసాగింది.

గౌరి పెరిగి పెద్ద దవుతున్న కొద్దీ ఆమె అందం నాగేంద్రాన్ని ఆకర్షించ సాగింది. తమ యిద్దరి మధ్యా వయసులో వున్న పెద్ద తేడా ఆ దుష్టుడి బుద్ధికి తోచలేదు. పెళ్ళీడు రాగానే, తానే గౌరిని పెళ్ళాడాల ని వాడు నిశ్చయించుకున్నాడు. ఆ మాట ఆదెమ్మకు చెపితే, ఆమె మౌనంగా ఎటూ తేల్చకుండా తలాడించి వూరుకున్నది. నాగేంద్రం నిరుత్సాహ పడలేదు. తనమాట కాదన్న రోజున ఆదెమ్మ తాను పోలీసులకు ఒప్పచెప్పగల ననుకున్నాడు వాడు. తన శక్తి ఎలాంటిదో తెలిసిన ఆదెమ్మ తన కోర్కెకు ఆటంకాలు కల్పించలేదని వాడు నమ్మాడు.

వయసు పెరిగిన కొద్దీ ఆదెమ్మలో ప్రవర్తనలో చాలా మార్పులు రాసాగాయి. ఆమె యిప్పుడు తాను చేసిన పాపాలకు ప్రాయశ్చిత్త మేదైనా చేసుకోవాలన్న ఆలోచనలో పడింది. అందుకు మరేం లేదు; గౌరిని దుష్టుల చేతుల్లో పడకుండా కాపాడి, మంచిగా బతికే ఏ యువకుడికైనా యిచ్చి వివాహం చేయాలి.

గౌరికి ఆదెమ్మ అంతస్సులో జరుగుతున్న సంఘర్షణగాని, నాగేంద్రం ఎత్తుగడలుగానీ ఏమీ తెలియవు. గౌరి ఆదెమ్మను అమ్మమ్మ అనీ, నాగేంద్రాన్ని మామ అనీ అనుకుంటున్నది. వాళ్ళిద్దరూ ఆమెకు అలా అనే చెప్పారు; గౌరి నమ్మింది. గౌరికి ఆదెమ్మ అంటే ఎంతో యిష్టం. కాని, నాగేంద్రం అంటే ఎందుకనో అసహ్య పడుతూండేది. ఎవరి ప్రవర్తన ఎలాంటిదో తరచి చూడగల వయసుగాని, జ్ఞానంగాని లేకపోయినా, ఆ పసి హృదయంలో నాగేంద్రం మొరటువాడనీ దుష్టుడనీ నమ్మకం కుదిరిపోయింది.

చిన్నచిన్న విషయాల్లోకూడా గౌరి నాగేంద్రాన్ని ఎదిరించి, అతడిచేత దెబ్బలు తినేది. ఆదెమ్మ యింట లేనప్పుడు నాగేంద్రం ఆమెను ఏదో నెపం పెట్టి దగ్గిరకు పిలిచి ముద్దు పెట్టుకునేందుకు ప్రయత్నించేవాడు. ఆ సమయాల్లో గౌరికి అతడంటే మరింతగా అసహ్యం కలిగేది.

చంద్రాన్ని గొడ్లచావిడిలోంచి కట్లు విప్పి విడిపించిన తరవాత గౌరి యిల్లు చేరింది. నాగేంద్రం మామ ముద్దుపెట్టుకో ప్రయత్నిస్తే, తన కెంతో ఏహ్యభావం కలుగుతుంది. చంద్రం తనను ముద్దుపెట్టుకున్నాడు; అసహ్యం అనిపించలా. పైగా ఆ ముద్దుతో అతడంటే ఎన్నో అర్థంకాని ఊహలు తనలో రేకెత్తుతున్నాయి. చంద్రం మంచివాడు, చాలాచాలా మంచివాడు. అయితే అతణ్ణి గుంజ కెందుకు కట్టేశారు? ఎక్కడికి పారిపోయాడు? ఆకలయితే అన్నం ఎవరు పెడతారు? తను కట్లు విప్పవలసిందికాదు.......విప్పబట్టే పారిపోయాడు. ఒకవేళ ఇంటికి తిరిగి రాడేమో.........

అలాంటి ఆలోచనల్లో తల మునకలై వున్న గౌరికి, వంటింట్లో ఏదో అలికిడైనట్టు తోచి, అటుకేసి మెల్లిగా నడిచింది. ఆదెమ్మా, నాగేంద్రం పొయ్యి పక్కన చిన్నగుంట తవ్వి, దానిపక్కన కూర్చుని మెల్లిగా మాట్లాడుకుంటున్నారు. ఆదెమ్మ కొన్ని రూపాయలనోట్లు ముంతలో పెట్టి మూకుడు కప్పింది. నాగేంద్రం దానికి తాడు బిగించి, గుంటలో పెట్టాడు.

"జాగ్రత్తరోయ్, నాగూ. ముంతలో మట్టి పడకుండా, గుంట పూడ్చు. కాసినా కూసినా, వెయ్యిరూపాయలు!" అన్నది ఆదెమ్మ.

నాగేంద్రం విసుగ్గా తలాడిస్తూ, "నీకేమన్నా మతిపోయిందా? మూకుడుతో మూసినముంతలో మట్టెలా పడుతుంది?" అంటూ గుంట తవ్వగా వచ్చిన మట్టితో, తిరిగి గుంటను పూడ్చాడు.

ఆదెమ్మ పక్కనే ముద్దచేసివున్న పేడ పెట్టి ఆ స్థలమంతా శుభ్రంగా అలుకుతూ, "నా కింకా భయంగానే వుందిరా. ఆ కృష్ణారావుగారు నీమీదేం అనుమానపడరుగందా!" అన్నది.

"ఆభయం ఏమీలేదు. తమ్ముడు చంద్రం దొంగిలించాడని ఆయనకు నమ్మకం కుదిరి

పోయింది పోలీసులకు రిపోర్టుకూడా యివ్వడు." అంటూ లేచి నిలబడ్డాడు నాగేంద్రం. ఆదెమ్మకూడా అలుకుడుపని పూర్తిచేసి నిలబడింది. ఇద్దరూ వాకిటికేసి నడవబోతూ తలెత్తారు. ఎదురుగా గౌరి!

"ఎంతసేపునుంచి ఇక్కడున్నావే?" అన్నారిద్దరూ ఆశ్చర్యంగా, భయంగా.

"చాలాసేపునుంచీ. మీరు చేసిందికూడా చూశాను," అన్నది గౌరి తొణక్కుండా.

ఆ జవాబుతో ఆదెమ్మ గతుక్కుమన్నది. నాగేంద్రం గౌరిని సమీపించి, తలమీద చిన్నగా మెట్టుతూ, "ఇదంతా నీ కోసమనే, పిల్లా!" అన్నాడు.

"నాకోసమా! ఛీ, మీకు భయంలేదు, సిగ్గూలేదు. మీ దొంగతనం సంగతి కృష్ణారావుగారితో యిప్పుడే చెప్పొస్తాను." అంటూ గౌరి గిరుక్కున వెనుదిరిగింది.

నాగేంద్రం కళ్ళు చింతనిప్పుల్లా అయినై. వాడు కోపంగా గౌరి జడపట్టుకుని వెనక్కు లాగాడు.

"నా జడ వదులు. నువ్వు చంపినా కోసినా నేను నిజం చెప్పకుండా వూరుకోను." అంటూ గౌరి పెనుగులాడింది.

నాగేంద్రం రౌద్రమూర్తి అయిపోయి, గౌరి జడపట్టుకుని కిందకువంచి, వీపుమీద దభీదభీమంటూ బలంగా బాదాడు. గౌరి ఒకటి రెండు కేకలు పెట్టి స్పృహ తప్పి, కింద పడిపోయింది.

ఆ స్థితిలో గౌరిని చూడగానే నాగేంద్రం కోపమంతా జాలిగా మారింది. అతడు తల వంచుకుని వీధి వాకిలి దగ్గరకు వెళ్ళిపోయాడు. కాసేపటికి గౌరి కళ్లు తెరిచింది. పక్కన కూర్చుని ఆదెమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకోవటం ఆమెకు కనిపించింది. గౌరికి తను ఆదెమ్మనూ, నాగేంద్రాన్నీ ఎదిరించటం పొరపాటన్న భావం కలిగింది. ఆ వెంటనే మారుమాటాడకుండా పోయి గోడ మూల నున్న మంచం లాక్కుని పడుకున్నది. ఆరాత్రి ఆదెమ్మా, నాగేంద్రం ఎంత బతిమాలినా గౌరి అన్నం తినలేదు.

ఒకరాత్రివేళ గౌరికి మెలుకువ వచ్చింది. ఆదెమ్మ, నాగేంద్రం ఘర్షణ పడుతున్నారు.

"అదంటే నీ కొక్కదానికే ప్రేమను కోకు. కొట్టినందుకు నాకూ బాధగానేవుంది. ఏంచేసేది? ఒట్టి మొండి ఘటం!" అన్నాడు నాగేంద్రం.

"మొండో బండో, చాలా నీతిగల పిల్ల. మనంచేసే పాడుపనులు దానికి నచ్చవు. అది పుట్టిన వంశం గొప్పదయి వుండాలి." అన్నది ఆదెమ్మ.

"ఏంగొప్పో! దొరికిన పిల్లలందర్నీ అమ్మినట్టే దాన్నీ అమ్మేస్తే ఏచిక్కూ రాకపోను." అన్నాడు నాగేంద్రం విసుగ్గా.

అదీ నిజమేరా! ఎంతమంది పిల్లల్ని తల్లులనుంచి వేరుచేసి అమ్మాంకాదు. ఈ పిల్లను యిక్కడికి తెచ్చిన క్షణంనుంచీ నాకు దీనితల్లి మనసులో మెదులుతున్నదనుకో, మనం దీన్ని బెంచీమీదనుంచి లాగి బుజాన వేసుకుని రైలుపెట్టెలో జొరబడుతూంటే, పాపం ఆ తల్లి నిలువు గుడ్లేసి మనకేసి చూస్తూ, పెద్ద కేకేదో పెట్టి ఉండేలు దెబ్బతిన్న పిట్టలా కిందపడిపోవటం నా కక్కనిపించింది," అన్నది ఆదెమ్మ బొంగురుపోయిన గొంతుతో.

"ఆ కేకేదో నువ్వు రైలు రొదలో విన్నావన్నమాట! అది సరేగాని, ఆదెమ్మక్కా! ఈ గౌరంటే నీకు ఎప్పట్నుంచి యింత పుట్టుకొచ్చిందీ? మాటవరస కంటాను, యిప్పుడు దాని కొచ్చిన కష్ట మేమిటి?" అన్నాడు నాగేంద్రం.

"కష్టం ఏం వుందిలే. అరే, నాగేంద్రం నా దొక్క కోరికరా. ఎవరైనా మంచి కుర్రాణ్ణి చూసి గౌరికి ముడి పెట్టాలని వుంది."

"దానికి ఏ కుర్రాణ్ణో తెచ్చి పెళ్ళి చేస్తావా?" అంటూ ఎగిరి పడ్డాడు. నాగేంద్రం. "దాన్ని నా పెళ్ళాం కాకుండా ఎవరూ ఆపలేరు. నీ వొట్టి కుర్రముండవని నా కేహో తెలుసు. అదప్పు డెంత చిన్నపిల్లయితే నేం; దాన్ని దొంగిలించకు వచ్చిన రోజునే, అది నా పెళ్లాం అనుకున్నాను."

"ఛీ, ఏం మాటది! పదేళ్ళ పిల్లకు, ముప్ఫయ్యేళ్ళు నెత్తిమీది కొచ్చినా నీతో పెళ్ళా?" అన్నది ఆదెమ్మ కోపంగా.

"మగాడి విషయంలో వయస్సేమిటే ఆదెమ్మక్కా, గౌరి నాది; దాని అందానికి హక్కుదారుణ్ణి నేను, చూస్తూండు, రేపో మాపో ముహూర్తం చూసి, దాని మెళ్ళో పుస్తె కట్టేస్తా. ఆ దెబ్బతో దాని పొగరూ అణుగుతుంది, నీ నోరూ మూత పడుతుంది," అంటూ నాగేంద్రం చరున మంచంమీంచి లేచి బయటికి వెళ్ళిపోయాడు.

ఈ సంభాషణంతా వింటూంటే గౌరికి మతి పోతున్నట్టనిపించింది. వీళ్ళు తనకేమీ కాదన్న మాట! తనను తల్లి నుంచి దొంగిలించుకు వచ్చిన దుర్మార్గులు. ఆదెమ్మ తనకు అమ్మమ్మ కాదు...... పరమ దుర్మార్గురాలు. తనను కనిపెంచిన తల్లిని యిక ఎన్నటికీ తాను చూడలేకపోవచ్చు. అమ్మ ఎలా వుంటుంది? నాన్న ఎవరు? ఏం చేస్తూంటాడు? తన దేవూరు? ఏం కులం?...యిలా ఆలోచిస్తూన్నగౌరి కళ్ళ నుంచి అశ్రువులు సంతతధారగా కారసాగినై.

......ఈ దుర్మార్గుడు నాగేంద్రం తనను పెళ్లాడతాడా? నిజమే, వాడు దుష్టుడు. అన్నంతపనీ చెయ్యొచ్చు. వాడికి దొరక్కుండా ఎటయినా పారిపోవాలి అలా పారిపోగలిగితే, ఆ మధ్య తను అమ్మమ్మ... ఛీ, అమ్మమ్మా? కాదు, ఆదెమ్మవెంట వెళ్ళి చూసిన సినీమాలోలాగా, అమ్మను ఏ ఆస్పత్రిలోనో కలుసుకోవచ్చును. యింతకూ తను ఎక్కడికి పారిపోయేట్టు?

ఇలా మథనపడుతున్నగౌరి దగ్గరకు ఆదెమ్మ వచ్చి, నిద్రపోతున్నదేమో కనుక్కునేందుకు వంగి ముఖంలోకి చూసింది. గౌరి ఆదెమ్మ జుట్టు పట్టుకుని, "మా అమ్మ ఎక్కడుందో చెప్పు? నువ్వు అమ్మమ్మవు కాదు, దెయ్యానివి!" అన్నది.

"అయితే, మా మాటలన్నీ విన్నావన్న

మాట? సరే యిదీ ఒకందుకు మంచిదే. నేను దెయ్యాన్నే. కాని, నన్ను అసహ్యించుకోకు. నువ్వంటే నాకు కన్న కూతురుమీద వున్నంత ప్రేమ," అన్నది ఆదెమ్మ.

"అంత ప్రేమయితే, నన్ను మా అమ్మదగ్గరకు తీసుకపోయి ఒప్పచెప్పు. మా అమ్మకూ, నాన్నకూ చెప్పి నీకు బహూమానము యిప్పిస్తా." అన్నది గౌరి బతిమాలుతున్నట్టు.

"మీ అమ్మ ఎవరో, ఎక్కడ ఉంటుందో నాకు తెలియదమ్మా గౌరి. నేను ఒక్క సహాయం నీకు చేస్తాను. ఈ దుర్మార్గుడు నాగేంద్రం నుంచి నిన్ను కాపాడతాను. లే, పోదాం. వాడు మళ్ళీ యింటికి రాకముందే పోవటం మంచిది," అన్నది ఆదెమ్మవచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ.

గౌరి గబగబా మంచం దిగింది. ఆ క్షణంలో ఆ బాలికకు తాను తన తల్లిని త్వరలో చూడబోతున్నా ననే ఆశవల్ల ఎంతో ఆనందం కలిగింది. ఆదెమ్మ ఒక గోతాం సంచిలో గౌరి దుస్తులన్నీ సర్దింది. ఇద్దరూ ఇంటికి తాళంవేసి బయలుదేరారు. గౌరి మనస్సు సంతోషంతో ఉరకలు వేస్తున్నది. తను తన కన్నతల్లిదగ్గిరకు వెళ్ళిపోతున్నది. తల్లి తనను చూసి ఎంత ముచ్చటపడుతుందో......

ఆదెమ్మ ఒక పెద్ద బంగళాముందు ఆగింది. గేటుముందున్న గూర్ఖావాడు ఆదెమ్మ కేసీ, గౌరి కేసీ ప్రశ్నార్ధకంగా చూశాడు. గౌరి గేటుపక్కన వున్న సైన్ బోర్డుకేసి చూసింది. దానిమీద రాసివున్న అక్షరాలను కూడబలుక్కుని చదివింది. "అనాధ శరణాలయం."

గౌరి గుండె గతుక్కుమన్నది. ఆదెమ్మ తనను తన తల్లిదగ్గిరకు కాదు తీసుకుపోతున్నది. ఈ శరణాలయంలో వున్న కొందరు పిల్లలను తాను చూసింది. శరణాలయాన్ని గురించి వాళ్ళూ వీళ్ళూ చెప్పుకునే మాటలుకూడా విన్నది. ఆదెమ్మ తిరిగి తనను మోసం చేసి, యీ బందిఖానాలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నది. తను ఆదెమ్మకు అందకుండా పారిపోతే......

గౌరి పారిపోయేందుకు నాలు గడుగు లేసిందో లేదో, ఆదెమ్మా, గూర్ఖా కలిసి ఆమెను పట్టుకున్నారు. ఆ తరవాత విడిపించుకునేందుకు పెనుగులాడుతున్న గౌరిని బంగాళావైపుకు లాక్కుపోయారు.

ముతక ఖద్దరుచీర కట్టి, లావుగా నల్లగా వున్న ఒక వయసు మళ్ళిన స్త్రీ వాళ్ళకు వరండాలో కనిపించింది. ఆమె ముఖంలో ఏ భావంలేదు. కళ్ళద్దాల్లో నుంచి గౌరికేసి గుచ్చిగుచ్చి చూసింది. గౌరి ఆ చూపుకు బెదురుకున్నది. ఆ స్త్రీ శరణాలయానికి మాట్రిన్.

"అమ్మా! ఈ అమ్మాయిని మీ దగ్గర చేర్చుకోవాలి." అన్నది ఆదెమ్మ. రెండు చేతులూ ఎత్తి మాట్రిన్‌కు దణ్ణంపెడుతూ.

"ఎవరా అమ్మాయి? యిక్కడ దిక్కులేని వాళ్ళను మాత్రమే చేర్చుకుంటామని తెలీదా?" అన్నది మాట్రిన్ కసురుతూన్నట్టు.

దిక్కులేని పిల్లేనమ్మా. తల్లి నిన్నే చచ్చిపోయింది. ఆలనా పాలనా చేసేవాళ్ళెవరూ లేరు," అన్నది ఆదెమ్మ.

"అబద్ధం!" అంటూ గౌరి అరిచింది. తను యింతసేపుగా భావనా ప్రపంచంలో కల్పించుకున్న తల్లి చచ్చిపోయిందని ఆదెమ్మ చెప్పటం విని సహించలేక.

"ఈ పిల్లకు యీ పెద్ద బంగాళా చూసి భయం వేసింది. అందుకే అట్లా మాట్లాడుతున్నది. నా మాట నమ్మండి" అంటూ ఆదెమ్మ మాట్రిన్‌ను ప్రాధేయపడింది.

మాట్రిన్ పెదాలమీద ఓ తృటికాలం చిరునవ్వులాటి దేదో కనిపించి, యిట్టే మాయమైపోయింది "ఓఁ, యీ రకం పిల్లల సంగతి నాకు మహా చక్కా తెలుసు!" అంటూ మాట్రిన్ వెనక్కు తిరిగి, "లక్ష్మీ; లక్ష్మీ!" అని కేక పెట్టింది.

ఆ కేక వింటూనే తలుపులు బార్లా తెరుచుకుని, రూపంలో మాట్రిన్‌కు మేనత్తలా ఉన్న ఆయా బయటికి వచ్చి, మాటా పలుకూ లేకుండా గౌరి రెక్క పట్టుకొని ముందుకు లాగింది. గౌరికి భయంతో ముచ్చెమటలు పోశాయి. పెద్దగా అరవా లనుకున్నది. గొంతు పెగల లేదు. ఆయా ఆమెను "ఏయ్, నడు!" అంటూ బరబరా లోపలకు యీడ్చుకుపోయింది: ఆదెమ్మ ముఖం పాలిపోయింది. ఆదిలోనే గౌరిని అంత మోటుగా శరణాలయంవాళ్ళు లోపలకు లాక్కుపోతా రని ఆమె అనుకోలేదు.

"అమ్మా! గౌరి కొంచెం బతికిన పిల్ల. కాస్త పెంకె. తమరు......" ఆదెమ్మకు ఆపైన మాటలు గొంతులోనే ఉడిగిచుట్టుకుపోయాయి. మాట్రిన్ ముక్కుపుటాలు ఎగరవేస్తూ ఆమెకేసి బెబ్బులిలా చూస్తున్నది.


"ఆ వాగుడంతా కట్టిపెట్టు: ఓఁ, యీరకం పిల్లల సంగతి నాకు మహచక్కా తెలుసు! ఇక మాట్టాడకు. చూడా లనుకుంటే ఆ పిల్లను నెలకోసారి వచ్చి, చూసి పోవచ్చు: యికనడు," అంటూ మాట్రిన్ లోపలికెళ్ళిపోయింది.

ఆదెమ్మ తలొంచుకుని వెనుదిరిగి కళ్ళొత్తుకుంటూ బంగాళా గేటుదాటి రోడ్డుమీదికి వచ్చింది. ఇన్నేళ్ళ తరవాత ఆమెకు లోకమంతా భయంకరంగా తోచింది. తన జీవితంలో ఏదో పెద్ద వెలితి కనిపించింది.


ఇక తను ఇంటికి పోవటం అనవసరం అనుకున్న దామె జరిగిం దేమిటో తెలిసిన తరవాత, నాగేంద్రం ఇక తనను బతకనివ్వడు. యీ ముసలి తనంలో తను వుండేందుకు పంచకూడా లేకుండా పోయింది. ఇదంతా తను చేసుకున్న పాపమేనా...

ఆదెమ్మ రోడ్డు ప్రక్కనున్న చెట్లనీడ కిందగా, ఒక గమ్యం అంటూ లేకుండా నడవసాగింది, ఆనాటినుంచీ ఆమెను ఆ ప్రాంతాలవాళ్ళెవరూ మళ్ళీ చూడలేదు.

(సశేషం)




ఢిల్లీ లోని రాష్ట్రపతి భవన్ లో మే నెల 26 వ తేదీన ప్రత్యేకంగా జరిగిన ఉత్సవంలో కాప్టెన్ ఇ. యన్. అయ్యంగార్ కు పరాక్రమ బహూకృతిగా 'వీర్ చక్ర' పతకాన్ని ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్.



మే నెల 27వ తేదీన రవీంద్రభారతిలో గవర్నర్ శ్రీ పట్టం థానుపిళ్లె నెహ్రూ స్మారకనిధి సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.





ఆరోగ్యవరంలోని టి. బి. శానిటోరియంను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మే నెల 13వ తేదీన సందర్శించినప్పటి దృశ్యం.




మే నెల 17 వ తేదీన చిత్తూరు జిల్లాలోని ఘట్టుగ్రామం గ్రామపంచాయతీ భవనానికి గవర్నర్ శంకుస్థాపన చేశారు.


సెక్రటేరియట్ సాంస్కృతికసమితి నిర్వహించిన వార్షిక నాటకోత్సవ వారానికి మేనెల 28వ తేదీన గవర్నర్ ప్రారంభోత్సవం జరిపారు.









మేనెలలో ఒకేదినాన ఒకేకళ్యాణమండపంలో చిత్తూరు జిల్లాలోని బాలిరెడ్డిగూడెంలో వంద పెళ్ళిళ్ళు జరుపబడ్డవి. ఈ సందర్భంలో విచ్చేసిన ప్రముఖ అతిథులలో ముఖ్య మంత్రి, పంచాయతీరాజ్ మంత్రి. ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షులుగూడ ఉన్నారు.




ప్రేక్షకుల దృశ్యం.




మే 19వ తేదీన తిరుపతిలో అలపాటి మోహన్ స్మారక కుటీరానికి కేంద్రప్రభుత్వ ఉక్కుశాఖామంత్రి శ్రీ యస్. సంజీవరెడ్డి ప్రారంభోత్సవం జరిపారు.




ప్రారంభోత్సవం తరువాత తీసిన ఫొటోలో — కేంద్ర ప్రభుత్వ ఉక్కు శాఖామంత్రి, ముఖ్యమంత్రి, శాసనమండలి అధ్యక్షులు, స్వర్గీయ అలపాటి వెంకట్రామయ్య.





చిత్తూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకును మే 21వ తేదీన శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.




కొత్తగూడెం థర్మల్‌స్టేషన్‌వద్ద జరుగుతున్న నిర్మాణ కార్యక్రమాన్ని మేనెల 15వ తేదీన ముఖ్యమంత్రి పర్యవేక్షించారు.



ఖమ్మంలో కళాశాల భవనానికి ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి మే నెల 15వ తేదీన శంకుస్థాపన చేశారు.




ఖమ్మం జిల్లాలోని మధిరలో మే 14వ తేదీన బహిరంగ సభలో ప్రసంగించడానికి ముఖ్యమంత్రి ఊరేగింపుతో వెళ్ళుతున్న దృశ్యం.




శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి మే 29వ తేదీన కరీంనగర్ జిల్లా అంబారిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.




ముఖ్యమంత్రి మే 28వ తేదీన నిజామాబాదుజిల్లా బాన్సువాడ వద్ద మంజీరనదిపై వంతెనకు పునాదిరాయి వేశారు.




ముఖ్యమంత్రి మే 30వ తేదీన చిత్తూరుజిల్లా జిల్లాపరిషత్తు సభ్యులు, పంచాయతీ అధ్యక్షుల సమావేశంలో ప్రసంగించారు.



శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి మే 28వ తేదీన నిజామాబాదుజిల్లా తక్కెడపల్లిలో చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టు (కౌలాస్)కు పునాదిరాయి వేశారు.




ముఖ్యమంత్రి మే 23 వ తేదీన చిత్తూరుజిల్లా సదంలో జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల భవనానికి ప్రారంభోత్సం చేశారు.




ఉన్నతపాఠశాల భవనం దృశ్యం.




శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి మే 30 వ తేదీన కరీంనగర్‌లో పంచాయతీల వార్షిక సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.




ముఖ్యమంత్రి మే 20 వ తేదీన బైరెడ్డిపల్లిలో పంచాయతీ కార్యాలయం భవనానికి ప్రారంభోత్సవం చేశారు.






కేంద్ర ఉక్కు శాఖామంత్రి శ్రీ యన్. సంజీవరెడ్డి మే 18వ తేదీన శ్రీశైలంలో శివాజీగోపురం పునరుద్ధరణ పనులకు ప్రారంభోత్సవం చేశారు.




శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, డాక్టరు యం. యస్. లక్ష్మీ నరసయ్యలను మే 21వ తేదీన సదం గ్రామంలో ఊరేగింపుగా తీసుకవెళ్ళారు.




శ్రీశైలం ప్రాజెక్టువద్ద



శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి మే 17 వ తేదీన శ్రీశైలంలో భ్రమరాంబా దేవాలయం సందర్శించారు.




కేంద్రమంత్రి, ముఖ్యమంత్రి, శ్రీ ఆలపాటి మే 18 వ తేదీన భ్రమరాంబా దేవాలయం సందర్శించారు.



శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టువద్ద సొరంగం పరిశీలన.



మే 18 వ తేదీన శ్రీశైలం దేవాలయం అంతర్భాగంలో.



శ్రీ సంజీవరెడ్డి, శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి మే 18 వ తేదీన ఇంజనీర్లతో శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు సొరంగాన్ని పరిశీలించారు.



ముఖ్యమంత్రి మే 30 వ తేదీన నిజామాబాదుజిల్లా కామారెడ్డిలో ఆర్ట్సు, సైన్సు కళాశాల భవనానికి పునాదిరాయి వేశారు. ఆర్థికమంత్రి డాక్టరు యం. చెన్నారెడ్డి యీ ఉత్సవానికి అధ్యక్షత వహించారు.




సాంఘిక సంక్షేమశాఖ మంత్రిణి శ్రీమతి టి. యన్. సదాలక్ష్మి నెహ్రూ స్మారకనిధి సంబంధంగా మే 31 వ తేదీన తాండపల్లి గ్రామస్థుల నుద్దేశించి ప్రసంగించారు.




శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి. మే 17 వ తేదీన మన్ననూరులో హాలిడే హోంను సందర్శించారు.




శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ యన్. సంజీవరెడ్డి జన్మదినోత్సవంనాడు ఆయనకు శుభాభినందనలు తెల్పారు.




తిరుమలలో నాయకులు.



పశ్చిమగోదావరిజిల్లా కోడుకొల్లు గ్రామంలోని అన్నపూర్ణా దేవి మహిళాసంఘం పాఠశాల విద్యార్థులు విజ్ఞానయాత్ర పై తిరుపతి వెళ్ళినప్పుడు డాక్టర్ సంజీవరెడ్డికి ఆయన జన్మదినం సందర్భంలో శుభాకాంక్షలు తెల్పారు.




శ్రీ బ్రహ్మానందరెడ్డి మే 27వ తేదీన చార్మినారునుంచి ప్రతాప్ గిర్జికోఠీ వరకు వెళ్ళే ఊరేగింపు ప్రారంభస్థలంలో జవహార్ జ్యోతిని వెలిగించారు. ప్రథమ నెహ్రూ వర్ధంతి సందర్భంలో తమ జోహార్లు అర్పించేయడానికి అన్ని పార్టీల నాయకులు, వేలాదిప్రజలు యీ ఊరేగింపులో పాల్గొన్నారు.



ఏడుకొండలపై పవిత్రదేవాలయ ప్రదక్షిణ.



ముఖ్యమంత్రి మే 14వ తేదీన ఖమ్మంజిల్లాలోని లోకారం పాజెక్టుకు పునాదిరాయి వేశారు.



పంచాయతీరాజ్ శాఖామంత్రి డాక్టర్, యం. యస్. లక్ష్మీనరసయ్య ఏప్రిల్ 30వ తేదీన కరీంనగర్‌లో జిల్లా పంచాయితీ సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేశారు.



ఆర్థిక, పరిశ్రమల శాఖామంత్రి డాక్టర్ యం. చెన్నారెడ్డి మే 11వ తేదీన బొమ్మనపల్లి (పర్గి పంచాయతీ సమితి) లో విద్యుద్దీపాలకు ప్రారంభోత్సవం చేశారు. హైదరాబాదు జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. భోజిరెడ్డి అధ్యక్షత వహించారు.



హైదరాబాదులోని భారత పరిపాలనా వ్యవహారాల సంస్థ 65 మే 29వ తేదీన సచివాలయంలో ఏర్పాటు చేసిన "సంక్షేమ రాజ్యంలో సివిల్ ఉద్యోగులు" గోష్ఠిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ ఓబుల పుల్లారెడ్డి ప్రసంగించారు. ప్రధానకార్యదర్శి శ్రీ కె. ఎన్. అనంతరామన్, ఐ. సి. యస్. అధ్యక్షత వహించారు.

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల రంగంలో ప్రగతి : దానికి అనుకూల పరిస్థితులు

శ్రీ సి. వి. హెచ్. రావు

ప్రస్తుతం పారిశ్రామికంగా వెనకబడి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల అభ్యుదయ శకం త్వరలో ప్రారంభమయ్యే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి ప్రాతిపదిక తృతీయ ప్రణాళికాకాలంలో వేయడం జరిగింది. తృతీయ ప్రణాళికాకాలంలో అమలు జరిగిన, జరుగనున్న చర్యలు నాల్గవ ప్రణాళికాకాలంలో ఫలించగల ఆశ స్పష్టంగా కన్పిస్తోంది.

హైదరాబాదు నగరంలో ఇటీవల జరిగిన పారిశ్రామిక వ్యవహారాల మహాసభ రాష్ట్రంలో పరిశ్రమల భవిష్యదభివృద్ధికి పునాదులు వేసిందనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ వాణిజ్య-పరిశ్రమమండళ్ల సమాఖ్య, అఖిలభారత ఉత్పత్తిదార్ల సంస్థ ఆంధ్రప్రదేశ్ శాఖల అధ్వర్యాన నగరంలో మహాసభ నిర్వహించబడింది.

ఆంధ్రప్రదేశ్‌లో గొలుసు పరిశ్రమలను నెలకొల్పి, రాష్ట్రంలోని పారిశ్రామిక ఇరువులను వినియోగించి, నిర్వహించడానికి పెట్టుబడులు పెట్టే అవకాశాలను పరిశీలించడానికి ఈ సమావేశానికి హాజరయిన ఆంధ్రప్రదేశ్‌లోని, రాష్ట్రం వెలుపలి పారిశ్రామికదార్లు విశేషాసక్తిని కనబరిచారు. అట్టి పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్రంలో గల సాధన సంపత్తినీ, మార్కెటింగు సౌకర్యాలనూ పరిశీలించి స్థానికంగా లభ్యమయ్యే సాధన సంపత్తిని గరిష్టస్థాయిలో వినియోగించుకోడానికి గల వసతులనుకూడ వారు పరిశీలించారు.

క్రమాభివృద్ధి

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక వ్యవస్థ కొలదికాలంగా క్రమంగా అభివృద్ధి చెందుతున్నది. కేంద్ర ప్రభుత్వ అధ్వర్యం క్రింద మూడు నాలుగు భారీ పరిశ్రమలను ఇక్కడ నెలకొల్పడంతో సహకార రంగంలో కొన్ని నూలుమిల్లులు, చక్కెర ఫ్యాక్టరీలు అవతరించడంతో పారిశ్రామిక పథంలో ఆంధ్రప్రదేశ్ ముందడుగు వేయగలిగింది. ప్రైవేటు రంగంలో మధ్యతరహా పరిశ్రమలుకూడా కొన్ని ఈ మధ్య నెలకొల్పడం జరిగింది. చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, పరిశ్రమల వాడలలోనూ, ఖద్దరు, గ్రామ పరిశ్రమలసంస్థ పథకాల రీత్యానూ నెలకొల్పబడి కొంత అభివృద్ధిని సాధించాయి.

ఐతే, పారిశ్రామికంగా ఇంతవరకూ సాధించిన ప్రగతి భవిష్యదభివృద్ధి అవకాశాలు, అవసరాలతో పోల్చిచూస్తే సామాన్యంగా ఉందని మాత్రమే చెప్పాలి. మనరాష్ట్రంలో పారిశ్రామిక వ్యవస్థను పటిష్ఠంచేసి, క్రమబద్ధంచేసి కట్టుదిట్టంగా వ్యవస్థీకరించడం ఎంతో అవసరం. ఈ కృషిలో ప్రైవేటు పరిశ్రమల ప్రముఖపాత్ర మనం గ్రహించాలి. పబ్లిక్ రంగంలో భారీ పరిశ్రమలను నెలకొల్పడానికి తాహతుగల కేంద్రప్రభుత్వం యీ విషయంలో ప్రత్యేకపాత్ర వహించాలి.

రాష్ట్రానికి చెందినటువంటి, రాష్ట్రం వెలుపల ఉన్నటువంటి ప్రైవేటు పారిశ్రామికులు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడానికి అనువయిన వాతావరణాన్ని పై సమావేశం కల్పించిందని చెప్పవచ్చు. పెట్టుబడులనూ, సాంకేతిక నైపుణ్యాన్నీ లాభసాటిగా వినియోగించటానికి మార్గాలను చూపించడంలో యీ సమావేశం ప్రముఖపాత్ర వహించింది.

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలవాతావరణాన్ని సద్వినియోగం చేసుకోదలచిన పారిశ్రామికులకు సంపూర్ణ సహాయ సహకారాలను రాష్ట్రప్రభుత్వం అందజేయగలదని ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి అభయహస్తం ఇచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని ఒక వంక కేంద్రప్రభుత్వం, మరొకవంక ప్రైవేటు పారిశ్రామికులు గమనించాలి. ప్రభుత్వ రంగంలో భారీ పరిశ్రమలను నెలకొల్పడానికి చొరవ తీసుకోవలసింది కేంద్రప్రభుత్వమే. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి గలఅవకాశాలను గుర్తించి, సద్వినియోగపరచుకోవలసిన బాధ్యత పారిశ్రామికులదీ, వారిని ప్రోత్సహించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదీ, మేధావంతులదేనని వారందరు సమన్వయంగా దీనికి కృషి చేయడం అవసరమని శ్రీ బ్రహ్మానందరెడ్డి స్పష్టపరిచారు.

రెండు దృక్పథాలు

మన రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి నిర్వహించ వలసిన కృషిని రెండుకోణాల నుంచి పరిశీలించాలి. మొదటిది, రాష్ట్రంలో గల వ్యావసాయిక, ఖనిజ సంబంధమైన ముడిసరుకులూ, ఇతరపారిశ్రామిక ముడిసరుకులూ విరివిగావాడుక చేసుకోవడానికి పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి, వారిలో పెట్టుబడులు పెట్టే అవకాశా లేమిటో

ముందు తెలుసుకోవాలి. ఈ విషయంలో కొంత కాలంనుంచీ కృషి జరుగుతున్నా. దానినియింకా హెచ్చుచేయడం అవసరం. రెండవది పరిశ్రమల విషయంలో రూపొందిన జాతీయ విధానానికి అనుగుణంగా ఆర్ధిక పురోభివృద్ధికి, వివిధ రాష్ట్రాల ఆర్ధిక వ్యవస్థలలో గల తారతమ్యాలను, అసమానతలను తొలగించవలసిన అవసరాన్ని గుర్తించి దానికి దోహదంగా వ్యవహరించాలి.

ఈ సందర్భంలో, ఈ సమావేశాన్ని ప్రారంభించిన కేంద్ర వాణిజ్యమంత్రి శ్రీ మనూభాయ్‌షా వాస్తవిక దృష్టితో చేసిన సూచన గమనించదగ్గది. ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ రాష్ట్రమయినందున వ్యవసాయ వ్యవస్థ ప్రాతిపదికపైనే ప్రధానంగా పరిశ్రమలను పెంపొందించడానికి ప్రయత్నాలు జరగాలని శ్రీ షా సూచించారు. మన రాష్ట్రంలో నెలకొల్పనున్న పరిశ్రమలు వీలయినంతవరకు వ్యవసాయ వ్యవస్థకు సంబంధించినవైతేనే, రాష్ట్రంలో పరిశ్రమలు పురోభివృద్ధి చెందడానికి, వారి ద్వారా వ్యవసాయ వ్యవస్థకూడ తిరోగమించడానికి హెచ్చు అవకాశాలు ఉన్నాయి. రసాయనిక ఎరువులూ, వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ పరికరాలను తయారుచేసే పరిశ్రమలూ, పంచదార, చెఱుకూ, ప్రత్తి, నూనెగింజలూ, పళ్ళూ మొదలయిన ముడి సరుకులను వినియోగించే పరిశ్రమలు నెలకొల్పితే రాష్ట్ర పరిశ్రమల వ్యవస్థ విస్తృతం కావడం జరుగుతుంది. అటుపైన రాష్ట్రంలోని బొగ్గు నిలవలనూ ఖనిజ సంపదనూ ఇనుమూ నిలవలనూ వాడుక చేసే ఇంజనీరింగు పరిశ్రమలూ, ఖనిజ పరిశ్రమలూ కూడా ఎంతో అవసరం. ఇవికాక వాడకందార్ల వస్తూత్పత్తి పరిశ్రమలూ, సిమెంటు, చక్కెర, బట్టలు మొదలయినవీ భారీ విద్యుచ్ఛక్తి పరికరాల ఫ్యాక్టరీ, కృత్రిమ ఔషధాల తయారీ ఫ్యాక్టరీ, హిందుస్తాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీలకు అనుబంధంగా చిన్నరకపు పరిశ్రమలనూ విరివిగా నెలకొల్పడం అత్యవసరం

రాష్ట్రంలో పలుచోట్లగల ఇనుప ఖనిజాన్ని వినియోగించి, ఇతర పరిశ్రమలకు అవసరమయిన యంత్ర పరికరాల ఉత్పత్తికి అనేక మధ్యతరహా దుక్క-ఇనుము ఫ్యాక్టరీలు ఏర్పాటుచేయబడడం లాభదాయకమని శ్రీ మనూభాయ్‌షా చేసిన సూచన ఎంతో ప్రయోజనకరమైనది. విశాఖపట్టణంలో నెలకొల్పవలసిందిగా మనం కోరే భారీ ఉక్కు-ఫ్యాక్టరీకి రాష్ట్రంలో సకలసౌకర్యాలూ ఉన్నాయి. ఈ దుక్క-ఇనుము ఫ్యాక్టరీలు ఆ ఉక్కు-ఫ్యాక్టరీకి ఎంతో సహాయపడతాయి.

ఈ పై సూచనలలో కొన్ని పరిశీలనలో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పారిశ్రామిక శాఖ, ఇతర పబ్లిక్ కార్పొరేషనులూ, పారిశ్రామికులూ సమిష్టిగా కృషిచేసి క్రమబద్ధమయిన, ప్రణాళికాబద్ధమయిన, కార్యక్రమాలను రూపొందిస్తే వాటి ఆచరణలో ఘన విజయాలను సాధించవచ్చు.

అనుకూల పరిస్థితులు

ఆంధ్రప్రదేశ్‌లో అనేకరకాల కొత్త పరిశ్రమలను నెలకొల్పడానికి అనుకూలమైన పరిస్థితులూ, అనువయిన వాతావరణం ఉన్నట్లు పై సమావేశానికి వచ్చిన పారిశ్రామికులు. వేరే పై దేశాలనుండి వచ్చిన పరిశీలక జట్లుకూడ తెలుసుకున్నాడు. ఐతే తమ పథకాలను కార్యరూపంలో పెట్టడానికి "ప్రోత్సాహక చర్యల" రూపంలో తగిన వాతావరణాన్ని కల్పించాలని కోరుతూ వారు కొన్ని షరతులు పెట్టారు. అందులో కొన్ని ఆర్థిక సహాయ సంబంధమయినవి ఉన్నాయి. పారిశ్రామికులకు అప్పుగా ఇచ్చే మొత్తాలపై వడ్డీలు, పన్ను మినహాయింపు సౌకర్యాలూ, ఆయా పరిస్థితులను బట్టి వేర్వేరుగా ఉండాలనీ, యంత్రాల దిగుమతికి ఇతర అవసర పరికరాల దిగుమతికి కేటాయింపు చేయాలనే ముడిసరుకులను కంట్రోలు ధరలకు సరఫరా చేయాలనీ, రవాణా సౌకర్యాలనూ, విద్యుచ్ఛక్తి సౌకర్యాలనూ రాష్ట్రప్రభుత్వం సమకూర్చి, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పడానికి పరిశ్రమల వాడలను నిర్మించాలనీ వారు రాష్ట్రప్రభుత్వానికి సూచించారు.

పరిశ్రమల రంగంలో కొత్తగా కాలు పెట్టేవారికి ముడిసరుకుల సరఫరా, తయారు చేసిన వస్తువులకు అమ్మకపుసౌకర్యాలూ, సాంకేతిక సుస్థిరతల విషయంలో తగిన హామీలూ ఇవ్వవలసిందే. నిపుణులయిన పనివారు, అజ్మాయిషీ సిబ్బంది, తదితర రకరకాల సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి సౌకర్యాలు కూడ విరివిగా కల్పించాలి. రాష్ట్రంలో అమలులో ఉన్న పన్నుల విధానం ఎంతవరకు కొత్తపారిశ్రామికుల ప్రతిబంధకంగానూ, నిరుత్సాహకరంగానూ ఉన్నదో పరిశీలించి, అవసరమయితే దానిని చక్కదిద్దడానికి చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతాలలో పరిశ్రమలు నెలకొల్పడానికి అన్నిసౌకర్యాలూ సమకూర్చి పారిశ్రామికులను ప్రోత్సహించాల్సిందే. అనుబంధ, సహాయక పారిశ్రామిక యూనిట్లను నెలకొల్పగల సామర్థ్యం ఉన్న పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రత్యేకచర్యలు తీసుకోవల్సిందే.

పారిశ్రామికుల కోర్కెలు

అయితే వీటిలోకొన్ని తీరని కోర్కెలుగా కనిపించవచ్చు. వాటి సాధ్యాసాధ్యాలను అతి జాగ్రత్తగా పరిశీలిస్తే తప్ప, వాటిలో కొన్నింటిని కార్యరూపంలో పెట్టడం సాధ్యంకాదు. కాగా పారిశ్రామికులు సమర్పించిన కోర్కెల

జాబితాలోని సౌకర్యాలు చాలావరకు ఇప్పుడే అమలులో ఉన్నాయి. రాష్ట్రంలో ఉన్న, యికముందు నెలకొల్పనున్న. పరిశ్రమలకు స్థలం, నీరు రవాణా తదితర సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. పరిశ్రమలకు విద్యుచ్ఛక్తిని తక్కువ రేట్లకు ఇప్పుడే సరఫరా చేస్తున్నారు. కొత్త పరిశ్రమలకు స్థాపించ దలచినవారికి, యీక్విటీ పద్ధతిలోగాని, ఋణ సహాయం ద్వారాగాని సహాయ పడటానికి ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమల అభివృద్ధి సంస్థ, రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలకు నిధులు సమకూర్చడం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో ముఖ్యమయినది.

ఇందునిమిత్తం మరి ఇతర సహాయ చర్యలకూ, రాష్ట్ర నాలుగవ ప్రణాళికలో 60 కోట్ల రూపాయలు పొందుపరచనున్నారు. ఆ మొత్తంలో భారీ, మధ్యరకం పరిశ్రమలకు 21.65 కోట్లు ప్రత్యేకిస్తారు. ఈ కేటాయింపుల వివరాలు :— పరిశ్రమల పెంపుదలకు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సంస్థకు, రూ. 6.25 కోట్లు, ప్రయివేటు రంగంలోని ప్రాజెక్టులకు యీక్విటీ పద్ధతి క్రింద రు. 5 కోట్లు, సమర్థవంతంగా నిర్వహించబడే అట్టి ప్రాజెక్టులకు సహాయంక్రింద రు. 1.75 కోట్లు. సహకార రంగంలోని పరిశ్రమలకు పెట్టుబడులకుగాను రు. 1.70 కోట్లు.

కేంద్ర ప్రభుత్వ బాధ్యత

ప్రైవేటు పరిశ్రమలను ప్రోత్సహించడానికి చేసే సహాయం, యితర మినహాయింపు సౌకర్యాలూ, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకుకూడా లభిస్తాయి. అట్టి పరిశ్రమల స్థాపనలోనేమి, అందుకు కావలసిన ఏర్పాట్ల విషయంలోనేమి కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం స్వప్రయోజనం అంతగా లేని భాగస్వామిగా ఉంటున్నది. ఐతే అట్టి ప్రాజెక్టుల మూలధనంతో ఇప్పటికంటె, ఇంతవరకుకంటె హెచ్చువాటాను, హెచ్చు సంఖ్యలో అట్టి ప్రాజెక్టులను యీ రాష్ట్రంలో నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన కోర్కెలను కేంద్రం ఇంతవరకు సరిగ్గా గుర్తించక పోవడం శోచనీయం. తలసరి సగటు ఆదాయంలోనూ, వివిధ రాష్ట్రీ ఆదాయాలలోనూ, వాటిమధ్య ఏర్పడి ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి ఆంధ్రప్రదేశ్ యీ విషయాల్లో అఖిల భారత అభివృద్ధి స్థాయి నందుకోడానికి వీలు కల్పించడానికీ, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి సరఫరా, రవాణా, కమ్యూనికేషన్ల సౌకర్యాల కల్పనలో ఇతర రాష్ట్రాలలో ఆంధ్రరాష్ట్రం సరితూగడానికి రాష్ట్ర ప్రభుత్వం కోరిన కోర్కెలకు ప్రత్యేక ప్రాముఖ్యం ఉన్న విషయం ఈ సందర్భంలో కేంద్రప్రభుత్వం మరువరానిది.

పైన పేర్కొన్న తారతమ్యాలను, సమగ్రంగా వివరించవచ్చు. కాని యీ సందర్భంలో ముఖ్యమయిన కొన్ని విషమాత్రం ఉదహరిస్తే చాలు. ఆంధ్ర ప్రదేశ్‌లో తలసరి ఆదాయం 1950–1951 ఆఖరుకు రు. 256. 1956 నాటికి అది రు. 281 కి పెరిగింది. 1961 నాటికి రు. 294కూ పెరిగింది. 1966 నాటికి అది రు. 319 కు పెరుగుదలని ఆశించబడుతున్నది. అఖిల భారత తలసరి సగటు ఆదాయం పై సంవత్సరాలకు వరుసగా రు. 361, 397, 438 గా ఉన్నది. అది 1971 నాటికి రు. 495 వరకు పెరగవచ్చు. తలసరి సగటు ఆదాయంలోని ఆంధ్రరాష్ట్రం వెనుకబడి ఉండటం విద్యుచ్ఛక్తి వాడకం, విద్యారంగం, వైద్య ప్రజారోగ్యం, సాంఘిక సంక్షేమ రంగాలలో కూడ ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తున్నది.

నాల్గవ ప్రణాళికా కార్యక్రమం

ఒక చివరిమాట. తృతీయ పంచవర్ష ప్రణాళిక గడువు సమీపిస్తూ, చతుర్థ ప్రణాళిక రూపురేఖలు తీర్చి దిద్దబడుతూన్న యీ సంధికాలంలో కొత్త పరిశ్రమలను నెలకొల్పదలచిన పారిశ్రామికులూ, ప్రభుత్వ ప్రతినిధులూ, పబ్లిక్, ప్రైవేటు రంగాలలోనే పరిశ్రమల ప్రతినిధులూ, పరస్పరంగా తమతమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకోడానికి హైదరాబాదు సమావేశం అనువయిన వేదికగా తోడ్పడింది. ఈ సమావేశం సమిష్టిగా వచ్చిన నిర్ణయాలకు పరిశ్రమలకు సంబంధించిన వారంతా సక్రమమైన లాభకరమైన వాస్తవికరూపంకల్పించాలి.

భారీ, మధ్యతరహా, చిన్నతరహా, కుటీర పరిశ్రమల నిర్వహణకు రాష్ట్రంలో గల అవకాశాలూ, సౌకర్యాలూ పలువురికి తెలియక పోవడం, అందుకు తగిన ఇతర ప్రచారం ప్రాంతాలలో లేక పోవడం, ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు అభివృద్ధి తగినంతగా లేకపోవడానికి ఒక ముఖ్యకారణం అని చెప్పాలి. ఈ కారణము వల్లనే రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి లైసెన్సులు పొందిన చాలామంది పరిశ్రమలు స్థాపించడం, విరమించుకోవడం, లేక వదే వదే వాయిదా వేయడం జరుగుతున్నదనే విషయం కూడా గ్రహించాలి.

రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్ప దలుచుకున్నవారు ప్రోత్సాహిక, సహాయక చర్యలకోసం చేసే బేరాలకు స్వస్తి చెప్పి భవిష్యత్ పట్ల విశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో ముందుకు వచ్చి పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలమంత్రి డాక్టర్ ఎమ్. చెన్నారెడ్డి వెలిబుచ్చిన ఆశయం, ఇచ్చిన సలహా ఎంతో సబబయినది. వారు ఆ పనిచేస్తే తమకుతాము సహాయం చేసుకుంటూ, రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక పురోభివృద్ధికి తోడ్పడి, అటు తమకూ, ఇటు రాష్ట్రానికీ ఉభయతారకంగా ఉండేట్లు సేవ చేయగలుగుతారు. నాలుగు ప్రణాళికలలో ఈ ఆశయం పూర్తవుతుందని ఆశిద్దాం.

మిహిరకులుడు

విశ్వనాథ సత్యనారాయణ

సీరియల్ నవల :

తొమ్మిదవ అధ్యాయము

నీలాంకుని విజయ మైన మఱునాఁడు మిహిరకులుడు తన రాణితోఁ, దన సేనతోఁ గాశ్మీరమునకు వెడలిపోయెను. కాశ్మీరము నుండి యేదో వార్త వచ్చెను. వెంటనే వెళ్ళ వలసివచ్చినట్లు కనిపించెను. మామగారు వలదనలేదు. అంతయు సిద్ధమయినది. నీలాంకుని దత్తత చేసికొనవలయును. వానికిఁ బట్టాభిషేకము చేయవలయును. ఇట్టిస్థితిలో మిహిరకులుఁడు వెడలిపోయెను. అతఁడు పోయిన తరువాత గాంధారరాజ్యలక్ష్మి పులి వలె బోనులోనుండి వెలువడి గోతిలోఁ బడ్డట్లయ్యెను. నీలాంబరుని బాహువును ఖండింపఁగా నీలాంకుని వధించుటకుఁ బోయెను. రెండువందలమంది రాజపుత్త్రులు చెల్లాచెదరైరిగాని నిబంధితులు కాలేదు. నీలాంకునకు భద్రత లేకపోయెను. అటు ఇటు నీలాంబరునిచేత వధింపనుబడలేదు. పుష్కలావతీపురము సర్వము క్రిందుమీఁదగుచుండెను నీలాంబరుఁడు మంచముమీఁద నుండెను. అతని చేయి నిమ్మదించినను వికలాంగుఁ డగుటచేత రాజ్యార్హత లేని వాఁడుగాఁ జేయఁబడెను. రాజును మంత్రి పురోహిత సేనాపతులును నీలాంకుని రాజును జేయవచ్చును. కాని మిహిరకులుఁడు లేకుండ వారా పని చేయుట కిష్టములేనివారైరి. మిహిరకులుఁడు తనకు యీ రాజ్యము వలదన్నమాట నిజమే; తొలుత నట్లనెను. ఇపుడతని మనస్సు మాఱెనేమో! లేనిచోఁ బట్టాభిషేకము చేసియే వెడలెడివాఁడుకదా! కాశ్మీరమునందు జరిగిన సన్నివేశము కూడ ముఖ్యము వహించి యూరకుండవలసినదిగాఁ గనిపింపలేదు. నిష్కారుణముగా కొన్నిచేతలకుఁ బ్రజ లాగ్రహపడఁ జొచ్చిరి. కొందఱు బ్రాహ్మణులు నిరాహారదీక్ష రాజసౌధముముందుఁ బ్రారంభించిరని వార్త వచ్చెను. మిహిరకులుఁడు తన పాతికవేలసైన్యముతోఁ దిరిగిపోయెను. పోయినంతనే విచారించెను. బ్రాహ్మణుల నిరహారదీక్ష సవ్యమైనదిగాలేదు. నిష్కారుణుఁడు సేనాపతిగా నుండుట కర్హుఁడు కాఁడని. వాఁడు క్రూరుఁడని. వానిని దొలఁగింపవలయునని వారు నిరాహారదీక్ష నవలంబించిరి.

మిహిరకులుఁడు సభాధ్యక్షునిచేత వారి దీక్ష న్యాయము కాదని చెప్పించెను. వారు తొలఁగిపోలేదు. వారు వేయిమంది బ్రాహ్మణులు. మిహిరకులుఁడు వారి చుట్టును సైనికులను నిలబెట్టి వారు పాఱిపోకుండ నేర్పాటు చేసి తాను ఖడ్గము పూనెను. వారందఱను సంహరించెను. జనుల హాహాకారములు చెలరేగెను. వారి శరీరములు వారి బంధువుల కీయలేదు. రోజులు గడచుచుండెను. రాబందులు, నక్కలు, కుక్కలు, కాకులు యథేచ్ఛముగా నా ప్రదేశమునందు విహరింప నారంభించెను. రాజప్రాసాద పురోభాగము శ్మశానమువలెఁ గనిపింపఁ జొచ్చెను. రెండునెలలైనతరువాత రాజా ప్రదేశమును బాగుచేయించెను. మున్నె మిహిరకులుఁడు క్రూరుఁ డని జనులకుఁ దెలియును. ఇపుడు దీనితో మహారాక్షసుఁ డని తెలిసెను. అతని సైన్యము నేటికి రెండులక్ష లున్నది. అతని ధనుర్ధారులు పదివేలమంది. లక్షణము చూడగా నీ లెక్కను మిహిరకులుఁడు తాను పాలించుటకు రాజ్యము లేకపోయినను గాశ్మీరప్రజల నందఱను సంహరించునట్లుండెను.

ఈ దుష్కార్యము జరిగిన తరువాత రాజు నెలనాళ్ళు కల్యాణవతీదేవి సౌధమునకుఁ బోలేదు. ఆ ప్రదేశ మంతయు శుభ్రపఱచి దుర్వాయువు నుపశమింపఁజేసిన తరువాత రాజు కల్యాణవతికడకుఁ బోయెను. పూర్వదినములలో నితఁడు రాణి యొద్దకుఁ బోయిన ట్లుండెడిదికాదు. ఆమె కీయన వచ్చిన ట్లుండెడిదికాదు. మిహిరకులుఁడు కల్యాణవతి యెఱుఁగని తన యొక్క క్రూరమైన గుణమునకు రాణి శక్కసించుకొనునట్లు తలఁచెను, ఆమె మాటాడలేదు. వారి సంగమము తొలినాటివలె నిష్ఫలుషమై యున్నదని చెప్పుటకు వీలులేదు. ఆమె హృదయములో భర్తయెడనొకయేవగింపో, యొక సన్నని భయమో యేదో ప్రవేశించెను. తరువాత రాజును రాణియుఁ బలుసార్లు కలిసికొందురుగాని యామె యెడఁదలోని యా భయావేశము భయావేశముగానే మిగిలిపోయెను.

గాంధారరాజు దగ్గిరినుండి మరల వార్త వచ్చెను. ఈసారి మిహిరకులుఁ డొక్కఁడే వెళ్లెను. వెళ్ళినంతనే యచటి పరిస్థితులు తెలిసెను. రాజబంధువు లందఱు నొక్కటి. రా జొక్కఁడే యొకటి. నీలాంకుని సంహరించుటకు నేఁడాదిలోఁ బది ప్రయత్నములు జరిగెను. అతనిని వధించుట సాధ్యము కాలేదు. అతఁడు తన యింటిచుట్టును వందమందిని కాపుంచెను. నాల్గుసార్లు బయటకు వచ్చు వందలమంది యాశ్వికులను విదలించెను. సంహరించెను. ఇట్లు జరిగినప్పుడైన రాజుగాని సేనాపతిగాని పట్టించుకోలేదు. రాజధాని కల్లోలిత మైయుండెను.

మర్గాధ్యక్షులు యథేచ్ఛముగాఁ బ్రవర్తించు చుండిరి. మిహిరకులుఁడు సంవత్సర మైన తరువాతఁ దిరిగి వచ్చెను. అతఁడు మరల తన పాతికవేలసైన్యముతో వెళ్ళెను. ఈసారి యతనివెంట దర్పమల్లుఁడు రాలేదు. నిష్కరుణుఁడు వచ్చెను. ఒకానొక హింసాకార్యము చేయుమని దర్పమల్లునితోఁ జెప్పుటకు మిహిరకులుఁడు వెనుకాడుచుండెను. ఇతని విషయములో నా బెదు కక్కరలేదు. మఱియు నింకొక సన్నని యూసో, కోపమో, యే వికారమో మిహిరకులుని హృదయములోఁ గలిగెను. దానికిఁ గారణము సూక్ష్మతరముగా విచారించినచోఁ గల్యాణవతి యైయుండెను. ఆమె హృదయమునందుఁ దొలినాటియప్పుడు తీసిన యావువెన్నవంటి మెత్తదనము నేఁడు లేదు. అనాఁడు జరిగిన బ్రాహ్మణ వధనుబట్టి మహారాజ్ఞి హృదయమునఁ గలిగిన పరమసూక్ష్మవికారము స్థావర మేర్పఱచుకొనెను. ఆ స్థావర మేర్పఱచుకొనుట మిహిరకులునకుఁ గోపము తేలేదు. అతఁడు మాఱలేదు. అతని క్రూరత్వము హెచ్చుటకు హేతువైనది. మహారాజ్ఞిమీఁదఁ బ్రేమలో నేలోపమును లేదు. తక్కిన యే వ్యవహారమునందును మార్పులేదు. అతని హృదయములో నున్న కఠినరేఖ మఱియుఁ గఠిన మయ్యెను. క్రూరత పెరిగెను. అతఁ డింకను క్రూరముగా మాఱినచో దాని యేమగును? ఈప్రశ్న యతని కుదయించెను. తనకుఁ గల్యాణవతియే ధ్యేయమైన కాంతాప్రకృతి. ఆమె తనకు దూరదూర మైపోవునా? ఆమె వచ్చి తన్ను బ్రేమించినది గాని తా నామెను బ్రేమించ లేదు. తన్ను పరిత్యజించునా? తా నింకొక స్త్రీని ధ్యానించుటలేదు. ఆమె యింకొకనిని ధ్యానించునా? అది యసంభవము. మఱి యామెకుఁ దనయెడల గలిగిన యీ సన్నని యేవగింపునకు ఫలిత మేమగును? ఇన్ని ట్లామెనుగుఱించి తనకుఁ గల యీ గుణమును మరుగుపఱచికొనెను. బ్రాహ్మణ వధముతో నది బాహిరిల్లెను. ఒకసారి మునిగిన నొకటియు మఱియొకసారి మునిగిన మఱియొకటియునా? గాంధార నగరమునఁ దా నానాఁడే చేయఁ దలఁచి కొన్నది యామె యేమనుకొనునో యని యానాఁడు చేయులేదు. దాని నీసారి చేయవలయు ననియే మిహిరకులుఁ డొంటరిగా వచ్చెను.

రాజ్యము పూర్వ మాతేండ్లక్రింద నెట్లున్నదో నేఁడు నట్లే యున్నది. ఆ నాఁడే నీలాంకుని రాజును జేయవలయు నని తలంచెను. "నీలాంబరుఁడు కూరుఁడు. కాని యసమర్థుఁడు. నీలాంబరుఁడు పరిపాలనా దక్షుఁడు, కాని క్రూరుడుకాఁడు. నీలాంకుఁడు రాజైనచోఁ దన్ననుసరించునా? తన్ననుసరించి నచో నీలాంకునిరాజునుజేయవచ్చును. మిహిరకులుఁడు తన సేనతో వచ్చి పుష్కలావతి యందు విడిసి రాజ్యము యొక్క పరిస్థితు లన్నియుఁ బరిశీలించి నీలాంకుఁడు రాజ సౌధమునకే వచ్చుట లేదని తెలిసికొని తానే వానియింటికిఁ బోయెను. దానిలో రాజబంధువు లందఱకు మిహిరకులునిమీఁదఁ గోపము వచ్చెను. వారి యాశలు క్రుంగి పోయెను. వారి పట్టుదలలు హెచ్చెను



వచ్చిన మిహిరకులుని నీలాంకుఁడు మర్యాద చేసి కూర్చుండబెట్టి తాను నిలుచుండి మాటాడుచుండెను. మిహిరకులుఁ డతనిని బలవంతము చేసి కూర్చుండఁబెట్టెను.

నీలాంకుఁడు : "మహారాజా! మహావీరుఁడా! మీరు మా యింటికి వచ్చుట నన్ను గౌరవించుట. ఆ నీలాంబరుని బంధువులు నన్ను బ్రదుకనిచ్చుటలేదు. నేను వారి నేమిచేయుటకును వీలులేదు. నీలాంబరునితో యుద్ధము చేసినవాఁ డెట్లున్నదో నాస్థితి నేఁడు నట్లే యున్నది. వానిని వధించినచోఁ బుష్కలావతీ నగర సర్వరాజబంధువులకు నేను విరోధి నగుదు నని వానిని సంహరింపలేదు. నన్ను నేను రక్షించికొనుటకు దక్షిణబాహు వుత్తరింపవలసివచ్చెను. అదిమొదలు నన్నెన్నిసార్లు వధించుటకుఁ బ్రయత్నములు చేసిరో చెప్పలేను. ఈ వార్త లన్నియు మహారాజునకుఁ దెలియును. ప్రభువులు జోక్యము కలిగించుకొనుటకులేదు. నేను పరదేశములకు జన నిశ్చయించుకొంటిని. కాని లాభము లేకపోయెను. దివారాత్రములు వారు నామీఁద కన్ను వేసియేయుండిరి. నేనొక్కఁడ నైనచోఁ బోదును. నా తల్లిదండ్రులను, నా తమ్ములను, నా చెల్లెలిని నే నెట్లు కొనిపోవలయును. నా కీ సంకటమును తమరు తెచ్చిపెట్టితిరి. నా దురభిమానమే నన్ను పాడుచేసినది."

మి. కు: ఓయీ! నీవు నీతిజ్ఞుఁడవు. పరాక్రమవంతుఁడవు. ధీరుఁడవు. యుద్ధవిద్యావిశారదుఁడవు. కాని నీయం దొక్కటియే లోప మున్నది. నీయందుఁ గాఠిన్యము లేదు. కాఠిన్యము లేని రాజును ప్రజలు తృణీకరింతురు. నీ గుణముల చేత నీవు ప్రజల యందు భక్తిని కలిగింపగలవు గాని భయమును గలిగింపలేవు. భయభక్తులు రెండును గావలయును. నేను నిన్ను వదలి యేడాది యైనది. నీ వీనడుమ దుర్జనుల మార్గములు తెలియు పని నేర్చికొనినచోఁ గాఠిన్యమును నేర్చు కొందునని వదలిపెట్టితిని. ఇప్పుడు నేను నిన్ను రాజును జేయుదును. ఈ రాజబంధువు లనందఱ నేమిచేసెదవు?

నీలాంకుఁడు: తమ రాజ్ఞాపించినట్లు చేసెదను.

మి. కు: నే నేమైనఁ జేసినచో నీ కభ్యంతర ముండునా?

నీలాంకుఁడు: మహారాజా! ఈ రాజ్యము నీది. నీ వెందుచేతనో యనుగ్రహము లేక రాజ్యము నంగీకరింపలేదు. నీవు మహాయోధుఁడవు. నీ కెదురులేదు. నీవు నన్నిచట స్థాపించెదవు. నావంటివారిని వందమందిని స్థాపింతువు. ఆ వంద మందియు నీ కెదురుతిరిగినను నీవు సులభముగా వారిని నిర్మూలింపఁగలవు. రాజ్యము నాది. అధికారము నీది. ప్రజాపాలనము నాది. ప్రజాశిక్షణము నీది. ఈ రాజ్యములో మీరు పదిలక్షల మందిని సంహరింపుఁడు. కాదనుటకు నాకు శక్తిలేదు. వేయియగ్రహారముల నిండు. వలదనుటకు నా కోపికలేదు.

మిహిరకులుఁడు వెడలిపోయెను. మఱునాఁడు నీలాంకుని దత్తత జరిగెను. మూఁడవ దినమునఁ బట్టాభిషేకము జరిగెను. నాల్గవ దినమున రెండువేలమంది రాజబంధువులు సమావేశపఱుపఁబడిరి. సేనాపతి యిట్లనెను. 'నీలాంకమహారాజు తన శౌర్యముచేత, నీతిచేత మనకు సమీపబంధువును, మనమేలు కోరువాఁడును, యథార్థముగా నీ రాజ్యము మీఁద సర్వాధికారము కలవాఁడును నైన మిహిరకులునకుఁ బ్రియతముఁడు. అతఁడు చేసినది న్యాయము. నీలాంబరుఁడు చేసినది యన్యాయము. మీ కుటుంబములవా రందఱును నేటి మహారాజును వధించుటకు సంవత్సరము పొడుగునను వేయి దుష్ప్రయత్నములు చేసితిరి. నేటి మన క్రొత్తమహారాజు తన నీతిచేతఁ, దన పరాక్రమముచేతఁ దన్ను దా సంరక్షించు కొన్నాఁడు గాని లేనిచో మన రాజ్య మరాజక మయ్యెడిది. మీ రందఱు రాజద్రోహులు. రాజ్యద్రోహులు. మీ కే శిక్ష విధింపవలయునో రాజుగారి జామాతకే తెలియును.'

అంతట నా రెండువేలమంది రాజబంధువులు, వృద్ధులు, కౌమారమునందున్నవారు, యువకులు, బాలురు నందఱు కాశ్మీర సేనచేతఁ జుట్టుముట్టఁబడిరి. నీలాంక నీలాంబరులు నాఁడు యుద్ధము చేసిన ప్రదేశమునకు గుంపుగా మరలింపఁబడిరి. కదలని వారు కత్తులతోఁ బొడువఁబడుచు నడపింపఁబడిరి. అచటికిఁ జేరిన తరువాత జుట్టును సైన్యము నిలిచియుండెను. పాఱిపోవువారిని వధించుటకు సైనికులు నియమింపఁబడిరి. వెలినుండి ధనుర్బాణములతోఁ గొందఱు సంహరింపఁబడిరి. ఖడ్గధారులైన యాశ్వికులచేతఁ గొందఱు కూలద్రోయఁబడి కొందఱు ఖడ్గముల కాహుతి చేయబడిరి. కొనయూపిరి కలవారి కంఠములు నిర్దయముగా నిర్దళితము లయ్యెను. ఆనాఁడు సూర్యుఁ డస్తమించువేళకు వారి రక్తముచేత నదియే పశ్చిమసముద్రప్రదేశ మనిపించెను. తరువాత నాల్గుదినములవఱకు వారి కుటుంబముల సంహారము జరిగెను. స్త్రీలు కారు, శిశువులు కారు, వ్యాధిగ్రస్తులు కారు చూచిన వారి దుండెలు బ్రద్దలగునట్లు ఘోరమైన వధ సాగెను. పదిదినము లగువేళకుఁ గ్రొత్తరాజుయొక్క యుదయము మందేహారుణ రక్తచిహ్నిత మైనట్లు కనిపించెను. మిహిరకులుని క్రౌర్యము, వాని దుశ్చేష్టలు కర్ణాకర్ణికగా వినుటయేగాని పుష్కలావతీ పుర జనమును, గాంధార ప్రజలును ప్రత్యక్షముగా నెఱుఁగరు. శ్రీనగరమునం దెంత భయమైనదో పుష్కలావతీపురమున నంత భయ మయ్యెను. కాశ్మీరప్రజ లెంత నిస్సహాయులైరో, గాంధారప్రజ లంత నిస్సహాయులైరి. మిహిరకులుఁడు వీథివెంటఁ బోవుచున్నచో స్త్రీలును, శిశువులును భయ

ముతోఁ బోయి దాగికొనఁజొచ్చిరి. తల్లులు పిల్లలను 'రాజుగారి యల్లుఁడు వచ్చుచున్నాడు. మిహిరకులుఁడు వచ్చుచున్నాఁడు' అని బెదరింపఁజొచ్చిరి. పుష్కలావతీ పురమునఁ దల యెత్తినవాఁడు లేఁడు. రాజును గాదన్నవాఁడు లేఁడు. అనుకొనిన వాఁడు లేఁడు. ఇండ్లలో రహస్యముగాఁ గూడ రాజద్రోహపుమాట వచ్చినచో గోడలకుఁగూడ చెవు లుండు నని పరిహరింపఁజొచ్చిరి. ఈ దోష మంతయు నీలాంకుని దయ్యెను.

ఇట్లు జరిగిన రాజకుటుంబముల వధ దేశముప్రజ లేమనుకొనుచున్నారు మొదలైన వర్తమానములు తెలిసికొనుటకు రహస్యచారులు నియమింపఁబడిరి. ఆఱు నెలలకు వారిలోఁ జాలమంది తిరిగివచ్చిరి. నిందించినవారు నిష్కరుణముగా శిక్షింపఁబడిరి. ప్రశంసించిన వేయి బ్రాహ్మణకుటుంబములు కనిపించెను. వారందఱకు మిహిరకులుఁ డగ్రహారముల నిచ్చెను. ఒక మహానగరమునఁ దూర్పుదిశయందు బ్రహ్మాండముగా వానఁ గురియును. ఉత్తరదిశయందు నెండలు కాయును. గాంధారరాజ్యమున గ్రీష్మ వర్షర్తువుల సహయోగము కలిగినట్లుండెను. ఆఱునెలలు గడచెను. నీలాంకుఁడు రాజ్యమునందు స్థిరపడెను. నీలాంకుఁడు మిహిరకులుని సర్వవేళలయందును మహారాజా యని పిలుచును. మిహిరకులుఁడు నీలాంకుని బావా యని పిలుచును. మిహిరకులుని వెంట నిచ్చలును నీలాంకుడుండితీరవలయును. రాజ్యపాలనమునందు మిహిరకులుఁ డే జోక్యమును పెట్టికొనఁడు. ఆఱునెలలలో నీలాంకుఁడు రాజ్యమునందు సువ్యవస్థ నేర్పఱచెను. రాజాధికారుల మాంద్యము తొలఁగిపోయెను. ఒక్కఁ డన్యాయము చేయుటకుఁ బూనికొనఁడు. తన ధర్మమునం దెవ్వఁడును జాగు చేయఁడు. నీలాంకుఁడు మహారాజైన తరువాత వృద్ధరాజునకు గ్రమక్రమముగా గొప్ప శాంతి కలిగెను. ఆయనను బంగారపుఁ దూగుటుయ్యేలలో హంసతూలికాతల్పముల మీఁద నీలాంకుఁ డూగించుచుండెను. ప్రతి దినము సాయంకాలమున వృద్ధరాజు పాద సన్నిధిని గూర్చుండి యానాటి విశేషములను వినిపించును. మఱునాఁడు జరుగవలసినవి చెప్పును. ఎట్లు చేయవలయు నని యడుగును. తొలుతటి దినములలో వృద్ధరాజు చెప్పలేదు. క్రమక్రమముగాఁ దన బరువు తొలఁగిపోయినదని తెలిసికొని తన యల్లుడు నెరపిన క్రౌర్యమునకు నీలాంకుని బాధ్యత లేదని తెలిసికొని యతడు వినిపించు రాజకార్యములయం దతఁడుచేసిన న్యాయ్యమును దెలిసికొని యతని మంచితనము గుర్తించి యతని పరిసాలనాదక్షతను గ్రహించి మఱునాటి పనులిట్లిట్లు చేయుమని యాదేశించును. వృద్ధరాజు చెప్పినదె యథాతథముగా నడుపుచుండెను.

మిహిరకులుఁడు తాను తన రాజ్యముపకుఁ బోదు ననెను. నీలాంకుఁ డిట్లనెను. 'మహారాజా! నా యక్కగారు కల్యాణవతీదేవి మా యీ క్రొత్తరాజ్యమును జూడవలయును, నన్ను తన తమ్మునిగా నంగీకరింపవలయును. ఆమె యాశీర్వచనము నాకుఁ గావలయును. ఆమె వివాహమునాఁడు నేను లేను. పెండ్లికానుకలు నాయనగారేమిచ్చారో నాకుఁ దెలియదు. ఆమె నాయింటి కొకసారి వచ్చినచోఁ బసుపుకుంకుమలు పెట్టి పంపింప నెంచుచున్నాను' అని మనవి చేసెను. మిహిరకులుఁడు తిరిగి తన రాజ్యమునకుఁ బోయెను. బావమఱది యెన్నో కాన్క లర్పించెను. ఏనుఁగుల నిచ్చెను. గుఱ్ఱముల నిచ్చెను. పదాతిసైన్యము నిచ్చెను. దాసదాసీజనము నిచ్చెను. ఇంత యిచ్చి నీది నీ క్రిచ్చుటలో నాధిక్య మేమున్నదనెను. మిహిరకులుఁడు కాశ్మీరమునకుఁ బోయినతరువాత నేటాది జరిగెను. కల్యాణవతీదేవికిఁ బుష్కలావతిపురమున జరిగిన సర్వరాజబంధుకుటుంబవధయుఁ దెలిసెను. నీలాంకుని సౌజన్యము వినెను. అతఁడు బావగారికి విధేయుఁడగుట తెలిసెను. భర్త వేయియగ్రహారములిచ్చె నన్నవిషయము వినెను. ఆ రాజబంధుకుటుంబములు మిగిలియున్నచో రాజ్యమునందు శాంతి యుండదనికూడ గ్రహించెను. మిగిలినది భర్తయొక్క క్రౌర్యము. ఆ క్రౌర్యముయొక్క వెలయింపు నొక్కొక్కప్పుడు తప్పదేమో యన్నట్లుండెను. ఆమె హృదయములోఁ దన తండ్రిరాజ్య మిన్నాళ్ళకు సువ్యవస్థిత మయ్యెనన్న తృప్తి యొకఁడు భాసించెను. ఆతృప్తిలో భర్త నెరపిన క్రౌర్యము సుంత నిమజ్జిత మయ్యెను. మిహిరకులుఁడు మరల మహాదేవీ సౌధములకుఁ బోయినపుడు కల్యాణవతి తనయందు నిచ్చలు నెరపు ప్రేమపరిచయ సౌహార్దగౌరవములలో లీలగాఁ గనిపించు నొక భయరేఖ నేఁడు తగ్గినట్లుండెను.

కాలము గడచుచుండెను. ఆ మిహిరకులుని రాజ్య మెట్టిదో వాని స్వరూప మెట్టిదో వాఁ డుదయించిన వేళావిశేష మెట్టిదో శాంతముగా రాజ్యము నడచుటకు వీలు లేకుండెను. అతని కెదురు లేదని యందఱకును దెలియును. అతఁడు కొండలనుగూడ పిండి చేయఁగలఁ డని యందఱకుఁ దెలియును. అతని కెదురుతిరుగుట నిస్సంశయముగా మృత్యువును కొనితెచ్చుకొన్నట్లని యందఱకుఁ దెలియును. అతని కోప మొక్క యెదిరించినవానితోడనే యాగదు. శ్రీరామచంద్రుని కోపమువలె సర్వవంశనిర్మూలనము చేయును. ఇట్టి స్థితిలో నవివేకు లెందు కెదురుతిరుగుదురో తెలియదు. కాశ్మీరదేశమున కుత్తరమునఁ గృష్ణ గంగానది ప్రవహించు పల్లపుమేర సింధునదివఱకు నున్న దేశమునకు దరదదేశమని పేరు. ఆ ప్రాంతముల నివసించు జనులు పల్లీనివాసులు. వారందఱును వీరులు. ప్రాణములు సరకు సేయని వారు. వారి మతవిశ్వాసములు విలక్షణముగా నుండును. వారికి మతము తొడిగికొన్న యంగీవంటిది, వారి యంతర్జీవితములు తనూభోగసమ్మిశ్రితములు. జన్మ మెందు

కెత్తితి మన్న ప్రశ్న వారికి లేదు. ఎత్తితిమి కావున బ్రదుకవలయును. దీని కిదే పరమార్థము. మొదలైన భావములు కలవారు వారేరాజును లెక్కచేయరు. నేఁడు కాన్యకుబ్జ నగరాధిపతిక్రింద నుందురు. నాలుగేండ్లతరువాత గాంధారరాజ్యాధిపతి క్రింద నుందురు. మరికొన్నాళ్ళకుఁ గాశ్మీరముక్రింద నుందురు. వారు మహావీరులు, మహాసాహసులు. వారికి బ్రదికియున్నను జచ్చిపోయిన నొక్కటియే. చుట్టుపట్ల నున్న సర్వరాజులును వారిని సైనికులుగాఁ దీసికొందురు. వారు సోమరులు. నివసించు ప్రదేశము రత్నగర్భ. వారు పండింపరు. పండినదానిని లెక్కచేయరు. ఎవనినో సైనికునిగా సేవించి సంపాదించినది తిందురు. లేదా దోచికొని తిందురు. ఆ రాజునకుఁ గప్పము కట్టుదురు. ఆ రాజు గ్రామములోనే దోచికొందురు. దండింపుటకు రాజు సైన్యములు వచ్చును. వీరు లోయలలో దాగికొందురు. ఆ సైనికులు వీరి పల్లెలమీదఁ బడి ధ్వంసము చేయుదురు. సైనికులు రాకముందే వారి స్త్రీలును శిశువులును పాఱిపోవుదురు. వారి కుటీరములు దోచికొనుటకుఁ బనికిరావు. తగులబెట్టినందువలనఁ బ్రయోజనములేదు. వారి యొకొక్కయింటికంటె ధనవంతుల పిడకలగుడిసెలు భద్రముగా నుండును. ఈ జాతిలోని యువకు లొక్కొక్కప్పుడు నిరుద్యోగు లగుదురు. చుట్టుప్రక్కల నున్న రాజుల సేనలలోఁ జేరనివారి సంఖ్య యెక్కువగా నుండును. ఇతరరాజుమీఁద దండెత్తవలయునన్న కోరిక లేని రాజులు చుట్టుపట్ల నున్నచో వారు నిర్వ్యవసాయు లగుదురు. అందుచేత వారీ రాజ్య మా రాజ్య మని లేక చుట్టుప్రక్కల నున్న సర్వ రాజ్యములమీఁదికి దాడి వెడలుదురు. ఆ దరదజాతియందొక విశిష్టమైనలక్షణము కలదు. ఒకరాజు తన దేశమును భద్రముగా నుంచుకొనుచున్నాఁ డన్న మాటను వారోర్వలేరు. అందుచేతఁ గాశ్మీరముమీఁద వారు పగఁ బూనిరి. దరదదేశమును సాధించుట యనఁగా నది యల్పపుఁబని కాదు. ఒక్కొక్కప్పు డది పదియేండ్లు పట్టవచ్చును. వారి నాయకు లెవ్వరో తెలియదు. ఎవఁడో వచ్చి సంధి చేసికొనును. వాఁడు నాయకుఁడే కాఁడు. నాయకు లన్నవారిని పదిమందిని పట్టికొని రాజు వధించును. మృత్యు వన్నది వారికి శిశుక్రీడ. నాగరకమైన రాజ్యములో రాజు కొందఱిని తీవ్రముగా శిక్షించినచోఁ దక్కినవారి కది భయహేతు వగును. అనాగరకులలో నది భయహేతువు కాదు. వారి కది హాస్యము. దరదజాతి యిట్టిది.

మిహిరకులుఁడు వారి నెదిరింపవలసి వచ్చెను. వారితో నతఁడు పదియేండ్లు యుద్ధము చేసెను. తన సైన్యము కొంత వ్యయపెట్టికొనెను. ఆ సైన్యము నటనుండి కదలింపలేదు. ఆ పదియేండ్లలో లక్షమంది దారదులు నశించుపోయిరి. అప్పటి కచట శాంతి కుదిరెను.

మఱియొకరాష్ట్ర మున్నది. పూర్వకాలమున దానిని 'లో' రాష్ట్ర మనెడివారు. దానినే నేఁడు లడఖ్ రాష్ట్ర మనుచున్నారు. ఈ రాష్ట్రమునకును గాశ్మీరమునకును నడుమ జోజిలా పర్వతమార్గ మున్నది. ఈ ప్రాంతమునం దనాదినుండియు త్రైవిష్టపేయులు నివసింతురు. వారును దారదుల వంటివారే. వారివలనగూడ మిహిరకులుని నాఁడు కాశ్మీరమున కెద్దడి కలిగెను. ఈ రెండుజాతులతో మఱియు మ్లేచ్ఛులతో మిహిరకులుఁడు యుద్ధములు చేయవలసి వచ్చెను. వివాద వివాహములు సమానులయం దుండవలయు ననుట యెంతయైన యథార్థము. ఒకరాజున కింకొకరాజుతో యుద్ధము వచ్చినచో వారిసేనలు వీరిసేనలు తలపడును. జయాపజయములు తేలిపోవును. ఆతలివారిది రాజ్యముకాదు. వారు దోపిడికాండ్రు. వత్తురు. ఊళ్ళు తగులబెట్టుదురు. పాఱిపోదురు. కొండగుహలలో దాగికొందురు. వారికి నీతి లేదు, జాతి లేదు. సైన్యముగా వచ్చి నిన్నెదిరింపరు. అట్టి వారితోడి యుద్ధమునకుఁ దెగ త్రెంపు లుండవు. ఈ రెండుజాతుల యిరకటము వలన మిహిరకులునకుఁ బదేండ్లు తీరిక లేకపోయెను. శత్రువును గెలిచిన ట్లుండును. అది గెలుపేకాదు. వారము దినములు ప్రశాంతి యేర్పడును. ఎప్పటికప్పుడు రెడ్డి వచ్చి మొదలాడినట్లే. కాని యీ పదియేండ్లును గాశ్మీరమునకు వచ్చిన నష్టము లేదు. కాశ్మీరరాజ్యమునకు వచ్చిన నష్టములేదు. ఎల్లలలో నున్న యూళ్ళకు, వారు సాహసించి యప్పుడప్పుడు బొఱబడిన యూళ్ళకు నష్టము కలుగుచునేయుండెను. వీని యన్నిటికంటె నీ యుద్ధములే మిహిరకులునకుఁ బ్రియతమములుగా నుండెను. మఱియొక రాజు వీని నంత పట్టించుకొనకుండ నుండి యుండవచ్చును. కొంతసైన్యము నెల్లలయందు నిలిపి వారి దాడులను ప్రతిఘటించుచుండినచోఁ జాలును. వారిని మూలముట్టుగా నశింపఁజేయవలయు నన్న ప్రయత్నమునకు మిహిరకులుని క్రౌర్యముమాత్రము చాలదు. ఒక దేశమును దేశమును, ఒక ప్రాంతమును ప్రాంతమును పురుగుపురుగు లేకుండ నిర్ధూమధామము చేయవలయు నన్నచోఁ గావలసినరాజుగాని జాతిగాని మిహిరకులునికంటెఁ బదియాకు లెక్కువ చదివినది కావలయును. మిహిరకులున కిందులోని తృప్తి యేమనగా నతని దైనందినమైన భేతాళభావపరితృప్తికొఱకు నిత్యముగా దారదులు మ్లేచ్ఛులు భాట్టులు దొరకుచుండిరి. భాట్టు లనఁగా నీ లోరాష్ట్రమువారు. నెలలకొలఁది వారిని బంధితులైనవారిని దెచ్చి మిహిరకులుఁడు వధించుచుండెను. వారిని వధించుట మిహిరకులునకు మఱియు నిష్టముగా నుండెను. వా రాటవికులు. పార్వతేయులు. వారి భాష వేఱు. వా రెంత శ్రమయైన పడుదురు. ఎంతబాధయైన సహింతురు. కాని యెప్పుడో భరింపలేని యొక బాధవేళ వారు చిత్రముగా నఱతురు. ఆ యఱపు నెమలి కూసిన ట్లుండును; వట్టి నెమలికూత కాదు. ఆ

నెమలికూతలో వర్షర్తువునందలి మహా మండూకధ్వని యుండును, సృష్టిలో మేఘము చూచి నెమలి యఱచుట కలదు. వానలు కురిసినచోఁ గప్పలు బెకబెకలాడుట కలదు. ఈ రెండును రెండు విడివిడిస్వరములు. రెండును గలిసి యీ యాటవికులు నా పార్వతేయులు నెఱపెడి కంఠరావమునందు మిహిరకులుఁడు తనయందు వర్షకాలమేఘము సమృద్ధిగా పండినట్టు భావించుకొనుచుండును.

ఇప్పటికి మిహిరకులునకు నలువదియైదేండ్లు. అతని కైదేండ్లనుండి సంతానవాంఛ యుదయించెను. అతని భార్య యుద్ధకళావిశారద. చిన్నప్పటుకు శరీరవ్యాయామము చేసి, కత్తివిద్య మొదలైనవి నేర్చినది. అట్టిస్త్రీకి సంతానము కలుగుట కష్ట మని కొందఱు చెప్పిరి. మిహిరకులుఁడు జ్యోతిష్కులను బిలిచి యడుగును. వారు రాజునకుఁ బురుషసంతానము కలుగు నని చెప్పుదురు. ఇతఁ డెప్పు డని యడుగును. వారొకసమయమును జెప్పుదురు. అట్లే యైదేండ్లును వందమంది చెప్పుటయు, వందమందిజోస్యములు తప్పుటయు మిహిరకులుఁడు వారిని సంహరించుటయు జరుగుచుండెను. ఎవఁడో చెప్పును, ఆ దేశములో నా మహాపండితుఁడు గొప్ప దైవజ్ఞుఁడని. మిహిరకులుఁడు వానిని బిలిపించును. ఇప్పుడు మహారాజునొద్ద కే జ్యోతిషుఁడును వచ్చుటలేదు. ఇతఁడే బలవంతముగాఁ గొందఱను రప్పించును. వారు రాక తప్పదప్పుడు వారింటియొద్ద నన్నియు సద్దికొని చెప్పవలసినమాటలు చెప్పివత్తురు. ఇందులో నొక చమత్కారము కలదు. ఆ జ్యోతిష్కుని వధించును. వాని కుటుంబమున కొక యగ్రహారము దానము చేయును. కొందఱు పేదవాండ్రిది కనిపెట్టి తాము జ్యోతిష్కులమని వత్తురు. అప్పులించినచోఁ బ్రేవులు లెక్కపెట్టెడి మిహిరుఁడు వారిని గనిపెట్టును. వారిని వధించుటయే గాని యగ్రహారము లుండవు. ఇట్లుండఁగా జ్యోతిష్కులెవ్వరును రాకుండగా నొక పండితుఁడు. కుండలములవాడు, ఆజానుబాహువు, బంగరు పసిమిమేనివాఁడు, కట్టిన దోవతి చుంగులు మెట్టిన స్వర్గపువాఁడు, ఫాలస్థవిభూతి చందనరమణీయా కృతివాడు తాను జ్యోతిష్కుఁడనని వచ్చెను. మిహిరకులుఁ డాయనను జూచెను.

మి. కు: అయ్యా! మీరు నాకు జ్యోతిషము చెప్పనక్కఱలేదు. మీ కగ్రహారమిత్తును. తీసికొనిపొండు.

బ్రాహ్మ: నా కగ్రహార మక్కఱలేదు. జ్యోతిషమే చెప్పెదను.

మిహిరుఁడు: నాకు మిమ్ము సంహరించుట కిష్టములేదు.

బ్రాహ్మ: మహాప్రభువులు నన్ను చంపరు. నాకుఁ దెలియును. మీ చేతిలో నాకు మృత్యువు లేదు. ఉన్నచో నేను మీ చేతిలో పాతికేండ్లక్రిందనే చావవలసియున్నది. అప్పుడు జరుగలేదు. ఇప్పుడును జరుగదు.

మిహిరుఁడు: నీ వెవ్వఁడవు. నా చేతిలో నీ వధ యెట్లు తప్పినది?

బ్రాహ్మ: మహారాజా! తొలుత నీకుఁ బట్టాభిషేకము జరుగవలయు నన్న సమయమున నవివాహితునకుఁ బట్టాభిషేకయోగ్యత లేదని వాదించినపుడు తమరు పెండ్లి చేసికొన మని నిరాకరించినపుడు బ్రాహ్మణులు రాజసౌధము ముందు నిరాహారదీక్ష నవలంబించిరి. అప్పుడు ప్రభువులు వారి నందఱ నేనుఁగులచేతఁ ద్రొక్కింప సిద్ధపడితిరి. అప్పుడొక బ్రాహ్మణయువకుఁ డిరువదియేండ్లవాఁడు 'ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః' అన్న వేదోక్తిలోని యర్థమును బోధించి బ్రాహ్మణుల నందఱను లేవదీసికొని పోయెను. ఆమాట మీకు నచ్చినది. ఆ బ్రాహ్మణుఁడు గోనందవంశము మీతో విచ్ఛిత్తి యగుట కిష్టముపడలేదు. అది మీకుఁ గూడ నభిమతముకాదు. ఆ బ్రాహ్మణుఁడను నేనే! ఆనాఁడు తమకు వివాహమువం దాభిముఖ్యము కలిగించితిని. ఈనాఁడు మీ వంశము నిలుచుటకు మార్గ ముపదేశించుటకు వచ్చితిని.

మిహి: ఆయనయా మీరు? నే నీ పాతికయేం డ్లిద్దఱికొఱకు వెదకుచున్నాను. అందులో నొకఁడవు నీవు. దొరికితివి.

బ్రాహ్మ: రెండవవాఁ డెవఁడు?

మిహి: అది నీ కెందుకు?

బ్రాహ్మ: నీకు సంతానము కలుగుట కుపాయమును జెప్పెదను. నీవు నన్ను వధించినచో వధింపుము. నా కభ్యంతరములేదు. ఆ రెండవవాఁ డెవఁడో చెప్పినచో వానినిగూడ వెదకి తీసికొని వచ్చెదను. ఇద్దఱను గలిపి యొకసారియే వధింపవచ్చును. ప్రభువుల వధహేతువులు నాకుఁ దెలియకపోలేదు. విష్కంటకుని వధించినప్పుడే ప్రభువుల రహస్యము, కొందఱు వివేకులైన వారికిఁ దెలిసినది. ప్రభువులు దారి వెంటఁ బోవుచుందురు. ప్రక్క కల్పవృక్ష మున్నది. దాని కొమ్మ తగిలి ప్రభువులకుఁ గీసికొనిపోవును. లేదా ప్రభువుల యుత్తరీయమునకు చిరుగు పట్టును. ప్రభువు లా కల్పవృక్షమును ఛేదింతురు. ఆ కల్పవృక్షము తాను ఛేదింపబడకముందు ప్రభువులు కోరిన కోరికలు పండించును. ఆ వంట పంటయే: ఛేదనము ఛేదనమే. నేను నీ కుపదేశము చేయుదును. నేను చెప్పిన మంత్రమును జపించుచు నేను జెప్పిన నియమములను బాలించుచో నీకు సంతానము కలుగును.

మిహి: చెప్పుము. చేసెదను, పాలింతును.

బ్రాహ్మ: నీకు సంతానము కలుగకుండుటకు నిరోధహేతువు లున్నవి. నీవు బేతాళ మంత్రము నుపాసింతువు; యమధర్మరాజు మంత్ర ముపాసింతువు. ఆ యిద్దఱు నీకుఁ బ్రత్యక్షముగా నున్నారు. ఆ మంత్రములు నీ కెవ్వఁడు నుపదేశింపలేదు. వా రిద్దఱే చిన్నప్పటినుండియు నీకు స్వప్నములలోఁ గన్పించుచుఁ దమ

మంత్రములను నీ కుపదేశించిరి. మంత్రము లేకుండ వట్టిధ్యానము చేయుచున్నప్పుడు నీ కొక్క యాజానుబాహువు, మంచువంటి గడ్డమును మీసలు కలవాఁడు, మేఘము వెనుక నున్న చంద్రునివలెఁ దోచువాఁడు కనిపించుచుండును. అతఁడు మిథ్యాప్రజ్ఞానదేవత. అతఁడు నీయందుఁ దన స్వరూపమును ప్రతిష్ఠించికొన్నాఁడు. నీవు జ్ఞాపకము చేసికొనుము. యమబేతాళమంత్రములను నీవు తీవ్రముగా జేసిన యామినీవేళలయందలి చివరి జామున వాఁడు కనిపించును. నీ కనేకములు బోధించును. వారిని నీ వుపాసించుట యారంభించి పాతికయేండ్లైనది. తదుపాసనాఫలము సంభవించు వేళ సమీపించుచున్నది. తత్పూర్వమే నా చెప్పిన పని చేయవలయును. ఈ మువ్వురే నీ సంతానమునకు నిరోధకులు. మూడునెలలు నీ వా మంత్రములను జపింపరాదు. నిజముగా నైదునెలలు జపింపరాదు. గర్భ మేర్పడి శిశువునకు రూప మేర్పడువఱకు నీ వా మంత్రములను మానివేసినచోఁ దరువాత నాల్గు నెలలలోఁ నీకుఁ బురుష సంతానము కలుగును. తరువాత నీ జీవితములోఁ జాల చిత్రవిచిత్రము లైన సన్నివేశములు జరుగును. అవి మార్పరాదు. ఈ సంతానయోగమును దప్పదు. ఈనాఁడు మొదలు పదినెలలలోపల నీకుఁ గుమారుఁడు కలుగును. అతఁడీ రాజ్యమునఁ బుట్టఁడు. మఱియొక రాజ్యమున నుదయించును. నన్ను పొమ్మన్నచోఁ బోదును. ఉండుమన్నచో నుందును. నీవు వెదకుచున్న యా రెండవవాఁ డెవఁడో చెప్పినచో వానిని వెదకి తీసికొనివత్తును. ఈమాట నేను పాఱిపోవుటకుఁ జెప్పుటలేదు.

మిహి: నీ జ్యోతిషము నిజము కానిచో నేను నిన్ను వధింతును. అంతవఱకు నిన్ను నా చెఱసాలలో నుంతును.

బ్రాహ్మ: నిజమైనను వధింతువు. వలసినచోఁ బదినెల లైనతరువాత వత్తును. కానిచో నా రెండవవానిపేరు చెప్పినచో వానిని వెదకి వాఁడు దొరికిన తరువాత నిద్దఱమును వత్తుము.

మిహిరకులుఁడు ప్రతి సమాధానము లేకుండ రాజసౌధములోనికి వెడలిపోయెను. ఆ బ్రాహ్మణుఁడు వెడలిపోయెను. మిహిరకులుఁ డారాత్రి తన రెండుమంత్రములను దీవ్రముగా నుపాసించెను. ప్రొద్దుపోయి పండుకొనెను. తెలవారుజామున నతనికి స్వప్నములో మిథ్యాప్రజ్ఞానదేవత కనిపించెను. ఇట్లు చెప్పెను. 'అయిదునెలలు నీవు యమబేతాళమంత్రములు చేసి ప్రయోజనము లేదు.'

తెలవారినతరువాత మిహిరుఁ డా బ్రాహ్మణునికొఱకు వెదకించెను. ఆయన తనంతట తానే మధ్యాహ్నవేళ వచ్చెను. వచ్చుచునే మంత్రముపదేశించెను. మఱియు నిట్లు చెప్పెను. 'ఈ యైదునెలలు నీ వొక్కవ్యక్తి నిగూఢ సంహరింపరాదు. మాంస భోజనమును చేయరాదు. ఈ అయిదునెలలలో నీ ఒక శివాలయము నిర్మింపవలయును. నేను వెడలిపోవుచున్నాను. పదినెల లయినతరువాత వత్తును. నీచేత వెదకబడుచున్న రెండవవాఁ డెవఁడో నాతో నపుడు చెప్పుము.'— బ్రాహ్మణుఁడు వెడలిపోవుచుండెను. మిహిరకులుఁడు కన్ను లప్పగించి కూర్చుండెను. కల్యాణవతీదేవి పూర్వము పలుసార్లు భర్తతో నీహింసలు మానవలసిన దనిచెప్పగా నెంచినది. చెప్పుట కుద్యమించినది. కాని చెప్పుట సాధ్యపడలేదు. వారి పడకగది కెడమవైపున స్నానములాడుగది యుండును. అందులో తెల్లవారులు వేన్నీళ్ళు కాచఁబడుచుండును. కుడివైపున మఱియొక గది యుండును. అది పూజాగృహము. పూజాగృహమును గాదు. జపము చేసికొను ప్రదేశము. ఒక చిఱుతపులిచర్మము, నొక పులిచర్మము, నొక యెలుఁగుబంటిచర్మము నందులోఁ బఱచఁబడియుండును. కల్యాణవతి గదిలో నుండగా రాజు వచ్చును. ఆమె తన భక్తిని బ్రదర్శించును. ఇంతలో రాజు శృంగారప్రియుఁ డగును. ఆమె చెప్పఁ దలంచుకొన్న మాట మఱచిపోవును. రాజు ప్రొద్దుననే లేచిపోవును. అందుచేత నామె రాజుకంటె ముందు తానే గదిలో నుండుట చేతఁ జెప్పుట సాధ్యమగుటలే దని రాజు వచ్చిన తరువాతఁ గొంతసేపాగి వెళ్ళినచో నతఁడు మంచముమీఁద విశ్రమించి యుండును. గాన తాను తన భావములు చెప్ప వచ్చునని కొన్నిసారు లాలస్యముగా వెళ్లెను. సమయములయందెల్ల నతఁడు రాణి లేక పోవుటను జూచి స్నానము చేసి ధ్యానపు గదిలో జపము చేయుచుండును. ఆ జపము జపము తెల్లవారులును జేయుచునే యుండును. ఈమె మేల్కొని కూర్చుండలేక నిద్రించును. ఒకప్పు డామె నిదుర నాపికొని యతఁడు కనులు దెఱచిన తరువాతఁ దనరుఁ దోఁచినమాటలు చెప్పవలయు నని యట్లే కూర్చుండును కొంతసేపునకామెకు భయము వేసెను. భర్తయొక్క మొగము మాఱిపోవుచుండెను. అతఁడు కన్నులు తెరచెను. అవి కన్నులుకావు. చంద్రనిప్పులు. తైలసంస్కృతములై నడిమికిఁ బాయ తీసి వెనుకముడి వేసిన రాజుమూర్ధజములు స్నానముచేతఁ దడసినను జుంజురువెండ్రుకలుగా కనిపింప నారంభించెను. అతని మొగమున కోఱలు కనిపించెను. అతని హస్తములందలి నఖములు దీర్ఘములై వాడి కలవై యుండెను. మఱియొక్కర్తుక యైనచోఁ గెవ్వున కేక పెట్టి మూర్ఛ పడిపోయియుండును ఆమె వీరదుహిత, వీరభార్య, వీరవనిత. తాను వీరమాత కావలయును. సహజముగా నామె ధైర్యవతి. ఆ కూర్చున్నది పెనిమిటి యని తెలియును. ఆమెకుఁ దెలియనిచోట, నేకాంతముగా నున్నచోట నిట్టిమూర్తి కనపించినచో డాలును ఖడ్గమును బూని యా రక్షోవిగ్రహము మీఁదికి దూఁకి యుండును. ఆమె కప్పు డేమిచేయవలయునో

(మిగతా 43 వ పేజీలో)

ప్రభుత్వ నిర్ణయాలు

* నాలుగవ పంచవర్ష ప్రణాళికాకాలంలో మొత్తం రూ. 22.5 కోట్ల ఖర్చుతో 2000 రక్షిత మంచినీటి సరఫరా పథకాలను చేపట్టే బృహత్తర ప్రణాళికను ప్రభుత్వం రూపొందించినది. యీ ప్రణాళిక అమలుకు అంచనాల తయారీలకై అవసరమైన సిబ్బందినికూడ ప్రభుత్వం మంజూరుచేస్తున్నది.

* విద్యాసంస్థలలో ప్రవేశాలకు, ఉద్యోగనియామకాలాలలో షెడ్యూలుజాతుల వారి రిజర్వేషన్ కేటాయింపును 3 శాతంనుంచి 4 శాతానికి పెంచడానికి నిర్ణయించారు.

* సముచిత సమన్వయానికి వీలుగా జిల్లా ప్రణాళికాధికారులను జిల్లా పరిషత్తుల అధ్వర్యంలోకి మార్చడానికీ, నాల్గువ ప్రణాళికలో ప్రాంతీయప్రణాళికలకై రూ. 125 కోట్లు కేటాయించడానికీ నిశ్చయించారు.

* నాగార్జున ప్రాజెక్టుప్రాంతంలో యాత్రికుల ఉపయోగార్థం 2 లేక 3 హైపవర్ కార్లను కొనుగోలు చేయాలని నిశ్చయించారు.

(42 వ పేజీ తరువాయి)

తెలియలేదు. తరువాత నీ విట్టి హింసలు చేయవల దని తాను పతికిఁ జెప్పవలయు నన్న సంగతి యుపసంహరించెను.

ఆమెకుఁ క్రమక్రమముగా నతఁడు యముఁడో, బేతాళుఁడో మఱి యెవ్వఁడో రాక్షసుఁడో యయియుండు నన్న నిశ్చయము కలిగినది. అతఁడు చేసెడి క్రూర హింసలకు సమన్వయము కలిగినది. ఈ జగమ్మున నుదయించు జీవులలోఁ బూర్వులయం దెవ్వఁ డెట్టివాఁడో యెవ్వరికిఁ దెలియును. ఈ జన్మలో మనకు వాఁడు భర్త యగుట తటస్థించెను. పూర్వజన్మలో బహుపాపకృత్యములుచేసిన యొక తాటక యొకనికిఁ దల్లిగా జన్మించును. ఎవఁ డేమి చేయఁగలఁడు? రావణుఁడు పరమరాక్షసుఁడు. కాని మండోదరి పతివ్రత. హిరణ్యకశిపుఁడు పరమరాక్షసుఁడు. లీలావతి పరమపతివ్రత. ఈ జన్మకుఁ దా నొకని భార్య; అతఁడు భర్త. పరమేశ్వరుఁడు జనులయొక్క కర్మలను ముద్దలుముద్దలుగాఁ జేసి యొక్కొక్కముద్దయొక్క యనుభవము నొకజన్మకు వేర్పరచి నట్లున్నది. ఆ జన్మలో నీ కదే ధర్మము. ఆ తాటకయే యప్పుడు తల్లి. ఆ హిరణ్యకశిపుఁడే భర్త.

ఇట్లు నిర్ణయించుకొనిన కల్యాణవతీదేవియందుఁ దరువాతఁ దరువాత మిహిరకులునకుఁ దొలినాటి ప్రేమ కనిపింపలేదు. ఆమెమనసులోని శరజ్జ్యోత్స్నావిలాసములు కనిపింపలేదు. కుందకుసుమపరిమళభరిత నవసమీరకుమార సంచాలనములు కనిపింపలేదు. ఇంటికి దొడ్డివైపున గుమ్మము నానుకొని ప్రవహించు సెలయేటి యవతళించిన సన్నని తుప్పర లెగురుట కనిపింపలేదు. ఇప్పుడు తన భార్య పరమసాధువు. పరమవినయవతి, చమత్కారముగాఁగూడ మాటాడదు. రెండు నెలలకు నామె గర్భవతి యని తెలిసెను.

(సశేషం)

నన్నపార్యుని కవితారీతులు

యామిజాల పద్మనాభస్వామి

'యో గోశతం కనకశృంగమయం
దదాతి
విప్రాయ వేదవిదుషేచ బహుశ్రుతాయ
పుణ్యాం చ భారతకథాం శృణుయాచ్చ నిత్యం
తుల్యం ఫలం భవతి తస్య చతస్య చైవ' –
ఆదిపర్వణి ద్వితీయాధ్యాయే శ్లో॥ ౩౮౫

'అమల సువర్ణశృంగఖురమై
కపిలంబగు గోశతంబు ను
త్తమ బహువేద విప్రులకు
దానముసేసిన తత్ఫలంబు త
థ్యమ సమకూరు భారత క
థాశ్రవణాభిరతిన్ (మదీయ చి
త్తము సనిశంబు భారత క
థా శ్రవణ ప్రవణంబు కావునన్)
ఆదిపర్వము ప్రథమాశ్వాసము ౧౫

శృంగాలకు బంగారురేకులు పొదిగిన నూరు గోవులను వేదవిద్వాంసుడు, బహుశ్రుతుడు అయిన బ్రాహ్మణునకు దానం చేసినవానికిన్నీ, నిత్యమూ పుణ్యమైన భారత కథను వినేవానికిన్నీ సమానమైన ఫలం సమకూడుతుంది. అని శ్లోకం చెప్తొంది. దీనికి నన్నపార్యుని అనువాదం పైన యిచ్చిన పద్యం. అనువాదంలో డెక్కలకుకూడా బంగారు పొదిగాడు నన్నపార్యుడు. పైగా కపిలగోవులశతం ఇదొక విశిష్ట విశేషణం. పైగా కపిలగోవు వేదమూర్తి అని పెద్దలుచెప్తారు. అదివున్న యింట పావిత్ర్యానికి వెల్తి వుండదు. సర్వపాపాఘ్ని అని పరంపరా శ్రుతి. దీనినే వేమన 'గంగిగోవుపాలు గంటెడైనను చాలు' అని అన్నాడు. స్వయంగా పావని కపిల గోవు. దాని కొమ్ములూ, డెక్కలూ సువర్ణమయాలు అయినప్పుడు ఉత్తమోత్తమత్వం అబ్బినట్టు. కనక –

'సువర్ణ శృంగ ఖురమై
కపిలం బగు గోశతంబు' – అన్నాడు నన్యపార్యుడు. లోహాలలో ఉత్తమం సువర్ణం. గోవులలో ఉత్తమం కపిల గోవు. రెంటి సంయోగం ఉత్తమోత్తమత్వానికి లక్ష్యం.

కొమ్ములూ, డెక్కలూ అపాయకరాలు. మిగిలిన శరీర మంతా చర్మమయం. అది కపిల వర్ణంలో (గోధుమ వన్నె) పవిత్రమూ, ఆకర్షణమున్నూ అయి వుంది. అపాయకరములైన కొమ్ములూ, డెక్కలూ బంగారు పొదిగినవి కాగా ఉత్తమత్వాన్ని పొంది కపిల గోవును ఆపాద శృంగం ఉత్తమ ప్రకృతిని చేస్తున్నాయి. డెక్కలు అలంకార విహీనములుగా వుండడం ఆ జతువుకి ఏదో రమణీయత లోపించినట్టుగా దృశ్యమాన మవుతుంది. కనక డెక్కలకు కూడా నన్నపార్యుడు బంగారు పొదిగాడు. దీనిలో పద్యం మెరుగెక్కింది. లోకోత్తర కవితారీతి నన్నయలో యీ విధంగా దర్శన మిస్తూవుంటుంది.

పద్యంలో సువర్ణ విశేషణమైన 'అమల' పదంకూడా సముచితమైనదే అని నా అభిప్రాయం. 'మూలంలో లేనివి యిలాటి విశేషణాలు శబ్దశ్రవణసౌకుమార్యంకోసం నన్నయ వేస్తూవుంటాడు' – అని కొందరు అంటూవుంటారు. కావచ్చు. కాని యిక్కడ 'అమల' అనే విశేషణం వుండవలసిందే.

నీరసమైన బంగారంతో పైన పూత పూసినట్టు అలంకరించి దానంచేసే పక్షంలో ఉదాత్తమైన ఫలం సిద్ధించదు. అది

'అభానే శాలి చూర్ణంవా'– అనే స్థితికి దిగజారుతుంది. అలా కాకుండా చేసే దానం త్రికరణశుద్ధిగా చెయ్యవలెనని నన్నపార్యుని వుద్దేశం. కనక పుటంపెట్టిన బంగారురేకునే కొమ్ములకూ, గిట్టలకూ తొడిగా డాయన – కక్కుర్తిపక్షం పనికిరాదని ఆయన వుద్దేశం. బంగారంలాగా కనిపించేట్టు వెట్టిగా ఏదో మసిపూసి మారేడుకాయ చెయ్యడం నాటికీ నేటికీ సంఘజీవితంలో వుంటూనే వుంది. అలాటి విధి పనికిరాదని సువర్ణానికి 'అమల' అనే విశేషణం తృప్తిగా ఘటించాడు.

కపిలగోవుని గూర్చికూడా ఆయన ఉద్దేశం అదే. 'ఇంటికి జ్యేష్ఠా! పొరుగుకి శ్రీ మహాలక్ష్మి'గా వుండే ఆవులు కొన్ని వుంటాయి. ముందుకి వెళ్ళితే పొడవడం, వెనకకు వెళ్ళితే ఫెడీమని తన్నడం వాటి స్వభావం. కొన్ని కరుస్తాయికూడా. కొన్ని ఆవులు ఎగచేపి ఒక్కచుక్కైనా పాలు

ఇవ్వవు. కొన్ని అవే పాలు తాగివేస్తాయి. ఇలాటి గోవులు వదిలిపోతే చాలని చూసే యజమాని వుంటాడు. సమయం వచ్చినప్పుడు పీడ వదలిపోయిం దని పురోహితుడికి నవ్వుతూ ధారపోస్తాడు. అలాటి ఆవు ఉన్న యజమానికీ ఆలాటిగుణమే వుంటుంది. దాని బాధలన్నీ పురోహితుడు అనుభవిస్తాడు ఆనాటినుంచీ. కనక అలాటి దానాలు చెయ్యకూడ దనిన్నీ, సర్వశుభ లక్షణ లక్షితమైన కపిలగోవునే దానం చెయ్యాలనిన్నీ నన్నపార్యుడు మూలాన్ని తన అనువాదంలో విపులీకరించా డని మనం చెప్పుకోవలసివుంటుంది. మూలాన్ని వివరించడం, సందర్భోచితంగా సంగ్రహించడం, మార్చడం, స్వయంగా కొంత కూర్చడం అనువాదం చేసేవారిపై ఉన్న పెద్దబరువు. తనబరువు తాను ఏలాగ మోయాలో బాగా గుర్తించినవా రున్నను భావుడు నన్నయ్య కనక 'అమల' 'కపిలంబు' అనేవి కొత్తగా చేర్చి వ్యాసులవారి హృదయాన్ని తెలుగువారికి ప్రదర్శించి కృతకృత్యుడయాడు. ఊరక వెక్కిరింపుగా తోసి రాజనడం ఎంతవారికేనా అనవచ్చు. దానికి ఎంతో చదవనక్కరలేదు.........

'విప్రాయ వేదవిదుషేచ బహుశ్రుతాయ—' దీనికి 'ఉత్తమ బహువేదవిప్రులకు'— అని అనువాదం.

సాంగంగా త్రయీ విద్యలో వేత్తఅయిన విప్రునకు దానంపట్టే అర్హతవుందని వ్యాసులవారి వుద్దేశం. బహుశ్రుతులు = శ్రుతిస్మృతులు తెలిసిన విద్వాంసులు, వేదవిదులు=అర్థంతో వేదం తెలుసుకొన్నవారు. అలాటివారు ప్రతిగ్రహణవల్ల వచ్చే పాపాన్ని పోగొట్టుకోగలరు. కనక అట్టివారే స్వీకారార్హు లవుతారు.

జందెం వేసుకొన్నంత మాత్రాన బ్రాహ్మణవంశంలో పుట్టడంవల్ల బ్రాహ్మణుడు కానేరడు. కనీసం బ్రహ్మోపదేశం పొందినందుకు త్రిసంధ్యమూ యధావిధిగా దైవోపాసన, గాయత్రీజపం చెయ్యాలి. అది లేనివాడు ప్రతిగ్రహణానికి అనర్హుడు. కనక శ్రుతివేత్తా, బహుశ్రుతుడూ అయివున్న విప్రునకు గోదానం — అని వేదాలను నేర్పరచిన వ్యాసులవారు అన్నారు...... నన్నపార్యుడు 'ఉత్తమ' — అనే విశేషణంతో వ్యాసులవారి హృదయాన్ని ఆవిష్కరించారు. 'విపుల శబ్దశాసనుడు' అని అనుకొన్నా డంటే వూరకే అనుకొన్నాడా? ఏదో వ్యాకరణం తెలుగుకి వ్రాశా డన్నంతమాత్రాన 'శబ్దశాసనత్వం' పట్టించడం కన్న యీలాగ శబ్దాలను, మూలాన్ని ఆవిష్కరిస్తూ తాను తెలుగులో చేరుస్తూ వుండడంమూలాన ఆయనమాట సార్థకం అవుతుందని నే ననుకుంటున్నాను.

ఒకరు 'బహువేది విప్రులకు' అని వుంటుందేమో అని అన్నారు. 'బహువేది విప్రులు' అంటే చాలా తెలిసిన విప్రులు అని అర్థం వస్తుంది. కాని వేదవిదులైన విప్రులు అనే అర్థం రాదేమో అని నాశంక.

అన్నీ తెలిసినాక 'ఉత్తమ' పదం ఎందుకు? అని ఒకశంక. బాగానేవుంది. దానికి నే నిలా చెప్పాను.

అన్నీ తెలిసినవారే అఘాయిత్యం పనులు చెయ్యవచ్చు. అలాటివారు ఉత్తముల కోవలో చేరరు. కనక వేదవేత్తలు, బహుశ్రుతులు అయిన ఉత్తములు సన్మార్గగాములు అయిన విప్రులు — అని......

సామాన్యంగా నన్నపార్యుని అనువాదంలో అక్కరలేని పదా లుండవనే పెద్దలు అంటారు. ఆ మార్గాన పోయి బుద్ధికి అందినంతవరకూ మంచి అర్థాన్ని తీసుకోడం మన పని. అక్కరలేదనే ఏదివాదంతో విమర్శకి లంకించుకుంటే వాల్మీకి మహాముని రామాయణానికి కూడా అపార్థత్వాన్ని, అసంగతత్వాన్ని ఆపాదించి ఆనందించవచ్చు. అలా చేయడం వివేకిలక్షణం కాదు.

భారతమే ఎందుకు తెనిగించాలి? ఆది కావ్యమైన రామాయణాన్ని తెనిగించి కీర్తిప్రతిష్ఠలు సంపాదించుకోవచ్చునుకదా? అనే దానికి తావు లేకుండా యీ పద్యం నన్నపార్యుడు కృతిపతితోటి పలికించాడు.

అమల సువర్ణ శృంగ ఖురమూ, కపిలమూ అయిన గోశతము ఉత్తమ బహువేద విప్రులకు దానము చేసినందువల్ల వచ్చే ఫలము నిత్యమూ భారత కథను వినేవాడికి వస్తుంది. తన మనస్సు భారతకథా శ్రవణ ప్రవణంబు అయింది కనక —

'భారత బద్ధ నిరూపితార్థ మేర్పడ
తెనుగున రచియింపు మదికథాయుక్తి
మెయిన్' —

అని రాజనరేంద్రుడు కోరుకోడం ఎంతైనా సమంజస మయిన కోరిక. ఇక్కడికి యీ హేతువుతో తృప్తి పొందుదము. ఇక.

భారత బద్ధ నిరూపితార్థము ఏర్పడగా తెనుగున రచియించమన్నాడు.

భారతంలో వ్యాసులవారు చెప్పిన విషయాన్ని వివరించి చెప్పమన్నాడు.

భారతంవల్ల తెలియవలసేది వేద ప్రతిపాదితమైన ధర్మం. ఆ ధర్మం భారతకథలో నాయక ప్రతినాయకులైన ధర్మజ దుర్యోధనులవల్ల తెలుసుకోవలసి వుంది. ఈ పక్షంలో ధర్మం ఆపక్షంలో అధర్మం స్ఫుటంగా కానవస్తూంటాయి. ధర్మాధర్ములకు జరిగిన బెట్టిదమైన పోరాటం తెలిపే యితిహాసం జయేతిహాసం. అదే భారతం. దానిని ఉపాఖ్యానా లన్నీ పోషించాయి. కాగా

మహాకావ్యం అయింది. దాని అర్థాన్ని విడమరచి చెప్పమన్నాడు రాజనరేంద్రుడు. ఆ విధంగా చెప్తానన్నాడు విపుల శబ్దశాసనుడు.

భారతం తెలుగులో చెప్పడానికి వేదవ్యాసుడంతవాడు కాకపోయినా ఉత్తమ బహువేద విప్రుడైనా అయితే గాని సాధ్యం కాదు. ఆ గుణాలు నన్నపార్యుని యందు వున్నాయని రాజనరేంద్రుని ప్రగాఢ విశ్వాసం. కనకనే ఆయననే చెప్పమని ప్రాధేయపడ్డాడు.

'అధిక ధీయుక్తి మెయిన్' — సర్వసామాన్యంగా గణ యతి ప్రాస లక్షణాలు తెలిసేపాటికే నాలుగు పద్యాలు అల్లి పారవేసేవాడు అయితే భారతబద్ధ నిరూపితార్థం చెప్పలేడు. అధిక ధీయుక్తి చాలా అవసరం. మరియు పదానికి నన్నయ ఎంతవరకూ తగినవాడో తెలుసుకొనే పూచీ మనమీద ఉంది.

'జనమేజయః పారిక్షితః సహ భ్రాతృభిః కురుక్షేత్రే దీర్ఘ సత్రముపాస్తే— తృ॥ అ॥ ప్రారంభగద్య — దీనికి నన్నపార్యుని అనువాదం — యీ క్రిందిపద్యం:—

'ప్రతిహతశత్రు విక్రముడు
పాండవవంశ వివర్ధనుండు సు
వ్రతుడు పరాహి తాత్మజుడు
అవద్య విదూరు డుదారకీర్తిని
ర్మిత వివిధాధ్వరుండు జన
మేజయుడన్ జనపాలు డుత్తమ
స్తుతమతి దీర్ఘసత్ర మజి
తుం దొనరించె శుభాభికాంక్షియై.
(ఆదిపర్వం. ప్ర. ఆ పద్యం 83)

మూలం ఇంత విస్తృత విశేషణం కాదు. జనమేజయునకు తెనుగులో ఇన్ని విశేషణాలు వున్నాయి. పదాలు వచ్చునని యిన్ని వెయ్యడం జరిగిందా? యిందులో ఏదేనా చెప్పుకోవలసే విశేషం వుందా? విశేషమే వుంది. పదాలు వచ్చునని విశేషణాలు నన్నయవంటి అతిలోక ప్రతిభాయుతుడు వేస్తే విశేషం ఏముంది?

జనమేజయుడు పాండవవంశ వివర్ధనుడు. ఊరకే వ్రాస్తే అవుతాడా? ఘటోత్కచుడు పాండవవంశ వివర్ధనుడు అవుతాడా? కానేరడు. తండ్రిని, తాత ముత్తాతలనూ పోలి అన్ని క్షత్రియగుణాలూ కలవాడు జనమేజయుడు. కనకనే వైశంపాయనుడు వచ్చి పూర్వీకుల చరిత్ర అంతా చెప్పవలసివచ్చింది.

'శుభాభికాంక్షి' అయి దీర్ఘసత్రం చేశాడు. తనకూ రాష్ట్రానికీ కూడా ఏలాటి అనిమిత్తానిమ ఛాయలూ వుండకూడదు. అలాటి వానికికూడా తమ్ములు చేసిన అక్రమచర్య వల్ల సరమా శాపం తగిలింది.

ఆనేక యజ్ఞాలు అంతకుముందే చేశాడు. ఉదారమైనకీర్తి తెచ్చుకున్నాడు. పగ తలెత్తకుండా అతి భయంకరంగా పరాక్రమించినవాడు. ఏ విధంగానూ ఏకోశానా తప్పటాలో చన లేనివాడు. సజ్జనులందరూ మా మంచి బుద్ధిమంతు డని స్తుతిస్తున్నారు. అతని యజ్ఞానికి ఏ విధంగానూ విఘ్నం జరగడానికి అవకాశం లేదు. ఆది రాజుల మార్గాన నడచే స్వభావంకల మంచి రాజు కనక పాండవవంశ వర్ధను డయాడు. పెద్దవాళ్ళవల్ల తెలిసో, తెలియకో తప్పులు జరిగిపోతే తరువాత వచ్చినవాళ్లు ఆ తప్పులకు విరుగుడు చూసుకుంటారు. దానివల్ల ప్రత్యవాయం తొలగిపోతుంది. ఆ బుద్ధితో దీర్ఘసత్రం ఆరంభించి చేశాడు. తాతముత్తాతల వల్ల భూమి హతక్షత్రియం అయింది. కోట్లకొద్దీ ప్రాణుల బలి ఘోరంగా రణభూమికి జరిగిపోయింది. తండ్రి ఆట్టేకాలం బ్రతకలేదు. ఆ బ్రతికిన కాస్త బ్రతుకులో బ్రాహ్మణశాపానికి గురి అయి తక్షక విషాగ్నికీలల్లో సమిధ అయిపోయాడు. యీ యావత్తు పాపమూ పటాపంచలు కావాలి. వంశం పునీతం అవాలి. ఇలాటి సద్బుద్ధితో అందర్నీ కూడగట్టుకుని, ఎదిరించిన వాళ్ళని రాష్ట్ర క్షేమంకోసం అణచివేసి సర్వవిధ పాపక్షయార్థం యజ్ఞాలు ఎన్నో చేశాడు. ఆ విధంగా అందరినోటా మంచివాడనిపించుకున్నాడు.

ఇలా వ్యాఖ్యానించాలంటే యీ పద్యానికి చాలా వ్రాయవచ్చు. అధిక ధీయుక్తి అని రాజనరేంద్రుడు నన్నయగారిని కోరినందుకు ఒక విధంగా ప్రశంసించినందుకూ యీ పద్యం యీ వ్యాసానికి చాలు నని వుదాహరించాను.

ఏ ఘట్టం తీసుకున్నా మూలాన్ని వదలినట్టు కనిపించదు. అయితే స్వాతంత్ర్యం చూపకుండా, అర్థానికి మెరుగులు పెట్టకుండా నన్నపార్యుడు గంటం నడపలేదనే చెప్పవలసివుంది. మూలాన్ని కేవలం త్రోసివేసిన సంధర్భా లున్నాయి. ఒకటి రెండు పదాలు మార్చి తక్కినదంతా ఆలాగే తెనిగించిన పట్లు వున్నాయి. యథాతథంగా పదాలు వేసిన చోట్లు ఉన్నాయి. ఆ పరిభాషలకు అలాగే వాడిన పోకడలు న్నాయి. మూలం పలికిన మహానుభావు డొక మహర్షి; తెనిగించిన మహాకవి మహర్షి కల్పుడు. కనక యిద్దరినీ అర్థం చేసుకుని భారత ఘట్టాలు చదువుకొని కృతార్థులం కావలసి ఉంటుంది. ఆ యా ఘట్టాలులో అనువాదాల తేమతియ్యాలు ఇంకొకమారు

సీరియల్ నవల

4



జరిగిన కథ

డాక్టరు కనకంగారికి ప్రతినెలా పాతిక – ముప్పయి రూపాయిల ఆదాయానికి కారణమైన దీర్ఘరోగులు ఇద్దరువున్నారు. అదేసంపాదన ఆయనది. అంతకన్నా ఎక్కువ ఆయన ఆశించడు. ఆశించినా జనం అటువైపు తొంగిచూడ నన్నా చూడరు ఆయన హస్తవాసి మంచిదైతే కావచ్చుకానీ, బలవంతంగా రోగులమీద సాహిత్యాన్ని రుద్దడానికి ఆయనచేసే ప్రయత్నం ఆయనమీదే ఎదురు కొడుతున్నదేమో! చివరకు ఒకరోజు మందుతో రోగయి, ఆయన ప్రభావానికి లోబడిపోయిన వ్యక్తి ఒకతను దొరికాడు. డాక్టరుగారి కోరికవల్ల ఆ యింట్లోని ఓ గదిలోకి అద్దెదారుడుగా ప్రవేశించాడు. ఆ యింటివాళ్ళమ్మాయి నర్సు అభిమానపు చూపులమధ్య చిక్కుకున్నాడు. ఆతర్వాత అతనంటాడు గదా —

రాత్రి పదిన్నర దాటింది. ఎవరమూ నిద్రపోయే ప్రయత్నంలో లేం. నర్సు వేసుకువచ్చిన నగలూ, కొట్టుకొచ్చిన చీరా ఒక కుప్పగా పెట్టిఉన్నాయి. నర్సు పసుపూ పారాణీ పోవటానికి సగం నబ్బు ఖర్చు చేసిందిగాని వాటిఛాయ లింకా కాళ్ళకుండనే ఉన్నాయి.

జట్కాలో ఎక్కి నేను వేసుకున్న ప్రశ్నలకు డాక్టరుగారు ఒక రకం సమాధానం చె[illegible]డు.

"మనం సంకేతాలను పట్టుకుని బతుకుతాం. భగవంతుడిపై భారం వేసినవాళ్ళకి ఒక గుడో, అందులో ఉండే విగ్రహమో, ఒక పటమో సంకేతం. అట్లాగే మతానికీ, కళలకీ, ప్రేమకీ, దేశభక్తికీ, ఆధునికత్వానికీ, సనాతనత్వానికీ, స్వేచ్ఛకూ, జాతీయతకూ – ప్రతిదానికీ సంకేతా ఉన్నాయి. చాలా మందికి సంకేతాలను గుర్తించటమే తెలుసు. వాటి వెనక ఉండే అసలుసంగతి గురించి ఏమీ తెలియకపోవచ్చు. మా నాన్నకు ఒక సంకేతం కావాలి – తనకూ ఒక హృదయమూ, ఆత్మీయుల పట్ల ప్రేమా ఉన్నట్టు దాఖలా కావాలి. ఆ సంకేతం తన వ్యక్తిత్వానికి హానికరంగా ఉండరాదు. అందుచేత నేను పనికిరాను, నా కూతురు పనికి వస్తుంది. మా అమ్మ నగలన్నీ మనవరాలి కివ్వటం ఒక జెశ్చర్. నటుడు ప్రేక్షకుల చప్పట్లు ఆశించి చేసే అభినయం వంటిది; నేనాయనను తప్పు పట్టటంలేదు. మనందరమూ అటువంటి సింబల్స్‌తోనే. అటువంటి అభినయాలతోనే తృప్తిపడి జీవిస్తున్నాం. సంకేతాల వెనక ఉండే వాస్తవ విషయాన్ని అర్థం చేసుకున్నవాణ్ణి సాధారణంగా లోకం అర్థం చేసుకోదు. డబ్బు తీసుకో. అది మనిషియొక్క కొనుగోలు శక్తికి సంకేతం. లోకం ఆ సంకేతాన్ని చూసి హర్షించినట్టుగా కొనుగోలును చూసి సంతోషించదు. వస్తువులను వినియోగానికి కొనుక్కునేవాడు మామూలు మనిషి. మారు బేరానికి కొని కొనుగోలు శక్తిని పెంచుకునేవాడు ఆ మామూలు మనిషి. గొప్పవాడు!"

డాక్టరుగారు చెప్పేది నిజమే కావచ్చుగాని, మనిషి హృదయం మహాసముద్రం లాటిది. అందులో ఏ క్షణాన ఏ విధమైన కల్లోలం చెలరేగేదీ ఎవరూ చెప్పలేరు. ముసలాయనతనయౌవ్వనమూ, కౌమారమూ వృత్తిలో మునిగిపోయాడు. ఆ తరవాత ప్రేమించ దగిన భార్యనూ, కొడుకునూ పోగొట్టుకున్నాడు. ప్రేమానురాగాలలో మునిగి తేలే వార్థక్య దశలో మనవరాలు కనిపించింది. ఆమె పట్ల తనకు గల ప్రేమను తనకు చాతనైన విధంగా ప్రదర్శించే అవకాశం కోసం ఆయన తహతహలాడుతూ ఉండవచ్చు. ఒకప్పుడు కొడుకు వితంతువును పెళ్ళాడితే క్షమించలేకపోయిన వాడు, రేపు తన మనవరాలు ఏ అస్పృశ్యుణ్ణో పెళ్ళాడినా క్షమించవచ్చు ... డబ్బు దాహమూ, కామేచ్ఛా, మనిషివాపీ సరయిన తరుణంలో తీరకపోతే దయ్యాలల్లే పట్టుకుని పీడిస్తాయని డాక్టరుగారే ఎప్పుడో అన్నాడు. ముసలాయనకు మనిషివాపి పట్టుకున్నది.

"రేపు వీటన్నిటినీ తీసుకుపోయి ఆయనకిచ్చేసే డ్యూటీ నీదీ!" అన్నాడు డాక్టరుగారు.

కొడవటిగంటి కుటుంబరావు


"నేనెట్లాగూ అక్కడికి రేపు వెళ్ళక తప్పదు. ముహూర్తానిక్కూడా ఉండకుండా వచ్చేశాను" అన్నాను.

అదీ ఇదీ మాట్లాడుకుని పదకొండు దాటాక ఎవరి దారిన వాళ్ళం పడుకుని నిద్రపోయాం. నిద్రలోకూడా నా మెదడులో నర్సు అవతారం కళ్యాణం బొట్టుతో సహా ఏమూలో మెదులుతూనే ఉన్నది. ఆమె కళ్యాణంబొట్టు పెట్టుకోవటం అదే మొదటి సారీ, చివరిసారీ అని నే నప్పు డెరగను.

మర్నాడు నిద్ర లేస్తూనే స్నానం చేసేసి, నగలూ చీరా మూటగట్టుకుని అగ్రహారం వెళ్ళాను. మూటను ముసలాయనముందు పెట్టి. "పంతులుగారూ, ఇవిగో మీ నగలూ అవీనూ. అన్నీ సరిగా ఉన్నాయో లేదో చూసుకోండి" అన్నాను.

ముసలాయిన నామీద విరుచుకు పడ్డాడు. నీవు చూస్తే పెద్ద రోగ్‌లా గున్నావే. నిన్నరాత్రి నా మనవరాలిని నాతో చెప్ప కుండా తీసుకెళ్ళిపోయావు. పోలీసు రిపోర్టి ద్దామనుకున్నాను — విత్ ఫోర్ డిఫరెంట్ చార్జెస్! ఇప్పుడు పిల్లలేకుండా నగలు తెచ్చిస్తావా? పిల్లనేం చేశావు?" అని ఆయన చిందులు తొక్కాడు.

"నేనేం చేస్తానండీ? ఉండనంటే ఉండ నని తొందర చేసింది. ముహూర్తానిక్కూడా ఉండకుండా నేను బయలుదేరి ఆమె నింటి



దగ్గిర చేర్పవలి సొచ్చింది. నాకు లేనిపోని బాధ్యత మీరే అంటగట్టారు. ఆ పిల్లకా నగలన్నీ తొడగమని నేను మిమ్మల్ని కోరానా?" అన్నాను.

"నా పిల్లకు నేను పెట్టుకుంటాను, కోరటానికీ మానటానికీ నువ్వెవడవ్?"

"నిజమే అనుకోండి. అయినా ఆ పిల్ల ఆ నగలతో ఒంటరిగా అరండల్‌పేటకు బయల్దేరుతుంటే నేను, సరే వెళ్ళిరమ్మని ఎట్లా అననూ. పిల్లను నా వెంట తెచ్చినప్పుడామెను తిరిగి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించే పూచీ నాదేగా? మీ రామెను తీసుకురమ్మని రిక్వెస్ట్ చెయ్యకపోతే — రిక్వెస్టేమిటి? బెగ్ చెయ్యకపోతే — ఒక్కణ్ణీ వచ్చేవాణ్ణి, నిక్షేపంగా పెళ్ళితంతంతా చూసేవాణ్ణి. నా యిష్టం వచ్చినప్పుడు వెళ్ళిపోయేవాణ్ణి. నాకు అప్నం దాలా అన్యాయం చేశారు మీరు," అన్నాను.

"అయిందేదో అయింది. ఈ నగలన్నీ ఎందుకు తీసుకొచ్చేశావ్? వాటిని నేను పిల్లదానికిచ్చేసుకున్నాను. అవి దానివే." అన్నాడాయన.



"వాళ్లు మాకొద్దు మొర్రో అంటుంటే ఏం చెయ్యనూ. మీ కివ్వాలని అంతపట్టుదలగా ఉంటే వాళ్ళకి పార్శెల్ చేసి, ఇన్సూరు చేసి మరీ పంపండి. వాళ్ళేం చేసుకుంటే అది చేసుకుంటారు. పిల్లతోపాటు నగలను తేవటంచేత వాటిని మీకు తిరిగి ఇచ్చేభారం నామీద పడింది."

"వాళ్ళంటావు; వాళ్ళెవరు ? ఎవరు వాళ్లు ? నా మనవరాలు నేను ప్రేమతో ఇచ్చిన నగలు వద్దంటుందా ? ఆడది నగలు వద్దనదు. (నగ లొల్లనినారి కలదె వరికింపంగన్ !) ఆ చాతకాని వాజమ్మ ఓర్చలేక తిప్పి పంపి ఉంటాడు. తాను పెట్టలేడుగా ? ఆ పని నేను చెయ్యగల నని కడుపుమంట."

"ఏమో. అదంతా నాకు తెలీదు. అది మీరూమీరూ తేల్చుకోండి." అన్నాను.

నగలను సర్వే నిరాకరించిం దని ఆ మానవుడితో అనటానికి నాకు భూతదయ అడ్డొచ్చింది. తన మనవరాలికి తనమీద అవగింజ పాటి అభిమానం ఉండి ఉంటుం దని భ్రమ ఉంటే, దాన్ని నే నెందుకు తుడిచెయ్యాలి ?

అయన కొంచెం సేపు యోచించి. "ఒక్క సహాయంచేసిపెట్టు. నా మనవరాలికి ప్రపంచజ్ఞానంలేదు. చిన్నదిగద ! అంచేత తల్లీ తండ్రీ ఈ నగలను తిప్పి పంపమనగానే ఇచ్చేసింది. వాళ్ళు నామీది అక్కస్సుతో నాపైన దానికి ద్వేషంకూడా పుట్టించగలరు. కనక నువేం చేస్తావంటే. పిల్లకు చాటుగా బోధించు. నేను దాన్ని నెత్తిమీది దేవతలాగా చూసుకుంటానని చెప్పు. నేను దాని తాత ననేది దాని మనసులో బాగా ఇంకేటట్టు నూరి పొయ్యి. చూడూ, దానికి డబ్బువిలవ తెలియకపోవచ్చు. నాదగ్గిర పుష్కలంగా డబ్బున్నది. అది రాజాలాగా బతకవచ్చు. రేపు లక్షాధికారిని తెచ్చి పెళ్ళి చేసే తాహతు నాకున్నది. నా కొడుకువల్ల ఏమవుతుంది ? ఏ బిచ్చగాడికో ఇచ్చి చేస్తాడు. వాడు నష్టజాతకుడు. పెద్దమ్మ నెత్తి నెక్కేసరికి నా డబ్బుమీ కాలతన్ని లేచిపోయాడు. నా మనవరాలుకూడా అటువంటి తెలివితక్కువ పనే చేస్తే నాకున్న ఆస్తంతా ఎవరు తినను ? నాదగ్గిర ఇంత డబ్బుండగా నా మనవరాలు దిష్టిబొమ్మలాగా, చీపురుకట్టలాగా ఉండి, ముష్టిదానిలా బతుకుతుంటే నా కెంతబాధగా ఉంటుందో నువే ఆలోచించు. అంచేత దానిబుద్ధి నాకేసిమళ్ళేటట్టు చేసేభారం నీమీద వేస్తున్నాను." అన్నాడు.

"అయ్యా. నాపైన ఏభారమూ వెయ్యకండి. నేను బరువులు మొయ్యగలవాణ్ణి కాను. నా దొక అసనాటుబతుకు. నాభవిష్యత్తు చూసుకోవటమే నాకు చాతకావటంలేదు. మీ అబ్బాయిగారి ధర్మమా అంటూ నాకు కాస్త కాస్త లోకజ్ఞానం కలుగుతున్నది." అన్నాను.

వాడిమొహం ! వాడికి లోకంగురించి ఒకటి తెలిసేదుచునేమిటి నీకు చెప్పటానికి ? యిక జ్ఞానంకావాలంటె నన్నడుగు చెబుతాను. నువ్వింకాచదువుకుంటున్నావుకద. చదువుకో. ఉద్యోగం వగైరాలవిషయంలో నీ కేసమస్య అయినా వస్తే తిన్నగా బెజవాడలో మా యింటికి వచ్చెయ్యి."

అయన ఎంతసేపు మాట్లాడినా నాకు ప్రపంచంగురించి ఏమీ తెలియ లేదు — ఆడదన్న తరవాత నగలవ్యామోహం ఉండి తీరుతుందన్న అనుమానాస్పదమైన సత్యం తప్ప. ఐనా, ఆయనతో నా కెందుకు పేచీ ?

"సరేనండీ. థాంక్స్ ! నా కేదన్నా మంచి సలహా కావలిస్తే ఇంకెక్కడికీ వెళ్ళను. మీదగ్గిరికే వస్తాను !" అన్నాను.

"తప్పకుండా రా. కాని నే చెప్పినది మరవకు. పిల్లమనసులో ఉండే అజ్ఞానాన్ని పోగొట్టేభారం నీదీ !"

"ప్రయత్నిస్తానులెండి." అన్నాను.

అయన్ను వదిలించుకున్నాక నాకు మళ్ళీ కాస్త ఊపిరి ఆడింది. గట్టిగా ఊపిరి తీసుకుంటున్న సమయంలో "అన్నయ్యా," అంటూవచ్చి బాబాయిపిల్లలు నామీద దాడి చేసి తీసుకుపోయి నాకు టిఫిను పెట్టించారు. కాఫీ తాగించారు. తరవాత పెళ్ళికొడుకును పేతుక్కుంటూ వెళ్ళి. వాడి పసుపుబట్టలూ. వెండి యజ్ఞోపవీతమూ తాకి చూసి, "ఏరా. మామయ్యా, పెళ్ళికూతురి మెడలో తాళి గట్టిగా కట్టావా ?" అన్నాను.

"ఏడిశావులే. నువు ఎంత గట్టిగా ముడేస్తావో నేను చూడకపోతానా ?" అన్నాడు శ్రీనివాసుడు.

మా పిన్ని వచ్చి నన్ను చూసి. "విన్నల్లా అటుకేసి రానట్టుందే ? ఏమంత అర్జంటు పనొచ్చిపడిందయ్యా ?" అన్నది.

విన్నరాత్రి ముసలాయన అంతనాటకమాడితే అందులో ప్రముఖపాత్ర వహించిన నన్ను పట్టుకుని ఆవిడ అంతమాటంటుందా ?

"వాడు రాకపోవట మేమి టక్కయ్యా ? ఎవరో పోటిపెళ్ళికూతుర్ని తెచ్చి ఇల్లంతా తిప్పితేను !" అన్నాడు శ్రీనివాసరావు.

"ఎవ రా అమ్మాయి? పెళ్ళి చేసేసుకున్నా వేమిటి ? నీకోసం రత్నంలాంటి పిల్లను చూసి ఉంచాను. సరేనంటివా రేపే ముహూర్తం పెట్టిస్తా నేమనుకున్నావో !" అన్నది పిన్ని.

"ఉండనీ; పోనీమాకు, ఇంకో నాలుగైదేళ్ళలో ఎట్లాగూ పెళ్ళి చేసుకుతీరుతాను." అన్నాను.

"ఆఁ హాఁ ! ఇంతోటి మొగుడు దొరకదని నీకోసం ఏళ్ళతరబడి కనిపెట్టుక్కూచుంటుంది కాదూ ?" అన్నది పిన్ని హేళనగా.

పిల్లవాడు పిల్లవెంటపడితే వరహీనం, పిన్నీ. అయినా పిల్ల నిజంగా బాగుంటే హీనం కావటానిక్కూడా ఒప్పుకుంటాను. ఏంచేస్తాం ?" అన్నాను.

"అమాటన్నావు బాగుంది. రా నావెంట," అంటూ పిన్ని నన్ను వెంటబెట్టుకుని వరండాలోకి వచ్చి. "అదుగో !" అన్నది ఒక పక్షాలుగు, పదిహేనేళ్ళపిల్లను చూపించి. ఆ పిల్ల భాగ్యవంతులపిల్ల అని తెలుస్తూనే ఉన్నది. పట్టుపావడ కట్టి. వలచని వోణీ

(మిగితా ౬౬ పేజీలో)



అనంతపురం జిల్లా

మేలురకం జొన్నలు :

నాలుగువందల డెబ్భై కిలోల మేలురకం జొన్నలు. 70 కిలోల మేలురకం కొర్రలు, 1270 కిలోల ప్రత్తి విత్తనాలను (హెచ్. 20) మేనెలలో రాయదుర్గ పంచాయతీ సమితిలో పంపిణీ చేసారు.

కడప జిల్లా

చేతిపనివారల శిక్షణ శిబిరం :

జూన్ 9వ తేదీన జమ్మలమడుగులో మూడు రోజులపాటు జరిగే చేతిపనివారల శిక్షణశిబిరానికి, ఎకాయ్ కార్యక్రమంపై ఒకసదస్సుకు ప్రారంభోత్సవం జరిగింది.

గుంటూరు జిల్లా

శిక్షణ శిబిరం :

ప్రత్తిపాడు పంచాయతీ సమితికి చెందిన తుర్లపాడులో మూడు రోజులపాటు గ్రామ సహాయకుల శిక్షణ శిబిరం నిర్వహింపబడినది.

పొగాకు గిడ్డంగి :

గుంటూరు జిల్లా పొగాకు ఉత్పత్తిదార్ల, శుద్ధిదార్ల సహకార సంఘం తాలూకు గిడ్డంగికి మే 20 వ తేదీన ఒంగోలులో మునిసిపల్ పరిపాలన శాఖామంత్రి శంకుస్థాపనచేశారు.

హైదరాబాదు జిల్లా

గ్రామలక్ష్మి శిక్షణ శిబిరం :

పరిగిలో పద్నాలుగు రోజులపాటు గ్రామలక్ష్మి శిక్షణ శిబిరం నిర్వహించబడింది.

మహబూబ్ నగర్ జిల్లా

సహకార సంఘం :

బుక్కలోనిపల్లిలో రాష్ట్ర ఆహార వ్యవసాయ శాఖామంత్రి గొర్రెల పెంపకందార్ల సహకార సంఘానికి జూన్ 10 న ప్రారంభోత్సవం చేశారు.

టౌనుహాలు :

పురపాలక సంఘం నిర్మించిన టౌనుహాలుకు మే 24 న మహబూబ్ నగర్ లో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

మెదక్ జిల్లా

వెనకబడిన తరగతుల సమావేశం :

సూరారంలో మే 28 న వెనకబడిన తరగతుల సమావేశానికి పంచాయతీరాజ్ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

నిజామాబాదు జిల్లా

పాఠశాల భవనం :

మదునూరులో జిల్లా పరిషత్తు పాఠశాల భవనానికి మే 28 వ తేదీన ముఖ్య మంత్రి శంకుస్థాపన చేశారు.

కళాశాల భవనం :

కామారెడ్డిలో ఆర్ట్సు, సైన్సు కళాశాలకు మే 30 వ తేదీన ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

కాన్ లాస్ నాలా ఆనకట్ట :

కాన్ లాస్ కోటవద్ద మే 28వ తేదీన ముఖ్యమంత్రి కాన్ లాస్ నాలా ఆనకట్టకు శంకుస్థాపన చేశారు.

కరీంనగర్ జిల్లా

జిల్లా పంచాయతీ పరిషత్తు సమ్మేళన :

కరీంనగర్ జిల్లా పంచాయతీ పరిషత్తు సమ్మేళనానికి ముఖ్యమంత్రి కరీంనగర్ లో మే 30న ప్రారంభోత్సవం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం :

మెట్ పల్లి పంచాయితీ సమితికి చెందిన అంబాజీపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముఖ్యమంత్రి మే 29న ప్రారంభోత్సవం చేశారు.

ప్రాథమిక పాఠశాల భవనం :

పోసానిపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనానికి మే 29న ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు.

కృష్ణాజిల్లా

వంతెనకు ప్రారంభోత్సవం :

బందరుతాలూకాలోని కోకానారాయణ పాలెంవద్ద సాగునీటి కాలువపై ఒకకొత్త వంతెనకు మే 30వ తేదీన ప్రారంభోత్సవము జరిగింది. ఈవంతెనను రూ. 14,000 ల ఖర్చుతో పంచాయితీ నిర్మించింది.

సహకార సంఘం :

జూన్ 2 న విజయవాడలో కేంద్ర సహకారశాఖ డిప్యూటీ మంత్రి కృష్ణా జిల్లా కాయగూరల పెంపకందారుల సహకార సంఘానికి ప్రారంభోత్సవం చేశారు.

దివి తాలూకాలోని నాగాయలంకలో కృష్ణసాగర్ బెస్తల సహకార సంఘాన్ని కూడా కేంద్ర సహకారశాఖ డిప్యూటీమంత్రి జూన్ 2వ ప్రారంభోత్సవం చేశారు.

నెల్లూరుజిల్లా

కార్మికుల కాలనీ :

షా గనులవద్ద 50 యిండ్లుగల కార్మికుల కాలనీకి కేంద్ర కార్మిక శాఖామంత్రి మే 28న శంకుస్థాపన గావించారు.

ప్రగతి పథంలో

కీర్తిశేషులు ఆలపాటికి ముఖ్యమంత్రి శ్రద్ధాంజలి

ప్రియమైన చదువరీ!

చావుకు తరతమ భేదంలేదు. ఆగర్భశ్రీమంతుని మీదా, గర్భ దరిద్రునిమీదా, వీరునిమీదా, భీరువుమీదా — అందరిమీదా సమానంగానే మృత్యువు తన శీతల హస్తాన్ని పరుస్తుంది. మృత్యువు ఎప్పుడొస్తుందో, ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు. ఒక్కొక్కరి విషయంలో అతి భయానకంగా ఆవహిస్తుంది. మరి కొందరి విషయంలో వ్యాధిమీదుగా మళ్ళి, వారి జీవితంమీదుగా ప్రవహించి, ఊపిరి సలపనీయక ముంచివేస్తుంది. అయితే అదృష్టవంతులు కొంతమంది వున్నారు. వారి విషయంలో కుసుమపరాగం ఏ విధంగా గాలిలో కలిసి అదృశ్యమైపోతుందో ఆ విధంగా జీవం అదృశ్యమౌతుంది.

మరణంతో వ్యక్తి అన్ని బంధాలనూ త్రెంచుకుని వెళ్ళిపోతాడు. అందుకే ఆ వ్యక్తి ఆత్మీయులకూ, బంధువులకూ మరణం తీరనివ్యథను కల్గిస్తుంది. అయితే ఆ వ్యక్తి అకస్మాత్తుగా అందరినీ విడిచి వెళ్ళిపోతే అది మరింత దుఃఖాన్నీ, వ్యథనూ కలిగిస్తుంది. ఆ వెళ్ళిపోయిన వ్యక్తి అందరికీ తలలోని నాలుక అయితే ఆ బాధ యిక చెప్పనలవికాదు. మిత్రుడు శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య మరణంవల్ల యిప్పుడు నేను అలాంటి పరిస్థితులలోనే ఉన్నాను.

మనిషి బ్రతికివుండగా అతని గొప్పతనాన్ని గుర్తించలేకపోవడం అనేది మానవ నైజం. ఆ వ్యక్తి మరణించిన తర్వాత అప్పుడు అతని గుణగణాలను గురించి ఆలోచిస్తారు.

నేనూ, ఆలపాటీ — యిద్దరమూ ఒకే జిల్లా — అంటే గుంటూరుజిల్లా — నుంచి వచ్చాం. గత రెండు దశాబ్దాలుగా ఆయన నాకెంతో ఆత్మీయుడు. అతి సామాన్యమైన రైతు కుటుంబంలో నుంచి వచ్చాడాయన. ఆట్టే చదువుకోలేదు. కాని తనలోని సృజనాత్మకమైన శక్తివల్లా, నిరంతరం శ్రమించే గుణంవల్లా ఆయన రాష్ట్ర పరిపాలనా నిర్వహణలో ప్రధానమైన పాత్ర వహించారు.

చిన్ననాటినుండికూడా ఆయన ఉన్నతమైన ఆశయాలతోనూ గాఢమైన దేశాభిమానంతోనూ పెనవేసుకుపోయారు. 1942 ఆగస్టు విప్లవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తన శక్తి యుక్తుల నన్నిటినీ వివిధ సంస్థలను పటిష్టవంతం చేయడానికై వినియోగించారు. జిల్లా కాంగ్రెస్‌కమిటీకి, జిల్లా సెంట్రల్ సహకార బ్యాంకుకు అధ్యక్షుడు ఆయన. తెనాలి పురపాలక సంఘానికి ఛైర్మను. ఎంతో నేర్పుతో సమర్థవంతంగా ఆ పదవులన్నిటినీ ఆయన నిర్వహించారు.




జననము: 9–10–1917 మరణము : 16–6–1965


ఇంతేకాదు స్వయంగా ఆయన సమర్థుడైన నిర్వాహకుడు. ఎలాంటి ఉద్యమాన్నయినా విజయవంతంగా నడపగల శక్తి సంపన్నుడు. ఆయన చేపట్టిన ప్రతిదీ విజయవంత మైంది.

1962లో శ్రీ సంజీవరెడ్డి ఆయనను తన మంత్రి మండలిలోకి తీసుకున్నారు. నా మంత్రివర్గంలో కూడా పనిచేశారు. మున్సిపల్ వ్యవహారాల నిర్వహణ శాఖ మంత్రిగా బాధ్యతలను చక్కగా నిర్వహించారు. సమగ్ర పురపాలక చట్టానికి కారకులు వీరే. హైదరాబాదు, సికిందరాబాదు కార్పొరేషన్లు రెండూ ఏకీకరణం కావడానికి కూడా వీరే కారకులు. జంటనగరాలను శోభాయమానంగా తీర్చి దిద్దటానికి మనోఫలకం మీద ఎన్నో పథకాలను వేసుకున్నారు. కొన్నిటిని ఆచరణలో పెట్టారు కూడా. నిజజీవితంలో వీరు ఎంతో పవిత్రమైన, ఆదర్శవంతమైన జీవితం గడుపుతున్న వ్యక్తి. అందుకే హిందూమత దేవాదాయ, ధర్మదాయశాఖను ఆయన చేతుల్లో పెట్టినప్పుడు మన పురాతన, పవిత్ర ఆలయాలను పునరుద్ధరించడానికీ, వాటి నిర్వహణా తీరుతెన్నులను బాగుపరచడాకీ — పవిత్రమైన ఆ కృషిలో మనస్ఫూర్తిగా ఆయన అంకిత మైపోయారు. నిజానికి సమీకృత హిందూమత దేవాదాయ నిర్వహణకు ఒక బిల్లును ప్రవేశ పెట్టాలని ఆయన చర్యలు తీసుకున్నారుకూడాను.

ఆయన మరణం ఆంధ్రప్రదేశ్‌కు తీరని లోటు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించుగాక.


అంతిమయాత్ర






తెనాలి పురవీధుల నుండి ముందుకు పోతున్న ఊరేగింపు.

కీర్తిశేషులయిన ఆలపాటి మృతదేహాన్ని వారి స్వగ్రామం
యెడ్లపల్లికి ఊరేగింపుగా తీసుకవెళ్ళుతున్న దృశ్యం.





అంత్యక్రియలకు ముందు శ్రద్ధాంజలి ఘటిస్తున్న
ముఖ్యమంత్రి

బాలానందం

తెలివైన పిల్లి

ఒకానొక గ్రామంలో ఒక కట్టెలమ్ముకొనే వాడు ఉన్నాడు. వాడు చనిపోతూ తన ముగ్గురు కొడుకులను పిలచి ఇలా అన్నాడు, "నాయనలారా! ఇక నేను మీకు, ఈ లోకానికి కూడా దూరమై పోతున్నాను. మీరంతా కలిసి మెలిసి ఉండండి. నా దగ్గరున్న ఒక గొడ్డలి, పిల్లి, పెంకుటిల్లు పంచుకోండి" అన్నాడు.

(చనిపోయిన తరువాత) మొదటివాడు వెంకన్న పెంకుటిల్లు, రెండవ వాడు అగు సూరయ్య గొడ్డలి, మూడోవాడు, మన్మధ్ అచ్చం మన్మధుడులా ఉంటాడు; ఆ అందానికితోడు మంచి తెలివి; అతడు పిల్లిని తీసుకున్నాడు.

ఒకరోజున పిల్లి ఓ తోటలోకి వెళ్ళింది. ఒక జామపండును తీసుకొని రాజు భవనానికి వెళ్ళి ఆ పండును తన యజమాని బహుమతిగా మహారాజుకు అందిచ్చింది. అతడు ఎంతో అప్యాయతతో గ్రహించి ఆ మూగపిల్లి తెలివికి లోపలే ఎంతగానో సంతసించాడు.

కొద్ది దినముల తర్వాత మన్మధ్ పంపినట్లు ఏవో తీసుకొని వెళ్ళింది. ఈ సారికూడా రాజుగారు తీసుకొన్నాను. ఇలా ఇలా రాజుకు, మన్మధ్‌కు స్నేహం ఏర్పడింది.

ఒకనాడు మన్మధ్ కాలువ ఒడ్డుకి వెళ్ళి కూచున్నాడు. పిల్లి కూడా అతన్ని అనుసరించింది. మన్మధ్ కాలువలో దిగి స్నానం చేయబోతున్నాడు. బుడుంగున ముక్కు మూసుకుని మునగానే పిల్లికాస్తా అతని బట్ట దాచేసింది.

అదే మార్గంగుండా రాజుగారు పోతున్నారు. పిల్లి గబగబా పరిగెత్తుకుంటూ రాజుదగ్గరికి పోయి "మహారాజా నా యజమాని దుస్తులు ఎవరో కాజేశారు." అని చెప్పగానే సేవకులకు అజ్ఞాపించి వేరే బట్టలు తెప్పించాడు. మన్మధ్ అవి ధరించాడు. రాజు, పిల్లిని మన్మధ్‌ని ఎక్కించుకొని తన భవనానికి వెళ్ళిపోయాడు.

మన్మధ్ రాజుని ఎప్పుడో ఒకప్పుడు విందుకు రమ్మని బ్రతిమాలాడు. రాజంగీకరించాడు.

ఒకరోజు పిల్లి అడవి వైపుకు పోతుంటే ఒక పెద్ద భవనము కనబడింది. దాన్ని చూడగానే పిల్లి ఎంతో ఆనందించి లోపలికి వెళ్ళింది. అక్కడ ఒక పెద్దరక్కసి కనబడింది. వానిని బాగా పొగిడి ప్రార్థించింది. రాక్షసుడు "నేను చాలా మంత్రశక్తులు కలవాడ్ని'' అన్నాడు.

పిల్లి పెద్దజంతువుగా తయారయింది. ఏనుగుగా మారాడు. మళ్ళా పిల్లిగాను, తర్వాత ఎలుకగాను అయ్యాడు. గబుక్కున పిల్లి పంజాతో ఒక దెబ్బకొట్టి చంపి మింగేసింది.

ఆ భవనంలో మన్మధ్, పిల్లి సుఖంగా ఉంటున్నారు. రాజు విందుకు వచ్చే దినం దగ్గరకొచ్చింది.

రాజు విందుకు వస్తూండగా మన్మధ్ వెళ్ళి స్వాగతం చెప్పి ఇంట్లోకి దయచేయమన్నాడు.

విందు అయినతర్వాత కుశలప్రశ్నలడిగి తన జ్యేష్టపుత్రికగు కళ్యాణిని ఇచ్చి పెండ్లి చేస్తానన్నాడు. కట్నరూపంలో అర్ధరాజ్యం ఇచ్చాడు.

పెండ్లి అయింది. చూచారాబాలలూ. పిల్లి ఎంత తెలివైనదో. ఆ పిల్లిలాగే మీరుకూడా తెలివైనవాళ్ళు అవ్వాలి. కాబట్టి దేహబలంకంటే బుద్ధిబలమే గొప్పది" అని చెప్పవచ్చుకదూ!

దురాశ దుఃఖమునకు చేటు

అనగా అనగా ఊరిలో ఒక కోమటి, అతని భార్యా ఉండేవారు. వారు చాలా బీదవాళ్ళు, ఒకరోజున కోమటి "ఒశేవ్ నేను ఇవ్వాళ 4 గంటలకు కాస్త పనిఉండి ప్రక్క గ్రామానికి వెళ్తున్నాను. నాకు అరిసెలుచేసి మూటగట్టిఇవ్వు" అన్నాడు.

అలాగే తయారుచేసి మూటకట్టి ఇచ్చింది. కోమటి రెండుకాళ్ళ బండి మీద (నడుచుకుంటూ) బయలుదేరాడు.

సూర్యాస్తమయము అవుతూంది. మెల్లమెల్లగా చీకటితెరలు క్రమ్ముకొంటున్నాయి. "ఈరేయి కిచ్చటే నిద్రించి సూర్యోదయంకాగానే మర్నాడు ప్రక్క గ్రామానికి చేరుదాము" అనుకొని అక్కడే పడుకొన్నాడు. గాఢంగా నిద్ర పోసాగాడు.

రాత్రి సరిగ్గా 1 గంట అయింది. ఇద్దరు దేవకన్యలు వచ్చి సమీపంలో నున్న చెట్టుక్రింద ఒక మూట చూసి దాన్ని విప్పసాగారు. అరిసెలు కనబడ్డాయి. ఇద్దరు కలిసి శుభ్రంగా తిన్నారు. చాలా కమ్మగా తియ్యగా ఉన్నాయి. దాంటో బంగారు గిన్నె పెట్టి వెళ్ళిపోయారు.

కోమటి లేచాడు. ఆకలేస్తోంది. మూట తీసి తిందామనుకొని విప్పాడు. దాంట్లో ఏమిలేదు. కోపం వచ్చి ఆ

గిన్నెను విసిరికొట్టాడు. అది బోర్లా బోర్లించబడింది దాన్ని తీశాడు. విస్తరి వేసి భోజనం వడ్డించినట్టుగా ఉంది. హాయిగా భోజనం చేసి ఇంకో కునుకు తీశాడు.

ఈలోగా సూర్యాస్తమయం అయింది. ఇంటికి వెళ్ళి జరిగినదంతా భార్యకు చెప్పేశాడు. ఎవరికీ చెప్పవద్దు అన్నాడు. ఊరంతా పిలిచి భోజనాలు పెట్టించాడు.

ప్రక్క ఇంటి పెద్దిశెట్టి ఇదంతా చూచి ఆశ్చర్య పోయాడు. నిన్న మొన్నటి వరకు బీదగా బ్రతికినవాడు ఇవాళ అప్పుడే ఇంత గొప్పవా డెలా అయ్యాడా అని ఎంతో అసూయ చెందాడు. భార్యతో చెప్పి, వీళ్ళకి ఇంత డబ్బు ఎలా వచ్చిందో రహస్యంగా తెల్సుకోమన్నాడు. పెద్దిశెట్టి భార్య వచ్చి గూట్లోంచి కోమటి భార్యను పిలిచి "ఏమండీ పిన్నిగారూ, మీకీ డబ్బంతా ఎలావచ్చింది ?" అని అడగ్గానే ఆ అమాయకురాలైన. కోమటి భార్య చెప్పేసింది. పెద్దిశెట్టి కూడా ప్రయాణము చెయ్యబోయాడు. ఈ సంగతి జరిగిన తర్వాత ఆ భార్యాభర్త లిద్దరికీ ఏదో తగాదా వచ్చింది. ఆ రోజు సాయంత్రమే పెద్దిశెట్టి ప్రయాణం. అతడు తీపితీపిగా గారెలు చేయమంటే ఘాటైన కారపు గార్లు చేసిపెట్టింది.

మామూలుగా ఆ సంచి తీసుకొని చెట్టుదగ్గిరే పడుకున్నాడు. ఓ కన్ను మూసి ఓ కన్ను తెరుస్తూ ఎప్పుడొచ్చి తింటారా అనే ఆలోచిస్తూ ఉన్నాడు. ఈలోగా వాళ్ళొచ్చి తినేసి. ఈ వెధవ కారపుగార్లు తెచ్చాడు వీడిపని ఒదిలిద్దామని దాంట్లో వెండిగిన్నె పెట్టి చక్కాపోయారు.

ఇతడు చాలా దురాశ గలవాడు ఇక్కడే తింటే అన్నము అయిపోతుందేమో అనే అనుమానంతో మామూలుగా గిన్నె పట్టుకొని వెళ్ళిపోయాడు. అందరినీ భోజనాలకి పిల్చాడు. గిన్నె వడ్డించగానే దాంట్లోంచి కి మనుష్యులు వచ్చారు. ఒకడి చేతిలో మంగలిపని చేసే పెట్టె ఉంది. వాడు ఒక్కొక్కళ్ళకే ఆడవాళ్ళకి, మొగవాళ్ళకి అందరికీ క్షవరం చెయ్య మొదలెట్టాడు.

అంతా నెత్తీ నోరూ మొత్తుకుని ఎవరి దోవ వాళ్ళు పట్టారు. చివరకి ఆ పెద్దిశెట్టికీ భార్యకీ కూడా క్షవరం చేశారు. వారు లబోదిబో మంటూ పడవడం మొదలుపెట్టారు. చూచారా బాలలూ ! దురాశ ఎంత దుఃఖం తీసుకొస్తుందో. మీరెప్పుడూ కూడా దురాశ పడకండి. "ఉన్న దానిలో తృప్తియున్నది. లేనిదానిలో ఆశలేదు." అన్నాడు సంధ్యశ్రీ. (అమాయక నాటక కర్త.) కాని ఉన్నదానిలో తృప్తి ఎక్కడుంది. ఇంకా ఎన్నో తలుచుకొని అవన్నీ ఫలించాలని. ఎన్నో ఆశలలో పగటికలలు కంటున్నారు. లేనిదానిలో ఆశ లేదుకదా ! అని ఆశ లేకుండా ఉంటున్నారా ! ఉండటం లేదు.

ఆశ అనేది మన మానవ జీవితంలో ఒక ప్రముఖస్థానం ఆక్రమించింది. ఆశ లేకపోతే మనము బ్రతకలేము. కాని దురాశ ప్రాణానికి హాని కల్గ జేస్తుంది. జ్ఞాపక ముంచుకోండేం బాలకులారా !

యస్. సూర్యనారాయణమూర్తి

(50 పేజీ తరువాయి)

వేసుకుని ఉన్నది. మెడలో నెక్లెసొకటి మెరుస్తున్నది. చెవులకు జుంకీ లున్నాయి. చేతులకూ్కడా రాళ్ళుతాపినగాజు లున్నాయి.

పాపం పిన్ని విన్నరాత్రి నర్సును చూస్తే. ఈ పూట నాకీ పిల్లను ఇంత ఇదిగా చూపించిఉండదు.

"అబ్బో. ఇంత అందమైన పిల్లను నాకిస్తారా పిన్నీ ? దురాశ పెట్టుకోకు." అనేశాను.

పిన్ని పిచ్చిది. నా తరపున పౌరుషం తెచ్చుకుంటూ, "ఇంకా నయం ! నీకన్న మంచి సంబంధం తెస్తారా వాళ్ళు ? చూస్తాంగా !" అన్నది. అప్పుడే మేమడిగినట్టూ వాళ్ళు నిరాకరించినట్టూ !

ఆ రోజల్లా విడిదిలోనే గడిపి, కాలేజీ ఎగ్గొట్టేశాను. ఆ వాతావరణం నాకు మత్తెక్కించింది. ఆడవాళ్లూ, చీరెలూ, పూలూ, గాజుల చప్పుడూ నామీద వీస్కీ బ్రాందీల బాబులాగా పనిచేశాయి. ఏ జన్మలోనో నేను నవాబునూ, సుల్తానునూ, మహారాజునూ. అది నా అంతఃపురం. అందులో ఉన్న వందలాది స్త్రీలంతా నా భార్యలు. నాకు స్త్రీ దారిద్ర్యం లేదు. నా స్త్రీ సంపదకు పరిమితిలేదు. అటువంటి పగటి కలలో కన్ను మూసుకుని ఆఖరు క్షణందాకా ఆడవాళ్ళ గాజుల చప్పుడూ, నవ్వులూ ఆలకిస్తూ గాఢ నిద్రలో పడిపోయాను.

(సశేషం)

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

మే 18: మల్లికార్జున భ్రమరాంబా దేవాలయంలోని శివాజీ గోపురం పునరుద్ధరణ కార్యానికి కేంద్ర ఉక్కు, గనుల మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

మే 26: హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషను తాలుకు సికింద్రాబాదు డివిజన్ భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

మే 27: ఆంధ్రప్రదేశ్‌లో జవహర్లాల్ నెహ్రూ స్మారకనిధికి గవర్నరు హైదరాబాదు నగరంలో ప్రారంభోత్సవం చేశారు.

మే 30: తిరుపతిలో తృతీయ అఖిలభారత తెలుగు రచయితల మహాసభలు ప్రారంభ మయ్యాయి.

జూన్ 9: తొమ్మిది తెలంగాణా జిల్లాల కలెక్టర్లు హైదరాబాదులో సమావేశ మయ్యారు.

జూన్ 11: కృష్ణజలాలను నాగార్జునసాగర్ వద్ద సొరంగంద్వారా మళ్ళించడానికి రాష్ట్ర పబ్లిక్ వర్క్సు శాఖామంత్రి ప్రారంభోత్సవం చేశారు.

జూన్ 13: ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్సు అండ్ డ్రగిస్టుల అసోసియేషన్ 19 వ వార్షిక సమావేశానికి రాష్ట్ర ఆర్థికమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

జూన్ 16: మునిసిపల్ వ్యవహారాల నిర్వహణ, గృహవసతి, దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య హైదరాబాదులో స్వర్గస్థులయ్యారు.

భారత దేశంలో

మే 20: భారత అధిరోహక బృందం ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించింది.

అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్రపతి ఒక ఆర్డినెన్స్‌ను జారీచేశారు.

మే 26: ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలుదారీ (సవరణ) బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది.

మే 29: ఎవరెస్టు శిఖరాన్ని వరుసగా నాలుగుసార్లు అధిరోహించి భారతీయ ఎవరెస్టు శిఖరారోహణా బృందం చరిత్రలోనే కొత్త ప్రమాణాలను నెలకొల్పింది.

మే 31: 20 మందికన్న ఎక్కువ మంది కార్మికులు గల సంస్థలలో కార్మికులందరికీ జీతంలో 4 శాతం నిర్బంధ బోనసును యిచ్చే విధంగా రాష్ట్రపతి ఒక ఆర్డినెన్సును జారీచేశారు.

జూన్ 5: శ్రీనగర్‌లో రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర విద్యాశాఖ మంత్రుల సమావేశం ప్రారంభ మయ్యింది.

జూన్ 6: రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర హోంమంత్రుల సమావేశానికి కొత్త ఢిల్లీలో ప్రధాని ప్రారంభోత్సవం చేశారు.

విదేశాలలో

మే 20: మూడు రోజులపాటు పర్యటించే నిమిత్తం ఉపరాష్ట్రపతి డా. జకీర్ హుస్సేన్ కువాయట్‌కు చేరుకున్నారు.

మే 23: సౌదీ అరేబియాలో ఆరు రోజులపాటు పర్యటించే నిమిత్తం ఉపరాష్ట్రపతి రియాద్ చేరుకున్నారు.

మే 25: రష్యాలో పదిరోజులపాటు పర్యటించే నిమిత్తం కేంద్ర ఉక్కు, గనుల మంత్రి మాస్కో చేరుకున్నారు.

మే 29: జోర్డాన్‌లో మూడు రోజులపాటు పర్యటించే నిమిత్తం ఉపరాష్ట్రపతి ఏమన్ చేరుకున్నారు.

మే 31: టర్కీలో ఆరు రోజులపాటు పర్యటించే నిమిత్తం ఉపరాష్ట్రపతి అంకారా చేరుకున్నారు.

జూన్ 1: దక్షిణ జపానులోని యామనో బొగ్గుగనుల్లో ప్రేలుడు ప్రమాదం జరిగింది.

జూన్ 6: గ్రీకులో అయిదు రోజులపాటు పర్యటించే నిమిత్తం ఉపరాష్ట్రపతి ఏథెన్సు చేరుకున్నారు.

జూన్ 9: కైరోలో ఒకరోజు పర్యటన నిమిత్తం ప్రధాని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి కెయిరో చేరుకున్నారు.


జూన్ 10: కెనడాలో అయిదు రోజులపాటు పర్యటించే నిమిత్తం ప్రధాని అట్టావా చేరుకున్నారు.


లండన్‌లో బ్రిటిష్ ప్రధాని, నెహ్రూ స్మారక ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు.

జూన్ 15: ప్రధాని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి లండన్ చేరుకున్నారు.

జూన్ 17: లండన్‌లో కామన్వెల్తు ప్రధానుల సమావేశం ప్రారంభ మయింది.

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad
Printed at YUVA PRESS, Public Garden Road, Hyderabad.





Regd. No. H. 133